www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


5 కోట్ల మందికి ఆరోగ్య బీమా
విధివిధానాలు రూపొందించండి
ఆరోగ్యశాఖ అధికారులకు సీఎం ఆదేశం
కొత్త వైద్య కాలేజీల నిర్మాణ తీరుపై అసహనం
ఒక్కో కళాశాల నిర్వహణకు ప్రభుత్వంపై
ఏటా రూ.135 కోట్ల భారం: చంద్రబాబు
11

బుధవారం | 10-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 85 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ. 7.52 తదుపరి పంచమి; నక్షత్రం: మఖ ఉ. 10.15 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా. 7.11-8.58; దుర్ముహూర్తం: ఉ. 11.54-12.56; అమృతఘడియలు: ఉ.7.36-9.22; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టారిఫ్‌కు కట్టడి!

కోతల్లేని కరెంటు ఇస్తాం.. ఇంధన రంగాన్ని గాడిలో పెడతాం
గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్.. శ్వేతపత్రం విడుదల సందర్భంగా సీఎం

జగన్ తీరుతో వినియోగదారులకు నరకం
పేదోళ్లపై భారంవేసి పెత్తందార్లకు మేలు
పీపీఏలను రద్దు చేయబోం
గృహాలకు స్మార్ట్ మీటర్లపై సమీక్షిస్తాం
వ్యవసాయ పంప్‌సెట్లకు స్మార్ట్ మీటర్లపై త్వరలో నిర్ణయం.. సోలార్ ప్యానళ్ల యోచన
సామాన్యులు, మేధావులు, మీడియా సలహాలు తీసుకుంటాం: చంద్రబాబు



జగన్ హయాంలో కరెంట్ బిల్లుల బాదుడు తీరును వివరిస్తున్న సీఎం చంద్రబాబు

"జగన్ చేసిన పనులతో రాష్ట్రం విష వలయంలో కూరుకుపోయింది. బొగ్గు కొనకపోతే కరెంటు ఉండదు. బొగ్గు కొనడానికి డబ్బులు కావాలి. విద్యుత్ సంస్థలను పీకల్లోతు అప్పుల్లో దించి పోయారు. ఖజానాలో డబ్బులు లేవు. అప్పులు రావు. అయినా నాణ్యమైన కరెంటు ఇవ్వాలి. కోతలు రానీయకూడదు. తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు పెట్టుకొని ముందుకు వెళ్తున్నాం"
- చంద్రబాబు

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంధన రంగాన్ని గాడిలో పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. విద్యుత్తు రంగంలో 3.0విధానం అమలుచేస్తామనీ, టారిఫ్‌ను నియంత్రిస్తామనీ వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ఇందనరంగంపై ఆయన శ్వేత పత్రం విడుదల చేశారు. రాష్ట్రంలో కోతల్లేని కరెంటు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరెంటు కోతలు ఉన్నాయని తనకు ఫిర్యాదులు వస్తున్నాయంటూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను చూస్తూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. విద్యుత్తు సరఫరాపై నిరంతర నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తామనీ, ఎక్కడైనా అకారణంగా విద్యుత్తు కోతలు ఉంటే .. సంబంధిత ఉద్యోగిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గత వైసీపీ పాలనలో పేదోడిపై భారం వేసేలా విద్యుత్తు చార్జీలు ఉన్నాయన్నారు. తరచూ తాను

మిగతా 11వ పేజీలో...

కష్టాల కడలిలో కరెంటు
జగన్ షాక్‌లతో కునారిల్లిన విద్యుత్ రంగం
నాడు బాబు దిగిపోయేనాటికి మిగులు విద్యుత్
కొంటేగానీ కరెంటు లేని స్థితికి నేడు రాష్ట్రం
విద్యుత్తు రంగ భారం రూ.1,28,503 కోట్లు
సెకీ ద్వారా దొడ్డిదారిన అదానీతో 7 వేల మెగావాట్ల సోలార్ కొనుగోళ్లతో రూ.96,250 కోట్ల భారం
విద్యుత్తు రంగంలో 3.0 రావాల్సిందే
శ్వేతపత్రంలో కళ్లు చెదిరే నిజాలు
'ఆంధ్రజ్యోతి' కథనాలన్నీ అక్షర సత్యాలేనని తేటతెల్లం
11

బుద్ధీజ్ఞానం లేని
వింత పశువులు
ఉచిత ఇసుకను కూడా తప్పుబడతారా?
మార్కెట్లో రేటు పడిపోయిందనే ఏడుపు: సీఎం
రవాణా ఖర్చులు, జీఎస్టీ ఎవరైనా చెల్లించాల్సిందే
ప్రభుత్వమే ఇళ్లకు తీసుకెళ్లి ఇవ్వడం సాధ్యమా?
గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు దిద్దుతున్నాం
విచారణలు, దర్యాప్తులతో కాలం గడపలేం
ఆ భూతాన్ని శాశ్వతంగా సమాధి చేస్తాం: బాబు



ప్రక్షాళన ఆరంభం
జగన్ వీరవిధేయులపై కొరడా.. సీనియర్ ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాశ్‌తో మొదలు
ఆయన వీఆర్ఎస్‌కు ప్రభుత్వం ఓకే.. 3 నెలల నోటీసు గడువు ఇంకా ఉండగానే ఉత్తర్వులు
మిగతావారికి గట్టి హెచ్చరిక పంపేందుకే!
వ్యవస్థలను భ్రష్టుపట్టించినవారిపై ఆరా
మూడొంతుల మంది ఇలాంటివారే!
అంతమందిని తప్పించాలంటే ఐఏఎస్‌ల కొరత
అందుకే జల్లెడ పట్టి పరిమిత సంఖ్యలో చర్యలు!

త్వరలో మరో ఇద్దరు ముగ్గురికి ఉద్వాసన?
(అమరావతి-ఆంధ్రజ్యోతి)
గత ఐదేళ్ల కాలంలో జగన్‌తో అంటకాగి.. ఐఏఎస్ అధికారులమన్న మాటే మరచి.. పక్త వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరించిన అధికారులపై వేటు మొదలైంది. జగన్ హయాంలో తానే సూపర్ సీఎం అన్నట్లుగా.. నియంతను తలపించేలా ప్రవర్తించిన సీనియర్ ఐఏఎస్ అధికారి

మిగతా 11వ పేజీలో...



మన్యం గనులపై పంజా!
టన్నుకు ఎంత ఇస్తారో తేల్చండి
లేదంటే ఖబడ్దార్.. నేను సిగ్నల్ ఇస్తేనే మీకు వ్యాపారం
బెజవాడలో మీటింగ్ పెట్టి మరీ కాకినాడ నేత సతీశ్ వార్నింగ్?
కొత్త ప్రభుత్వంలో గుత్తాధిపత్యానికి ఆరాటం
లీజుదారులను పిలిచి సమావేశం
మన్యం గనులపై సర్వాధికార ప్రకటన
వ్యతిరేకించినవారికి గట్టి హెచ్చరికలు
పవర్ బ్రోకర్‌గా అత్యంత వివాదాస్పదుడు
మనీలాండరింగ్ సహా సీబీఐ, ఈడీ కేసులు
ఆయన గుప్పిట 65 వేల టన్నుల లేటరైట్!
గనుల దందాను పర్యవేక్షిస్తున్న కాకికాడకు చెందిన ఓ అధికారి!!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
మన్యంలో అలజడి మొదలైంది. గత జగన్ సర్కారులో ఆయన బంధువులు, సోదరులు, ఓ ముఖ్య అధికారి కుమారుడు, మేనల్లుడు.. గనులపై గద్దల్లా వాలి రూ. కోట్లు వెనకేసుకున్నారు. అసలైన లీజుదారులు, హక్కుదారులను అడవిపాల్జేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. గతంలో గనులపై వాలినవారు తప్పుకొన్నారు. ఇప్పుడూ అదే పనిచేసేందుకు కొందరు తహతహలాడిపోతున్నారు. రూపాయి పెట్టుబడి లేకుండా కోట్లరూపాయల తెరచాటు దందాలు చేసేందుకు పావులు కదుపుతున్నారు. కాకినాడకు చెందిన సతీశ్ అనే వ్యక్తి అంతా తానై చక్రం తిప్పడానికి ప్రయత్నిస్తున్నారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల పరిధిలో లేటరైట్ లీజులున్న వారిని, కాంట్రాక్టు లీజుదారులు, క్రషర్స్ యూనిట్ల నిర్వాహకులను ఇటీవల విజయవాడకు పిలిపించి ఆయన గట్టిగా హెచ్చరించారు. మన్యంలోని గనుల వ్యాపారం ఇక ముందు తన నిర్వహణలోనే

మిగతా 12వ పేజీలో...


చందన్ దేశిరెడ్డి ద్వారకా గుండా
సంతోష్ కట్కూరి అనిల్ మాలె

నకిలీ కంపెనీలు.. బలవంతపు చాకిరీ!
అమెరికాలో నలుగురు తెలుగువారి అరెస్టు.. వారిలో ఒకరు మహిళ
100 మందికిపైగా ఉద్యోగులతో అక్రమంగా కంపెనీల నిర్వహణ
అమెరికావ్యాప్తంగా పలుచోట్ల నెట్‌వర్క్
10


3

ఓఆర్ఆర్‌కు మహర్దశ!
కేంద్ర బడ్జెట్‌లో నిధులు..
రూ.5-10 వేల కోట్లు ఉండొచ్చని అంచనా
రూ.25 వేల కోట్ల సవరణ అంచనాలతో ఔటర్ రింగ్ రోడ్డుకు ఇప్పటికే అంగీకారం
జగన్ నిర్లక్ష్యంతో 8 వేల కోట్ల వ్యయం పెంపు

పూరీ 'రత్న భండార్'ను 14న తెరవాలి
అవసరమైతే తాళం విరగ్గొట్టాలి
జగన్నాథ మందిర కమిటీకి ఉన్నత స్థాయి సంఘం సిఫారసు
10


ప్రధాని మోదీకి రష్యా అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్ర్యూ ది అపోస్టల్'ను అందజేసిన పుతిన్

అణు సహకారం
భారత్‌లో 6 హైపవర్ అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి రష్యా తోడ్పాటు
లో-పవర్ అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు కూడా!
ఆ దేశ అణు ఇంధన సంస్థ అధిపతి వెల్లడి
భారత్‌లో ఫ్లోటింగ్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్లపై ఇరుదేశాల మధ్య కొన్నాళ్లుగా జరుగుతున్న చర్చలు
10

యుద్ధరంగం పరిష్కారం చూపదు
బాంబులు, తుపాకులతో శాంతి చర్చలు కుదరవు
ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి సహకరిస్తాం
భారత్-రష్యా శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ

సంక్షేమం సున్నా.. సాధికారత శూన్యం!
ఎస్‌బీఐ నివేదిక పేరిట రోత పత్రికలో సొంత డబ్బా
సత్యాలకు పాతర.. అసంబద్ధాల జాతర
ఆ సంస్థ అధ్యయనానికి ఆధారం బడ్జెట్ పుస్తకాలే
వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన సమాచారమే కీలకం
వాస్తవాలు కప్పిపుచ్చుతూ.. రోత పత్రికలో రాతలు

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): 'సంక్షేమం.. సాధికారత' అంటూ జగన్ రోత పత్రికలో ఆయన ఐదేళ్ల ఏలుబడి గురించి డప్పు కొట్టుకున్నారు. ఎస్‌బీఐ అధ్యయన నివేదిక అంటూ ఓ కథనాన్ని అచ్చేశారు. వాస్తవాలను కప్పిపుచ్చుతూ.. రోత రాతలతో ప్రజల కళ్లకు అక్షరాల గంతలు కట్టే ప్రయత్నం చేశారు. వాస్తవానికి జగన్ పాలన 'సంక్షేమం సున్నా-సాధికారత శూన్యం'గానే 'ఐదేళ్ల కళ్లుమూసుకుంటే'

మిగతా 10వ పేజీలో...

QIS COLLEGE OF ENGINEERING & TECHNOLOGY (AUTONOMOUS)

QIS EDUCATIONAL INSTITUTIONS · 26 ACADEMIC EXCELLENCE · SRI NIDAMANURI EDUCATIONAL SOCIETY

ACCREDITED WITH GRADE A+ NAAC · NBA TIER-I · AICTE IDEA Lab · nirf NATIONAL INSTITUTIONAL RANKING FRAMEWORK FOR INNOVATION 2023 · INSTITUTION'S INNOVATION COUNCIL (Ministry of HRD Initiative)

Most Reputed **Autonomous** Engineering College in the State of Andhra Pradesh / Nation

NATIONAL INSTRUMENTS · DASSAULT SYSTEMES · ARC APPLIED ROBOT CONTROL

CENTRE OF EXCELLENCE WITH virtusa

Rs.25000/- Stipend per month during internship for UNISYS selected students

QIS COLLEGE OF ENGINEERING & TECHNOLOGY

B.Tech	Computer Science and Engineering
	Computer Science and Engineering (Data Science)
	Computer Science and Engineering (Artificial Intelligence and Data Science)
	Computer Science and Engineering (Artificial Intelligence and Machine Learning)
	Computer Science and Engineering (IOT and Cyber Security with Block chain Technology)
	Computer Science and Information Technology
	Information Technology
	Artificial Intelligence
	Electronics and Communication Engineering
	Electrical and Electronics Engineering
	Civil Engineering
	Mechanical Engineering
M.Tech	Computer Science and Engineering
	VLSI and Embedded Systems
	Transportation Engineering
	Structural Engineering
	Power Electronics and Power Systems
	Thermal Engineering

JNTUK recognised research centers in CSE, ECE, EEE, Mech

BCA : 60

MBA : 90

MCA : 180

COUNSELLING CODE **QISE**

QIS COLLEGE OF PHARMACY

ESTD : 2006

B.Pharm - 100
Pharm.D. - 30
Pharm.D PB - 10

M.PHARM :

Pharmaceutics	15
Pharmaceutical Analysis	15
Pharmacology	15

COUNSELLING CODE **QISP**

Placement Summary

1018+ Placement Offers Still continuing....

9 LPA Highest Salary Package Offered

56+ Top Companies Visited

5.5 LPA Average Package Offered





Dr. N.S.KALYAN CHAKRAVARTHY
B.E., M.Tech.(CSE), Ph.D
Secretary & Correspondent
Sri Nidamanuri Educational Society
Cell : 99499 99977

QUALITY EDUCATION · AICTE IDEA LAB · BEST CAMPUS LIFE · TOP NOTCH PLACEMENTS · INCUBATION & ENTREPRENEUR CENTERS · BEST SKILLING, RESEARCH & PROJECT CENTERS · SPORTS, NCC & BEYOND



Awarded as unique engineering college for innovation and research in A.P.

Received award of excellence 2023 from ministry for higher education, Govt. of A.P.

KALYANI ADS



Admissions Contact
9246419545, 9246419547, 9246419579, 9246419527

VENGAMUKKAPALEM, ONGOLE.

ఓఆర్ఆర్‌కు మహర్దశ!

- కేంద్ర బడ్జెట్‌లో నిధులు
- రూ.5-10 వేల కోట్లు ఉండొచ్చని అంచనా

విజయవాడ, జూలై 9(ఆంధ్రజ్యోతి): అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)కు మహర్దశ పట్టనుంది. దీనికి ఇప్పటికే అనుమతిచ్చిన కేంద్రం ఈ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించేందుకు వీలుగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేయనున్నట్టు తెలుస్తోంది. త్వరలో ప్రవేశ పెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర రహదారుల ప్రాజెక్టులకు సంబంధించి ప్రధానంగా అమరావతి ఓఆర్ఆర్‌కు కేటాయింపులు ఉంటాయని సమాచారం. ఓఆర్ఆర్ మొత్తం 189 కిలోమీటర్లు. దీనిని రూ.25 వేల కోట్ల వ్యయంతో నిర్మించేందుకు కేంద్రం అనుమతి తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో ఓఆర్ఆర్‌కు కేటాయింపులు చేసే అవకాశాలున్నాయని జాతీయ రహదారి సంస్థ అధికార వర్గాలు కూడా చెబుతున్నాయి. ఈ ఏడాది బడ్జెట్‌లోనే రూ.5 వేల నుంచి 10 వేల కోట్లు కేటాయించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. రాష్ట్రం ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితులలో భూ సేకరణ వ్యయం కూడా కేంద్రమే భరించాల్సిందిగా ముఖ్య మంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రి గడ్కరీని కోరారు. ప్రస్తుతం ఈ ఖర్చు రూ.10 వేల కోట్ల వరకు చేరుకుంటుందని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలో రూ.10 వేల కోట్లను భరించే పరిస్థితి లేకపోవటంతో సీఎం చంద్రబాబు భూసేకరణ ఖర్చును కూడా కేంద్రమే భరించేలా ఒప్పించే ప్రయత్నం చేశారు. దీనికి కేంద్రం కూడా అంగీకరించటంతో.. పూర్తిగా కేంద్రమే నిర్మించే అవకాశం ఉంది.

జగన్ నిర్లక్ష్యంతో..

వాస్తవానికి ఓఆర్ఆర్ ప్రాజెక్టును ఐదేళ్ల కిందటే ప్రతిపాదించారు. అయితే.. జగన్ సర్కారు రాజధానితోపాటు ఈ రహదారిని కూడా తుంగలో తొక్కింది. దీంతో ఇప్పుడు అంచనా వ్యయం పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. గతంలో రూ.17 వేల కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఓఆర్ఆర్‌కు ప్రస్తుత ధరల మేరకు రూ.25 వేల కోట్ల వ్యయం అవుతుందని భావిస్తున్నారు.

ఇదీ ఓఆర్ఆర్ స్వరూపం..

- ఓఆర్ఆర్ మొత్తం 189 కిలోమీటర్లు..
- తూర్పు భాగంలో 78 కిలోమీటర్లు
- పశ్చిమ భాగంలో 111 కిలోమీటర్లు
- 3 దశల్లో, 11 ప్యాకేజీల్లో ఓఆర్ఆర్ నిర్మాణం
- 6 లేన్లతో యాక్సెస్ కంట్రోల్ ఎక్స్‌ప్రెస్‌వేగా అభివృద్ధి
- ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో విస్తరణ
- 22 మండలాల పరిధిలోని 87 గ్రామాల మీదుగా నిర్మాణం
- ఓఆర్ఆర్‌లో మొత్తం తొమ్మిది ఇంటర్ చేంజ్‌లు
- కొండ ప్రాంతాలలో మూడు టన్నెల్స్ నిర్మాణం
- మొత్తం 14 ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం
- కృష్ణానది మీద రెండు బ్రిడ్జిలు ఏర్పాటు.
- మొత్తం 78 అండర్‌పాస్‌ల నిర్మాణం

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ధనమదం!

ముంబైలోని వర్లీలో మద్యంమత్తులో బీఎండబ్ల్యూకారును అతివేగంగా నడిపి ఒక మహిళను చంపివేసిన మిహిర్ షా అనే వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టుచేశారు. మూడురోజులుగా పరారీలో ఉన్న అతడిని పట్టుకోవడానికి ఏకంగా పదకొండు పోలీసు బృందాలు రాష్ట్రాన్ని జల్లెడపట్టాల్సివచ్చిందట. ఈ ధనిక యువకుడు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే వర్గానికి చెందిన రాజేష్ షా అనే నాయకుడి కుమారుడు కావడంవల్లనే అరెస్టులో ఇంత తాత్సారం జరిగిందని, ప్రమాదం సమయంలో మద్యం తాగివున్న రుజువులు నాశనం చేయడానికి పోలీసులు ఉద్దేశపూర్వకంగా ఈ జాప్యం చేశారన్నది విపక్షనేతల ఆరోపణ. ఈ కేసులోనే కాదు, భవిష్యత్తులోనూ ఈ తరహా హిట్ అండ్ రన్ కేసుల విషయంలో తాను కఠినంగా వ్యవహరిస్తానని, పోలీసుల పనిలో ఎవరిజోక్యమూ లేకుండా చూస్తానని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రజలకు హామీ ఇస్తున్నారు.

ఇటువంటి ఘటనలను రోడ్డు ప్రమాదాలుగా కాక, ధనమదంతో చేసిన హత్యలుగా అభివర్ణించడం సముచితంగా ఉంటుందేమో. అతి ఖరీదైన, అధిక అశ్వశక్తిగల కార్లు కొనడం, వాటిని విపరీతమైన వేగంతో నడిపి సామాన్యుల ప్రాణాలు తీయడం ఇటీవల తరచుగా జరుగుతోంది. దీనికి మద్యం మత్తుకూడా తోడైనప్పుడు ఎదుటివారి ప్రాణాలు తృణప్రాయమైపోతాయి. వొర్లి ఘటన మనసు కలచివేస్తుంది. ఆదివారం ఉదయం ఐదున్నర సమయంలో నిందితుడు మద్యం మత్తులో కారు అతివేగంగా నడుపుతూ ముందువెళుతున్న స్కూటీని ఢీకొట్టాడు. దీంతో స్కూటీపై ఉన్న దంపతుల్లో భర్త పక్కకు ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డాడు. కానీ, కారుముందుభాగంలో చిక్కుకుపోయిన నలభైఐదేళ్ళ కావేరీ నక్వాను నిందితుడు కిలోమీటరున్నర వరకూ ఈడ్చుకుపోవడంతో ఆమె శరీరం ఛిద్రమై మరణించింది. కారు ఆపమని వేడుకుంటూ భర్త కేకలు వేస్తున్నప్పటికీ వారు లక్ష్యపెట్టలేదు. సంఘటనస్థలానికి చాలా దూరంలో ఆపి, సదరు నిందితుడు, అతడి డ్రైవర్ కలసి ఆమె శరీరాన్ని కారునుంచి విడదీశారు. ఆ తరువాత డ్రైవింగ్ సీటులో ఉన్న మిహిర్ షా స్థానంలోకి పక్కనే ఉన్న డ్రైవర్ వచ్చి కూర్చున్నాక కారు మరోమారు కావేరీ నక్వా శరీరంమీద నుంచి పోనిచ్చి అక్కడనుంచి తప్పించుకున్నారు. తమ స్కూటీని గుద్దిన వెంటనే మిహిర్ షా కారు ఆపివుంటే తన భార్య కచ్చితంగా జీవించేదని భర్త గట్టిగా చెబుతున్నాడు. చాలా దూరం కారువెనుక అరుస్తూ, ఏడుస్తూ పరిగెత్తినా మిహిర్ మనసు కరగలేదని, ఒక్క క్షణం కారును ఆపివుంటే సరిపోయేదని అతడు అంటున్నాడు.

నిందితుడిని ఇంతకాలమూ దాచిన వారందరినీ పోలీసులు అరెస్టుచేశారు కానీ, మిహిర్ అరెస్టులో ఈ సుదీర్ఘజాప్యం వల్ల కేసు బలహీనపడుతుందన్న భయాలైతే ఉన్నాయి. ప్రమాదానికి ముందు అతడు బార్‌లో నలుగురు స్నేహితులతో గడపడం, వేలాది రూపాయలు బిల్లు చెల్లించడం వంటి ఆధారాలున్నప్పటికీ, ప్రమాదం జరిగినప్పుడు మిహిర్ షా తాగివున్నాడని, ఆ సమయంలో అతడి శరీరంలో ఇంత మొత్తం ఆల్కహాల్ ఉన్నదనే విషయాలు రుజువుచేయడం కష్టం కావచ్చు. ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్న డ్రైవర్, తానే యాక్సిడెంట్ చేశానని దబాయించినపక్షంలో అది అబద్ధమని రుజువుచేయడం కూడా పోలీసులకు కష్టం కావచ్చు.

ఈ దారుణానికి సంబంధించి ఇప్పుడు వినబడుతున్న కథనాలు, పోలీసుల వాదనలూ రేపు న్యాయస్థానాల్లో నిలుస్తాయన్న నమ్మకమేమీలేదు. రెండునెలల క్రితం పూణేలో ఇదే తరహాలో జరిగిన పోర్షే కారు ప్రమాదం దేశాన్ని కుదిపేసింది. రెండుకోట్ల ఖరీదైన లగ్జరీ కారును మద్యం మత్తులో రెండువందలయాభై కిలోమీటర్ల వేగంతో నడుపుతూ ఒక మైనర్ బాలుడు చేసిన ఈ అకృత్యానికి ఇద్దరు యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు దుర్మరణం పాలైనారు. రియలెస్టేట్ వ్యాపారి అయిన తండ్రి ఇంకా రిజిస్ట్రేషన్ కూడా కాని ఆ కారును కొడుకు చేతుల్లో పెడితే, ఆ మైనర్ కుర్రాడు బార్‌లో పూటుగా తాగి ఈ ఘోరానికి కారకుడైనాడు. ఇద్దరిని ఇలా హత్యచేసినప్పటికీ, ఇంకా పిల్లవాడే కనుక ఓ మూడువందల పదాల్లో వ్యాసం రాయించి, జువనైల్ బోర్డు బెయిల్ మంజూరు చేయడం, ఆ బెయిల్ వచ్చేలోగా ఆ కుర్రవాడికి పోలీసులు రాచమర్యాదలు చేయడం వంటి పరిణామాలు సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. ప్రజాగ్రహానికి జడిసి నాయకులూ పోలీసులూ ఆ తరువాత గట్టిగా వ్యవహరించక తప్పలేదు. ఆశ్చర్యకరంగా జువనైల్ బోర్డు కూడా తన మనసు మార్చుకుంది. ధనికులు తమ ఖరీదైన కార్లతో సామాన్యుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్న ఘటనలు వేగంగా పెరుగుతున్నాయి. ధనబలం, నిర్లక్ష్యం, ఇతరుల ప్రాణాలపట్ల లెక్కలేనితనంతో పాటు, డబ్బుతో దేనినైనా సాధించగలమన్న ధైర్యం ఈ తరహా ఘటనలకు దోహదం చేస్తున్నమాట నిజం.

18వ లోక్‌సభ సవ్యంగా జరిగేనా?

‘ఇప్పటి వరకు జరిగిందంతా ట్రైలర్, ఇక ముందుముందు అసలు పిక్చర్ కనపడుతుంది’ అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ లోక్‌సభ ఎన్నికలకు ముందు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఇదే విషయాన్ని గత వారం ఆయన రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ఇచ్చిన సమాధానంలో మరో రకంగా చెప్పారు. గత పదేళ్ల బీజేపీ పాలన భోజనానికి ముందు సేవించే అపిటైజర్ (సూప్) మాత్రమేనని ఇక ప్రధాన భోజనం వడ్డించడం ప్రారంభమైందని ఆయన అన్నారు. బహుశా ప్రతిపక్షాలు కూడా ఇదే ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయి. గత పదేళ్లూ బీజేపీకి పూర్తి మెజారిటీ వచ్చినందువల్ల పార్లమెంట్‌లో వారు ఎంత ప్రతిఘటించినా పెద్ద ఫలితం లేకపోయింది. ఇప్పుడు ప్రతిపక్షం బలోపేతం కావడం, బీజేపీ మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి రావడంతో వారు తమ నిరసన ధ్వనులు మరింత మిన్నంటించేందుకు తయారవుతున్నారు. అందువల్ల ఎవరు అసలు పిక్చర్ చూపిస్తారో, ఏ భోజనం వడ్డిస్తారో రాబోయే రోజులు తేల్చనున్నాయి.

18వ లోక్‌సభ తొలి 9 రోజుల సమావేశాల్లోనే ప్రభుత్వానికీ ప్రతిపక్షాలకూ మధ్య ఘర్షణాయుత వాతావరణం కనిపించడంతో జూలై 22 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాలు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడల్లా అధికార పార్టీ, ప్రతిపక్షాలు రాజకీయ ప్రత్యర్థులుగా కాకుండా ఆజన్మ శత్రువులుగా వ్యవహరించడం వల్ల ఉద్వేగపూరిత నాటకీయ సన్నివేశాలు కనిపించక తప్పదు. తద్వారా అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన పార్లమెంట్ ప్రాధాన్యత మరింత తగ్గిపోయే అవకాశాలున్నాయి. నిశితంగా పరిశీలిస్తే ప్రతిపక్షాలు కేవలం నరేంద్రమోదీనే లక్ష్యంగా పెట్టుకుని వాగ్బాణాలు సంధిస్తున్నాయని అర్థమవుతుంది. చర్చల్లో బీజేపీ నేతలు ఎవరు మాట్లాడినా పెద్దగా స్పందించని ప్రతిపక్షాలు కేవలం మోదీ మాట్లాడినప్పుడు గందరగోళం సృష్టిస్తున్నాయి. ప్రతిపక్ష నేతల ప్రసంగాల్లో అధిక భాగం మోదీని విమర్శించేందుకు, ఎద్దేవా చేసేందుకు పరిమితమయ్యాయి.



> పరస్పర శత్రుత్వ వాతావరణంలో 18వ లోక్‌సభ ప్రారంభమైన తీరు ఈ దేశంలో నిర్మాణాత్మక రాజకీయాలకు విఘాతం కలిగిస్తుందా అన్న ఆందోళనకు దారితీస్తోంది. ఎన్నికల ఫలితాలు మోదీకి ఒక సందేశాన్ని అందించాయన్న విషయంలో సందేహం లేదు కాని తమ బలం పెరిగినంత మాత్రాన సభలో గందరగోళం సృష్టించడానికి ప్రతిపక్షాలకు లైసెన్స్ ఇచ్చినట్లు ఎంత మాత్రమూ కాదు. రాహుల్ మాట్లాడినప్పుడు బీజేపీ ఎంపీలు మౌనంగా ఉన్నా మోదీ మాట్లాడుతున్నప్పుడు విపక్ష సభ్యులు గందరగోళం సృష్టించడం అసంబద్ధంగా కనిపిస్తోంది.

సాధారణంగా చట్టసభల సమావేశాల్లో అద్భుతమైన ప్రసంగాలు ప్రతిపక్ష శిబిరంనుంచే వస్తాయి. ప్రభుత్వ పక్షం తరఫున మాట్లాడే వారికి తమ పాలన గురించి గణాంక వివరాలు చెప్పడం మినహా చెప్పగలిగింది పెద్దగా ఉండదు. కొద్ది రోజులు జరిగినప్పటికీ ఈ లోక్‌సభ సమావేశాల్లో సహజంగానే రాహుల్‌గాంధీ, మహువా మొయిత్రా, కల్యాణ్ బెనర్జీ, ఎ. రాజా లాంటి నేతలు ప్రభుత్వంపై, ముఖ్యంగా ప్రధానమంత్రిపై శక్తిమంతంగా విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. అంతే శక్తిమంతంగా మాట్లాడగలిగిన నేత అధికార పక్షంలో మోదీ తప్ప ఎవరూ కనపడకపోవడం విస్మరించదగిన విషయం కాదు. ఒక రకంగా ఈ సమావేశాలను చూస్తుంటే ఎన్నికలు ఇంకా కొనసాగుతున్నాయా అన్న అభిప్రాయం కలుగుతోంది. నిన్నమొన్నటి వరకూ జరిగిన ఎన్నికల ప్రసంగాలు మళ్లీ అదే ధోరణిలో పార్లమెంట్‌లో కూడా వినపడడమే ఇందుకు కారణం.

అయితే ప్రతిపక్ష నేత అయిన తర్వాత రాహుల్ గాంధీ తడుముకోకుండా, సూటిగా, విస్పష్టంగా మాట్లాడడం కాంగ్రెస్ నేతలకు చాలా కాలం తర్వాత హర్షాతిరేకం కలిగించింది. 2008లో రాహుల్‌గాంధీ తన పర్యటనలో కలుసుకున్న ఒక పేద మహిళ కళావతి గురించి పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంలో తాను చెప్పదలుచుకున్న విషయాన్ని విస్పష్టంగా చెప్పలేక నవ్వుల పాలయ్యారు. ఆ తర్వాత కూడా ఆయన పార్లమెంట్‌లోను, బయటా అనేకసార్లు మాట్లాడినప్పుడు వినే వారికీ, ఆయనకూ మధ్య సమాచార అగాధం కనిపించేది. శిక్షపడ్డ ఎంపీలను కాపాడేందుకు 2013లో జారీ చేసిన ఆర్డినెన్స్ ప్రతిని రాహుల్ గాంధీ ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చింపివేసి తమ యూపీఏ ప్రభుత్వాన్నే ఇరకాటంలో పెట్టారు. 2018లో తన ప్రసంగం తర్వాత రాహుల్ మోదీ వైపు వచ్చి ఆయనను కౌగిలించుకోవడం, ఆ తర్వాత సహచర ఎంపీలకు కన్ను కొట్టడం కూడా చర్చనీయాంశమైంది.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కాని 2008లో రాహుల్ ప్రసంగం విన్న వారికి, దాదాపు 16 ఏళ్ల తర్వాత 2024లో ప్రతిపక్ష నేతగా ఆయన ప్రసంగం విన్న వారికి ఒక చెప్పుకోదగ్గ మార్పు కనిపించింది. అప్పటి, ఇప్పటి రాహుల్‌లో స్పష్టమైన తేడా ఉన్నది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, మణిపూర్, అగ్నివీర్, నీట్ ప్రశ్న పత్రాల లీక్‌పై మాట్లాడడంతో పాటు మోదీ వ్యవహార శైలిపై తడుముకోకుండా తీవ్రవిమర్శనాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ పార్టీ తమ నాయకుడుగా భావిస్తున్న వ్యక్తి ఇన్నాళ్ల వరకూ లోక్‌సభలో పెద్దగా గొంతు విప్పగలిగే వాడు కాదు. ఒకవేళ మాట్లాడినా అందులో ఒక ధార కానీ, ప్రవాహం కానీ కనిపించేది కాదు. ఇప్పుడు కాంగ్రెస్‌కే కాక ప్రతిపక్షాలకు ఒక నేత అంటూ లభించాడని చెప్పక తప్పదు. మోదీ సభలో ప్రవేశించినప్పుడు ఎప్పటి మాదిరి మోదీ, మోదీ అన్న నినాదాలు వినిపిస్తే రాహుల్ సభలో ప్రవేశించినప్పుడు మొదటి సారి రాహుల్, రాహుల్ అన్న నినాదాలు ప్రతిపక్ష శిబిరం నుంచి వినిపించాయి. మోదీ తన ప్రసంగంలో రాహుల్‌ను బాలకుడని అభివర్ణించినప్పటికీ రాహుల్ బాలకుడి స్థాయిని వయసు రీత్యానే కాక, పరిణతి రీత్యా దాటిపోయారని ఎవరికైనా అనిపిస్తుంది. గతంలో సభలో అరుదుగా కనిపించే మోదీ ఇప్పుడు రాహుల్ ఉన్నంత సేపూ సభలో కూర్చోవడం విస్మరించదగిన విషయం కాదు. మోదీ అబద్ధాలు చెబుతున్నారని రాహుల్ అంటే రాహుల్ అబద్ధాలు చెబుతున్నారని మోదీ అంటున్నారు. మోదీ ఇప్పుడు ఎన్డీఏ నాయకుడని రాహుల్‌కు, రాహుల్ మొత్తం ఇండియా కూటమి నాయకుడని మోదీకి తెలిసినా ఇరువురూ పరస్పరం ఒకర్నొకరు లక్ష్యంగా పెట్టుకోవడం వెనుక ఒక వ్యూహం ఉన్నట్లు కనిపిస్తోంది.

పార్లమెంట్‌లో ప్రారంభమైన ఈ వ్యూహాలు ఇప్పుడు బయట కూడా అమలయ్యే అవకాశాలున్నాయి. మణిపూర్, హత్రాస్, అస్సాం దేశంలో ఎక్కడ ఏ సమస్య తలెత్తినా రాహుల్‌గాంధీ అక్కడకు వెళ్లి జనంలో కలిసిపోవడమే కాకుండా మోదీపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధులు, ప్రధాన కార్యదర్శులు, మీడియా విభాగం గతంలో కంటే మరింత చురుకుగా కనిపిస్తోంది. ప్రతిపక్షాల సంఘటిత కార్యాచరణ గతంలో కంటే బలంగా మారింది. ఈ రీత్యా బలమైన ప్రతిపక్షాలను ఎదుర్కొనేందుకు మోదీ కూడా సంఘటిత కార్యాచరణ ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైంది.

ఎవరు ఎన్ని చెప్పినా దేశంలో ప్రజలు ఎన్డీఏ, ఇండియా కూటమిల మధ్య చీలిపోయారన్నది విస్పష్టంగా కనిపిస్తోంది. ఈ రెండు పక్షాల్లో లేనివారు కకావికలయ్యే పరిస్థితి ఏర్పడింది తమ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ తమ వైపుకు తిప్పుకుంటోందని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని మంగళవారం బీఆర్ఎస్ నేతలు ఢిల్లీలో విలేఖరుల సమావేశం పెట్టి మరీ వాపోయారు. దేశంలో చాలా మంది నేతలకు రాజ్యాంగం వారు కష్టకాలంలో ఉన్నప్పుడే గుర్తుకు వస్తుంది. తాము అధికారంలో ఉన్నప్పుడు ఇదే రాజ్యాంగాన్ని తామే కాలరాశామన్న విషయం వారు మరిచిపోతారు.

పరస్పర శత్రుత్వ వాతావరణంలో 18వ లోక్‌సభ ప్రారంభమైన తీరు ఈ దేశంలో నిర్మాణాత్మక రాజకీయాలకు విఘాతం కలిగిస్తుందా అన్న ఆందోళనకు దారితీస్తోంది. ‘బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకదానినొకటి శత్రువులుగా కాకుండా రాజకీయ ప్రత్యర్థులుగా మాత్రమే భావించాలి. జాతీయ అంశాలపై ఏకాభిప్రాయ సాధన కోసం ప్రయత్నించాలి, తమ మధ్య సమాచార సంబంధాలు ఏర్పర్చుకోవాలి..’ అని బీజేపీ కురువృద్ధుడు లాల్‌కృష్ణ అద్వాణీ తన ఆత్మకథలో రాశారు. ఇదే విషయాన్ని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఎన్నికల అనంతరం నాగపూర్‌లో చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. ‘మన సంప్రదాయం ఏకాభిప్రాయంతో ముడిపడి ఉన్నది..’ అని ఆయన చెప్పారు. ‘అందర్నీ కలుపుకుపోవడం, ఏకాభిప్రాయానికి ప్రయత్నించడం అధికారంలో ఉన్న వారి బాధ్యత’ అన్నారు. సమాజంలో ఉన్న వైమనస్యాలు, మైనారిటీల్లో ఉన్న ఆందోళనలు తొలగించడం అధికారంలో ఉన్నవారే చేయాలని. వివిధ వర్గాల మధ్య పరస్పర గౌరవం ఏర్పడేలా చూడాలని, అహంకారం లేని హుందాతనం అవసరమని ఆయన అన్నారు.

మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు బీజేపీ అగ్రనేతలను ఉద్దేశించి చేసి ఉండవచ్చు కాని రాజకీయాల్లో ప్రవర్తనా నియమావళి అన్ని వర్గాలకూ వర్తిస్తుంది. ఎన్నికల ఫలితాలు మోదీకి ఒక సందేశాన్ని అందించాయన్న విషయంలో సందేహం లేదు కాని తమ బలం పెరిగినంత మాత్రాన సభలో గందరగోళం సృష్టించడానికి ప్రతిపక్షాలకు లైసెన్స్ ఇచ్చినట్లు ఎంత మాత్రమూ కాదు. రాహుల్ మాట్లాడినప్పుడు బీజేపీ ఎంపీలు మౌనంగా ఉన్నా మోదీ మాట్లాడుతున్నప్పుడు విపక్ష సభ్యులు గందరగోళం సృష్టించడం అసంబద్ధంగా కనిపిస్తోంది.

గత లోక్‌సభ సమావేశాలు చరిత్రలో ఎన్నడూ లేనంతగా అతి తక్కువ రోజులు జరిగాయి. 18వ లోక్‌సభ సమావేశాలు కూడా వ్యర్థం కాకుండా చూసుకోవడం ఇరు పక్షాలకు అవసరం. ఇప్పటికే వ్యవస్థలు పనిచేయడం లేదని చాలా మంది వాపోతున్నారు. చట్టసభల పట్ల కూడా అలాంటి అభిప్రాయం ఏర్పడుతోంది. గత ఎన్నికల్లో కంటే ప్రజల ఓట్ల శాతం ఈ సారి తగ్గిపోయింది. ఓటర్లలో దాదాపు సగం మంది ఎన్నికలను విస్మరించడమో, విముఖంగా ఉండడమో చేశారు. ప్రజలకు ప్రజాస్వామ్యం పట్ల ఆసక్తి పెరిగేలా చేయాలంటే అధికార, ప్రతిపక్షాలు పార్లమెంటులో తమ పాత్రను బాధ్యతాయుతంగా నిర్వర్తించడం తప్ప వేరే మార్గం లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

కాంగ్రెస్ డీఎన్ఏలోనే హిందూ వ్యతిరేకత!

రాజ్యాంగాన్ని ప్రదర్శిస్తూ ఎంపీగా ప్రమాణం చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే దాని విలువలను విస్మరించడాన్ని బట్టి కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి రాజ్యాంగం పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతున్నది. కులమతాలకు అతీతంగా, సర్వ మానవ శ్రేయస్సు కోసం పనిచేస్తానని జూన్ 25న ప్రమాణం చేసిన రాహుల్‌గాంధీ జూలై 1న హిందూ సమాజంపై విషం చిమ్మడం రాజ్యాంగ విలువలకే అవమానం. ఈ దేశాన్ని సుదీర్ఘకాలం పాటు పరిపాలించిన జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల ‘కుటుంబ ప్రతినిధి’గా రాజకీయాల్లో రాణిస్తున్న రాహుల్‌గాంధీ ఈ దేశ మెజార్టీ ప్రజలపై, వారి విశ్వాసాలపై మాటల తూటాలతో దాడులకు తెగబడడం అప్రజాస్వామికం. ‘హిందువులు హింసావాదులు, విధ్వంసకారులు, కుట్రదారులు’ అంటూ నిరాధార ఆరోపణలు చేయడం దుర్మార్గం!

‘మైనార్టీలు దేశానికి గర్వకారణం, అన్ని రంగాల్లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దేశ భక్తులు వారు’ అంటూ ఓటు బ్యాంకు మాటలు మాట్లాడటం మెజారిటీ ప్రజల మనోభావాలను గాయపరచడమే. దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా ఈ దేశ పీఠంపై కూర్చున్న కాంగ్రెస్ నేడు ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ ప్రచారం పొందాలనుకోవడం సముచితం కాదు. పదిహేను నిమిషాల్లో హిందువులను అంతం చేస్తానన్న అక్బరుద్దీన్ ఓవైసీ, సనాతన ధర్మాన్ని పెకిలించి వేస్తానని వెకిలి మాటలు మాట్లాడిన ఉదయనిధి స్టాలిన్ వంటి నేతల సరసన రాహుల్‌గాంధీ కూడా చేరడం లోక్‌సభలో ప్రతిపక్ష నేత స్థాయిని తగ్గించే విషయం. ఓటు బ్యాంకు రాజకీయాలను దృష్టిలో ఉంచుకొని, లౌకికవాదం ముసుగులో హిందుత్వంపై దాడి చేస్తే నేటి నాగరిక సమాజం హర్షించదు. రాజకీయ అవసరాల కోసం హిందూ ధర్మంపై దాడి చేస్తే, తగు రీతిలో జవాబు చెప్పేందుకు హిందూ సమాజం కూడా సిద్ధంగా ఉందనే విషయం తెలుసుకోవాలి. భారతీయత కోసం, సనాతన ధర్మం కోసం, జాతీయ వాదం కోసం ప్రాణాలను లెక్కచేయక పోరాడిన పరాక్రమ వీరుల చరిత్ర ఓసారి గుర్తెరగాలి.



> ఎన్నికలప్పుడు దేవాలయాలను సందర్శిస్తూ హిందువుల ఓట్ల కోసం నకిలీ ప్రేమను వలకబోసిన కాంగ్రెస్ ఇప్పుడు చీమకు కూడా హాని తలపెట్టని హిందువులను ఉగ్రవాదులతో పోల్చడం దుర్మార్గం. హిందువులు ఉగ్రవాదులు అనే వ్యాఖ్యలపై రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్క హిందువు స్పందించాలి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలోని హిందువులందరూ జాగృతం కావాలి.

హిందూ సమాజాన్ని అంతం చేయాలని పంతం పట్టి, అదే ఎజెండాగా పాలన సాగించిన అనేకమంది రాజులు ఆ కోరిక నెరవేరకుండానే కాలగర్భంలో కలిసిపోయారు. భౌతికంగా దేవాలయాలను, శిల్ప సంపదను కొల్లగొట్టగలిగారు తప్ప, ఈ దేశ మూలాలను, హిందూ సంస్కృతీ సంప్రదాయాలను తాకలేకపోయారు. నేటి సందర్భంలో ఈ దేశ సమగ్రతకు పెనుముప్పుగా సంక్రమిస్తున్న ప్రమాదకర ‘హిందూ విద్వేషపు మాట’లను హిందూ సమాజం నిశితంగా గమనిస్తున్నది. లోతుగా ఆలోచిస్తున్నది కూడా. రాజకీయ నేతలు పెంచి పోషిస్తున్న మతమార్పిడి మాఫియా, హిందూ వ్యతిరేక విధానాలపై స్పందించేందుకు సిద్ధంగా ఉంది.

భారతీయ జీవన విధానానికి వ్యతిరేకంగా పని చేస్తున్న సంస్థలకు వంతపడటం కాంగ్రెస్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ముఖ్యంగా తన డీఎన్ఏ లోనే హిందూ వ్యతిరేక భావాన్ని నింపుకున్నట్టుంది ఆ పార్టీ. అందులో భాగంగానే అయోధ్య శ్రీ రామ జన్మభూమిలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను బహిరంగంగా బహిష్కరించి, హిందూ విరోధిగా ముద్ర వేసుకుంది. దాదాపు 500 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం అనంతరం ‘హిందూ లోకం’ చేసుకుంటున్న పండుగను వ్యతిరేకించింది. ‘రాముడు లేడు, రామాయణం లేదు, రామసేతు కల్పితం’ అంటూ వాదించింది. హిందుత్వం బలపడుతుంటే ఓర్చుకోలేని కాంగ్రెస్ అయోధ్య రాముడి అక్షింతలను అవహేళన చేసింది. శ్రీరాముడిపై, హిందూ ధర్మంపై అక్కసు వెళ్ళగక్కిన విషయం ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమైన మతపరమైన రిజర్వేషన్లను ప్రవేశపెట్టి హిందువుల (బీసీ) రిజర్వేషన్లు లాక్కొని ఓట్ల కోసం ముస్లింలకు అప్పజెప్పిన పార్టీ కాంగ్రెస్.

మొత్తంగా హిందువులంటే కాంగ్రెస్ పార్టీకి లెక్కలేనంత విద్వేషం. అందులో భాగంగానే హిందువులపై భారీ కుట్రలకు తెరలేపుతున్నది. హిందూ ఉగ్రవాదం అనే భయానకమైన మాటలతో ధర్మంపై దాడికి దిగటం కూడా ఈ కోవకి చెందినదే. హిందూ సంస్కృతీ సంప్రదాయాలపై, ఆచార వ్యవహారాలపై, అనాదిగా వస్తున్న పరంపరపై నిందలు మోపేందుకు ప్రణాళిక ప్రకారం కాంగ్రెస్ నేతలు కుట్ర పన్నుతున్నారు. రాజకీయ లబ్ధి కోసం హిందూ ధర్మాన్ని విమర్శించడం కొంతమంది నేతలకు ఈ రోజుల్లో ఫ్యాషన్‌గా మారిపోయింది.

ఈ సృష్టిలో 1600 ఏళ్ల క్రితం ఇస్లాం లేదు. 2000 ఏళ్ల క్రితం క్రైస్తవం లేదు. 600 ఏళ్ల క్రితం కశ్మీర్‌లో ముస్లిం అనేవారు లేరు. అందుకు చక్కని ఉదాహరణ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత గులాం నబీ ఆజాద్ వ్యాఖ్యలే. ‘భారతీయులంతా ఒకప్పటి హిందువులే’నని ఆజాద్ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ లోతుగా ఆలోచిస్తే హిందుత్వం విలువలు బోధపడే అవకాశం ఉంది. హిందూ ధర్మం అతి ప్రాచీనమైనది. అత్యంత ప్రముఖమైనది కూడా. భారతీయ విలువలు, సనాతన ధర్మం లక్షల ఏళ్లుగా వస్తున్న పరంపర. హిందుత్వం ఎవరో తయారు చేసిన మతం కాదు. భగవంతుడు సృష్టించిన జీవన విధానం. అన్ని మతాలను ఆచారాలను ఎలాంటి కల్మషం లేకుండా తన కడుపులో దాచుకునే ఉదారమైన ధర్మం హైందవం. అలాంటి ధర్మంపై నిందలు వేయడం పాపం.

ప్రస్తుతం ప్రపంచంలో అతి వేగంగా విస్తరిస్తున్న ధర్మం హిందూ ధర్మమే. ప్రపంచ దేశాలను హిందూ జీవన విధానం, సంస్కృతీ సంప్రదాయాలు ఆకర్షిస్తున్నాయి. చెట్టు, పుట్ట, మట్టి, పాము, కుక్క, ఎలుక నుంచి మొదలుకొని ఏనుగు వరకు ప్రతి ప్రాణిని పూజించే వ్యక్తులు హిందువులే. అహింసను శాంతిని ప్రపంచానికి చాటి చెప్పి, సేవా మార్గాన్ని చూపించింది హిందువులే. నిప్పును అగ్ని దేవతగా, నీరును గంగా దేవతగా, నేలను భూమాతగా, గాలిని వాయుదేవుడిగా ప్రకృతిని ఆరాధిస్తూ సకల జీవరాశులను ప్రేమించే ధర్మం హిందువుల సొంతం. హిందువులు సహనశీలురు శాంతి స్వరూపులు. ఈ దేశంలోని అన్ని మతాలను గౌరవిస్తున్నారు, కాబట్టే ఇక్కడ ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోంది.

ఎన్నికలప్పుడు దేవాలయాలను సందర్శిస్తూ హిందువుల ఓట్ల కోసం నకిలీ ప్రేమను వలకబోసిన కాంగ్రెస్ ఇప్పుడు చీమకు కూడా హాని తలపెట్టని హిందువులను ఉగ్రవాదులుగా పోల్చడం దుర్మార్గం. హిందువులు ఉగ్రవాదులు అనే వ్యాఖ్యలపై రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్క హిందువు స్పందించాలి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలోని హిందువులందరూ జాగృతం కావాలి. లేదంటే స్వార్థ రాజకీయాల కుట్రలలో హిందుత్వం నలిగిపోయే ప్రమాదం ఉన్నది.

ప్రపంచానికే దిక్సూచి హిందుత్వమని, 131 ఏళ్ల క్రితమే ప్రపంచ మత మహాసభల్లో హిందూ మతం గొప్పతనాన్ని స్వామి వివేకానందుడు ప్రపంచానికి తెలియజేశారు. ఇంతటి గొప్ప వైవిధ్యం గల హిందూ ధర్మంపై విధ్వంసకర మాటలు మాట్లాడిన రాహుల్‌గాంధీ, వెంటనే హిందువులందరికీ క్షమాపణ చెప్పి దేశ సమగ్రతను కాపాడాలి.

• పగుడాకుల బాలస్వామి
ప్రచార ప్రసార ప్రముఖ్, విశ్వహిందూ పరిషత్

‘అమరావతి’ త్వరగా రూపుదిద్దుకోవాలి

ఐదేళ్ల దుష్పరిపాలన అంతమైన శుభసమయంలో ఇకనైనా అమరావతి నగర నిర్మాణం త్వరితగతిన పూర్తవ్వాలి. దీనికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహాయం అందించాలి. కానీ మొదటిదఫాలో జరిగిన పొరబాటు మళ్ళీ జరగకుండా అమరావతిని జనావాసానికి అనుకూలమైన ఒక నగరంగా త్వరగా మార్చాలి. ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మించడం కేవలం కొన్ని ఏండ్లలో పూర్తికాదు. దానికి కొన్ని దశాబ్దాలు పట్టవచ్చు. కానీ ఒక నగరానికి ఉండవలసిన అన్ని హంగులను త్వరగా అమర్చిపెట్టడం సాధ్యమవుతుంది. రోడ్ల నిర్మాణం పూర్తి చేసి ప్రైవేట్ కట్టడాలకు అనుకూల వాతావరణం కల్పించాలి. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, ఎయిర్‌పోర్ట్ వంటి రవాణా సౌకర్యాలను కల్పిస్తూ మిగతా ప్రపంచానికి అమరావతిని అనుసంధానించినపుడే అమరావతిలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుంటాయి. చెంతనే ఉన్న విజయవాడ, గుంటూరు నగరాల నుండి వేగంగా అమరావతికి చేరుకునేలా మౌలిక వసతులు ఏర్పాటు చేసి మూడింటినీ ట్రై-సిటీస్‌గా అభివృద్ధి చేస్తే ఒకప్పుడు మద్రాస్ తరువాత హైదరాబాద్ వంటి నగరాలను కోల్పోయిన ఆంధ్రులు తద్వారా పొందిన నష్టాన్ని భర్తీ చేసుకోగలరు. ఏపీసీఆర్డీఏ పేరుతో కన్నా అమరావతి మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ పేరుతోనే రాజధాని అభివృద్ధి, నిర్మాణం జరిగితే మంచిది. సరైన ఉద్యోగ అవకాశాలు లేక చదువుకున్నవారు వలస పోతున్నారు. రాజధానిలో పరిపాలనా విభాగాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రైవేట్ పరిశ్రమలు ఏర్పాటైతేనే చదువుకున్న వారికి అమరావతి గమ్యస్థానమవుతుంది.

– గొరాబత్తిన కుమార్‌బాబు

ఆర్థిక సంక్షోభం నుంచి ఆంధ్రప్రదేశ్‌ను గట్టెక్కించడం కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ నూతన ప్రభుత్వాలకు పెను సవాలే. విభజన నష్టం నుంచి కోలుకోకుండానే జగన్‌రెడ్డి ఆర్థిక అరాచకత్వం ఏపీని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది. రూ.13లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి రాష్ట్రం దిగజారింది. ప్రతి ఏటా రూ.40వేల కోట్లకు పైగా అసలు, వడ్డీ చెల్లింపులకే వెచ్చించాల్సిన దుస్థితి. ఇప్పుడీ ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే రాష్ట్ర ప్రభుత్వ దీక్షాదక్షతలతో పాటు, కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు అవశ్యం. బీహార్ రాష్ట్ర శాసనసభ ప్రత్యేకహోదా తీర్మానం నేపథ్యంలో మళ్లీ ప్రత్యేక హోదా ప్రతిపత్తి చర్చనీయాంశమైంది.

కేంద్రసాయమే ఆంధ్రప్రదేశ్‌కి ఆక్సిజన్!

> విభజన నష్టం నుంచి ఆంధ్రప్రదేశ్ కోలుకోకుండానే జగన్‌రెడ్డి ఆర్థిక అరాచకత్వం రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది. రూ.13లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి రాష్ట్రం దిగజారింది. ఈ నేపథ్యంలో విభజన చట్టంలోని అంశాలను అమలు చేయడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తోడ్పాటునివ్వాలి.అది ప్రత్యేక హోదా రూపంలోనా, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ రూపంలోనా... పేరేదైనా సత్వర సాయం–సమర్థ వినియోగం అవశ్యం.



దేశంలోని 29 రాష్ట్రాలలో 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ప్రతిపత్తి ఉంది.. మరో 5 రాష్ట్రాలలో (బిహార్, ఏపీ, రాజస్థాన్, గోవా, ఒడిశా) ప్రత్యేక హోదా డిమాండ్ ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రతిపత్తి హోదా 5 ఏళ్లపాటు ఇస్తామన్నది 20 సెప్టెంబర్, 2013న రాజ్యసభలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన 6 హామీల్లో ఒకటి. ప్రస్తుతం ఆ హోదా ఉన్న రాష్ట్రాల్లో కూడా కేంద్ర ప్రాయోజిత పథకాల (సిఎస్ఎస్)కే ఇది పరిమితమైంది, ఆయా రాష్ట్రాలకు 90శాతం గ్రాంట్లుగా, 10శాతం రుణంగా కేంద్రం నుంచి అందుతాయి. కొత్త పరిశ్రమలను నెలకొల్పే కంపెనీలకు ఆదాయపన్ను మినహాయింపులు, ఎక్సైజ్ డ్యూటీ రాయితీలు లభిస్తాయి.

ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవాల్సిన బాధ్యత ఉంది. రాష్ట్ర పునర్విభజన కారణంగా అత్యధిక రాబడినిచ్చే హైదరాబాద్, రంగారెడ్డి రెండు జిల్లాలు తెలంగాణకు పోయిన దరిమిలా ఏపీ కుదేలైంది. రూ.12వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోవడమే కాకుండా, రూ.60వేల కోట్ల ఖర్చులు, వారసత్వ రుణంగా రూ.90వేల కోట్లు సంక్రమించాయి. దీన్ని అధిగమించడానికే ఏపీకి ఐదేళ్ల ప్రత్యేక హోదా హామీ. కానీ వైవి రెడ్డి నేతృత్వంలోని 14వ ఆర్థిక సంఘం సిఫారసులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం దరిమిలా ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయంగా పేర్కొంటూ, దాని స్థానంలో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారు. స్పెషల్ కేటగిరీ స్టేటస్‌తో వచ్చే లబ్ధిని స్పెషల్ అసిస్టెన్స్ రూపంలో అందిస్తామని చెప్పడం విదితమే. అయితే అనంతర పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, కేంద్రం నుంచి నిధులు రాబట్టడంపై ఆసక్తి కన్నా సీబీఐ, ఈడీ కేసుల నుంచి బైటపడటంపైనే పూర్తి దృష్టి కేటాయించిన కారణంగా ఆంధ్రప్రదేశ్ అన్నివిధాలా నష్టపోయింది. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ రూపంలో రాష్ట్రాలకు అదనపు నిధులు ఇచ్చినా అక్కడితో సమస్యలు పరిష్కారం అవుతాయా అనేది సందేహాస్పదమే. బడ్జెట్ కేటాయింపుల సమర్థ వినియోగం ఇక్కడ కీలకమైంది. ఉత్పాదక వ్యయం పెరగాలి, అనుత్పాదక వ్యయం తగ్గాలి, దుబారా వ్యయాన్ని అరికట్టాలి, శాసనసభ ఆమోదం లేకుండా నిధుల వ్యయానికి అడ్డుకట్ట వేయాలి. కేంద్రం నుంచి అదనపు నిధులు రాబట్టడం ఒక ఎత్తయితే, రాష్ట్రంలో బడ్జెట్ కేటాయింపులను సమర్థంగా వెచ్చించడం మరో ఎత్తు. ఏపీలో గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల వ్యయంలో ఘోరంగా విఫలమైంది. కేంద్రం ఇచ్చే నిధులను భారీఎత్తున దారి మళ్లించింది. ఫలితంగా తర్వాత సంవత్సరాల్లో ఆయా పథకాలకు నిధుల్లో కోత పడిందంటే రాష్ట్ర పాలకుల వైఫల్యమే.

2023 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపుల్లో రూ.92,567కోట్లు ఖర్చు చేయలేకపోయారు. వైద్య ఆరోగ్య రంగంలోనే రూ.6,576కోట్లు, పట్టణాభివృద్ధి రంగాల్లో రూ.4,655కోట్లు, సాంఘిక సంక్షేమంలో రూ.5,254కోట్లు, వెనుకబడిన వర్గాల సంక్షేమంలో రూ.16,360కోట్లు, నీటిపారుదల శాఖలో రూ.9,034కోట్లు ఖర్చు చేయలేదు. ఈ నిధులన్నీ సమర్థంగా వినియోగిస్తే అసలు ప్రత్యేక హోదా ప్రతిపత్తి అవసరమే లేదని కాగ్ మాజీ డీజీ గోవింద భట్టాచార్జీ పేర్కొనడం విశేషం. రాష్ట్రంలో ఈ దుస్థితిని చక్కదిద్దకుండా ఒకవేళ అదనపు నిధులిచ్చినా అవీ నిరర్థకమేనని ఆయన చేసిన వ్యాఖ్యలు గమనార్హం. ప్రత్యేక హోదా తెస్తానన్న జగన్మోహన్‌రెడ్డి దాని కోసం కనీస ప్రయత్నం చేయలేదు. దానికి ప్రత్యామ్నాయంగా కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజి ఆర్థికసాయం రాబట్టేందుకూ కృషి చేయలేదు. సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీములలో రాష్ట్ర వాటా తెచ్చుకోవడంలో గాని, డివల్యూషన్ పన్నులు 42శాతం నుంచి 41శాతంకు తగ్గినా అడిగిన పాపాన పోలేదు.. సెంట్రల్ పూల్ ఫండ్స్‌లో ఒక శాతం కోతపడ్డా చీమ కుట్టినట్లు లేదు. రెండంకెల వృద్ధిరేటు సింగిల్ డిజిట్‌కు పడిపోవడమే కాదు, తిరోగమన వృద్ధి నమోదైంది. తలసరి ఆదాయం పూర్తిగా క్షీణించింది, అనుత్పాదక వ్యయం పెరిగింది. జగన్ నిర్వాకాల కారణంగా ఏపీ రూ.13లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది.

కేంద్ర పథకాల నిధులను నిర్దేశిత లక్ష్యాల కోసం కాకుండా పెద్ద ఎత్తున దారి మళ్లించారు. పట్టణాభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధులు రూ.13,788కోట్లు ఖర్చు చేయలేకపోయారు. తాగునీటి ప్రాజెక్టులకు ఏఐబీ ఇచ్చిన రూ.5,350కోట్లలో గత ఐదేళ్లలో రూ.430కోట్లు కూడా ఖర్చు చేయలేదు. అమృత్ 2వ దశలో రూ.8,078కోట్లకు రూ.360కోట్లే ఖర్చు చేశారు, తొలి దశలోనూ రూ.1000 కోట్లకు పైగా ఖర్చు చేయలేదు. ఎన్‌హెచ్ఎం నిధులు రూ.500కోట్లు పక్కదారి పట్టించడం వల్ల తర్వాత ఏళ్లలో రూ.1500కోట్ల నిధులను రాష్ట్రం కోల్పోయింది. నరేగా, నాబార్డు, సిఎస్ఎస్, ప్రపంచబ్యాంకు నిధులను దారి మళ్లించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనుల్లో రూ.628కోట్లు ఆదా చేశానని చెప్పి రూ.68వేల కోట్ల నష్టం చేశారు.

జలవనరుల శాఖలో పెండింగ్ బిల్లులే రూ.26వేల కోట్లు ఉన్నాయి. ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులకే రూ.11వేల కోట్లు, ఇతర బిల్లులు రూ.15వేల కోట్లు. రైతులకు ధాన్యం బకాయిలు రూ.1659 కోట్లు పేరబెట్టారు. ఐదేళ్లలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌ను రూ.36,300 కోట్ల అప్పుల్లో ముంచేశారు. రాజధాని అమరావతిలో పనులన్నీ ఆపేసి విధ్వంసం సృష్టించారు. రాజధానిలో మౌలిక వసతులకు రూ.50వేల కోట్లు ఖర్చుచేస్తే, పన్నుల రూపంలో రూ.20–30వేల కోట్ల ఆదాయం వచ్చేది. ప్రభుత్వం వద్ద మిగిలే 8వేల ఎకరాలకు అప్పట్లోనే రూ.80వేల కోట్ల విలువ ఉంది, అభివృద్ధి చేస్తే ఇప్పటికే రూ.1,60,000కోట్ల సంపద ఉండేది. అమరావతిలో గత ప్రభుత్వం స్థలాలిచ్చిన 132 సంస్థలను తేవడంలో విఫలమయ్యారు. రూ.57కోట్లు లాభం వచ్చే హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టును రూ.164కోట్ల నష్టంలోకి నెట్టారు. వీటన్నింటినీ చక్కదిద్దాల్సిన బాధ్యత, గాడి తప్పిన రాష్ట్రాన్ని మళ్లీ ట్రాక్‌లో పెట్టాల్సిన కర్తవ్యం నూతన ప్రభుత్వంపై ఉంది.

ఈ నేపథ్యంలోనే ఏపీ సీఎం చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక తన తొలి ఢిల్లీ పర్యటనలో ప్రధాని నరేంద్రమోదీకి ఇచ్చిన వినతిలో 7 ముఖ్యాంశాలపై కేంద్రం సహాయ సహకారాలు అందించాలి. స్వల్పకాలానికి రాష్ట్రానికి ఆర్థికచేయూతనివ్వడం, పోలవరం ప్రాజెక్టు పనుల పునఃప్రారంభానికి సత్వర చర్యలు, రాజధాని అమరావతిలో మౌలిక వసతులు, ప్రభుత్వ భవనాల పూర్తికి సాయం చేయాలి. పారిశ్రామికాభివృద్ధికి ప్రోత్సాహకాలు, రాష్ట్రాలకు మూలధన వ్యయం అందించే ప్రత్యేక పథకాల కింద అదనపు కేటాయింపులిచ్చి రోడ్లు, వంతెనలు, తాగునీటి, సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి. బుందేల్ ఖండ్ ప్యాకేజీ తరహాలో వెనుకబడిన ప్రాంతాలకు మద్దతు, దుగరాజపట్నం పోర్టు పూర్తికి చేయూతనివ్వాలి. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ప్రత్యేక తోడ్పాటునివ్వాలి... అది ప్రత్యేక హోదా రూపంలోనా, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ రూపంలోనా పేరేదైనా సత్వర సాయం–సమర్థ వినియోగం అవశ్యం.

ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌ను గట్టెక్కించాలంటే దిగువ పేర్కొన్న 15సూత్రాలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని నూతన సీఎం చంద్రబాబుకు లేఖలో విజ్ఞప్తి చేశాం. పన్ను రాబడులను క్రమబద్ధీకరించాలి. డివల్యూషన్ కింద కేంద్రం నుంచి వచ్చే పన్ను రాబడి 41శాతం లేదా 42శాతం ఉండేలా చూడాలి. తెచ్చే రుణాల్లో సహేతుకత, స్థిరత్వం ఉండాలి. కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు మరిన్ని సాధించాలి. వేజ్ అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్ట్ కింద తెచ్చేవి జాగ్రత్తగా వాడాలి. రెవిన్యూ ఖర్చులు సాధ్యమైనంత తగ్గించాలి. అర్హులైన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేరాలి. మూలధన వ్యయంలో కోతల్లేకుండా చూడాలి. పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీని చేయాలి, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెరుగుపర్చాలి. ప్రభుత్వానికి రాబడి పెంచే సహజవనరులను పరిరక్షించాలి. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు కొల్లగొట్టిన సంపదను రెవిన్యూ రికవరీ యాక్ట్ కింద రాబట్టాలి. ఎఫ్ఆర్‌బీఎం యాక్ట్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆర్థికలోటు, ద్రవ్యలోటు, రెవిన్యూలోటు నియంత్రించాలి. సీఎఫ్ఎంఎస్ ద్వారానే అన్ని చెల్లింపులు జరిగేలా చూడాలి. అవినీతికి పూర్తిగా అడ్డుకట్ట వేయాలి.

■ యనమల రామకృష్ణుడు
మాజీ ఆర్థిక మంత్రి


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

బుధవారం 10 జూలై 2024



- కృష్ణా తూర్పు, పశ్చిమకు నీటి విడుదల
- తాగునీటి అవసరాలకు మాత్రమే
- ప్రారంభించనున్న మంత్రి నిమ్మల
- ప్రకాశం బ్యారేజీ వద్ద 2.9 టీఎంసీల నీటి నిల్వలు

నీటి విడుదల నేడే



పవిత్రసంగమం వద్ద పరవళ్లు తొక్కుతున్న పట్టిసీమ నీరు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ప్రకాశం బ్యారేజీకి వెనుక ఉన్న కృష్ణమ్మ కాలువల ద్వారా పరుగులు తీయబోతోంది. కృష్ణా తూర్పు, పశ్చిమ ఛానళ్లకు బుధవారం ఉదయం పది గంటలకు మంత్రి నిమ్మల రామానాయుడు అధికారికంగా నీటిని విడుదల చేయబోతున్నారు. పట్టిసీమ నుంచి ఎత్తిపోస్తున్న గోదావరి నీరు ప్రకాశం బ్యారేజీని తాకిన విషయం తెలిసిందే. దీంతో తొలుత తాగునీటి అవసరాలను తీర్చడానికి నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీలో గోదావరి నీరు రాకతో మొత్తం 2.9 టీఎంసీ నీరు నిల్వ ఉంది. తూర్పు చానల్‌కు 1000, పశ్చిమ చానల్‌కు 1000 క్యూసెక్కుల నీటిని తొలుత విడుదల చేస్తారు. తర్వాత అంచెలంచెలుగా ఈ నీటి విడుదలను పెంచుతారు. పది రోజులపాటు పూర్తిగా తాగునీటి అవసరాలను తీర్చడానికే నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. కృష్ణా జిల్లాలో మచిలీపట్నంలో తాగునీటి కటకటలు కనిపిస్తున్నాయి. దీంతో తూర్పు, పశ్చిమ చానళ్ల కింద ఉన్న చెరువులను విడుదల చేయబోయే నీటితో నింపాలని భావిస్తున్నారు. తూర్పు చానల్‌లో 547, పశ్చిమ చానల్ పరిధిలో 127 చెరువులు ఉన్నాయి. ఈ చెరువులు నిండే వరకు నీటిని విడుదల చేస్తారు. ఇందుకోసం పది రోజుల ప్రణాళికను రూపొందించారు. ఈ చెరువులన్నీ నిండిన తర్వాత సాగునీటి అవసరాలను తీర్చబోతున్నారు.



ఎన్టీటీపీఎస్ ఐదో దశలో ప్రమాదం

- ఇద్దరికి గాయాలు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు
- పరామర్శించిన మంత్రి, మాజీమంత్రి

6లో..

పోలీస్‌స్టేషన్‌లో పోస్టింగ్ తీసుకున్న ఇన్‌స్పెక్టర్లు నిర్ణీత గడువు

పోలీస్‌స్టేషన్‌లో పోస్టింగ్ తీసుకున్న ఇన్‌స్పెక్టర్లు నిర్ణీత గడువు పూర్తవ్వకుండా ఇంటి దారి పడుతున్నారా? ప్రశాంతంగా పనిచేసుకుందామనుకునే అధికా రులను గ్రూపు రాజకీయాలు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయా? పనిమం తులు అనుకున్న అధికారులూ మరకలు వేయించుకుని వెళ్లిపోతున్నారా? పోలీసు శాఖకు ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు ఇక్కడి వ్యవహారాల్లో తలదూర్చుతున్నారా? భవానీపురం పోలీస్‌స్టేషన్ విషయంలో అధికారుల్లో ఉదయిస్తున్న ప్రశ్నలు ఇవి. కొన్నాళ్లుగా ఇక్కడ పోస్టింగ్ తీసుకున్న ఇన్‌స్పెక్టర్లు బదిలీకాలం పూర్తయ్యే వరకు పనిచేయకుండా వెళ్లిపోతున్నారు. సాధారణ బదిలీతో స్థానం మారితే ఎలాంటి చర్చాలేదు. ఇక్కడి నుంచి వెళ్లిపోతున్న ఇన్‌స్పెక్టర్లకు ఏదో ఒక మరక మాత్రం అంటుకుంటోంది. దీంతో భవానీపురం పోలీస్‌స్టేషన్ అంశం కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారింది.

భయపురం

భవానీపురం పీఎస్‌లో గ్రూపు రాజకీయాలు

పోస్టింగ్ అంటేనే భయపడుతున్న ఇన్‌స్పెక్టర్లు

- వీఆర్‌కు క్యూ కట్టిన వైనం
- తాజాగా కొత్త ఇన్‌స్పెక్టర్ నియామకం
- స్టేషన్ ప్రక్షాళన అవసరమంటున్న అధికారులు



(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : భవానీపురం పోలీస్‌స్టేషన్ ప్రతి చిన్న విషయానికి వివాదాస్పదమవ్వడం వెనుక గ్రూపు రాజకీయాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. వీటి కారణంగానే ఇన్‌స్పెక్టర్లు పూర్తిస్థాయిలో పనిచేయలేకపోతున్నారన్న భావన అధికారుల్లో ఉంది. వాస్తవానికి భవానీపురం పీఎస్‌లో ఈ పరిస్థితి రావడానికి ఇంతకుముందు ఉన్న అడ్మిన్ ఎస్ఐగా పనిచేసి బదిలీపై వెళ్లిన రవీంద్ర కారణమని ఆరోపణలు బలంగా ఉన్నాయి. పోలీసు శాఖకు ఎటువంటి సంబంధం లేని వ్యక్తులను స్టేషన్‌కు తీసుకొచ్చి తన చాంబర్‌లో కూర్చోబెట్టుకుని రాచమర్యాదలు చేసినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. తర్వాత స్టేషన్‌లోని సిబ్బంది వారితో స్నేహబంధాన్ని పెంచుకోవడం, ఇన్‌స్పెక్టర్ చెప్పిన ఆదేశాలను ఖాతరు చేయకపోవడం వంటి పరిస్థితులు ఈ స్టేషన్‌లో దాపురించాయి.

శాసిస్తున్న ప్రైవేటు వ్యక్తులు

స్టేషన్ ఏ సీట్లో ఎవరు కూర్చోవాలన్న విషయాలను ప్రైవేటు వ్యక్తులు నిర్ణయించి, సిఫార్సు చేయించారంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థమవుతోంది. కొద్దిరోజుల క్రితం వరకు రైటర్ స్థానంలో ఒక ఉద్యోగి ఉండేవారు. ఆయనను తొలగించి మరో వ్యక్తిని ఆ సీట్లో కూర్చోబెట్టారు. ఒక ప్రైవేటు వ్యక్తి నాడు ఎమ్మెల్యేగా ఉన్న వెలంపల్లితో అప్పుడున్న ఇన్‌స్పెక్టర్‌కు సిఫార్సు చేయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌కు సహాయకుడిగా ఒక కానిస్టేబుల్‌ను నియమించుకుంటారు. భవానీపురం పీఎస్‌లో ఈ పోస్టును ఆ ప్రైవేటు వ్యక్తే నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మొత్తం పరిణామాలు స్టేషన్‌లో గ్రూపు రాజకీయాలను పెంచాయని అధికారులు అనుమానిస్తున్నారు.

● అందరినీ బదిలీ చేస్తేనే..

ఇక్కడ ఇన్‌స్పెక్టర్ కాకుండా ఇద్దరు ఎస్ఐలు, ఆరుగురు ఏఎస్ఐలు, ఎనిమిది మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 30-40 మంది కానిస్టేబుళ్లు, పది మంది హోంగార్డులు ఉంటారు. ఈ మొత్తం సిబ్బందిని బదిలీ చేసి కొత్తవారిని నియమిస్తే స్టేషన్‌లో వాతావరణం మొత్తం సర్దుకుంటుందన్న భావనలో అధికారులు ఉన్నట్టు తెలిసింది. ఒక న్యాయవాదితో జరిగిన వివాదంతో నాడు ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఉమర్ వీఆర్‌కు వెళ్లారు. తర్వాత వచ్చిన వి.కృష్ణను ఎన్నికల ముందురోజు రాత్రి వీఆర్‌కు పంపారు. అనంతరం బాధ్యతల స్వీకరించిన డి.ప్రసాదకుమార్ ఆవుల కేసు విషయంలో సెలవులో వెళ్లిపోయారు. ఇప్పుడు పోలీసు శాఖలో సౌమ్యుడిగా పేరున్న ఉమామహేశ్వరరావును భవానీపురం ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు పోలీసులతో చేయిస్తున్న రాజకీయాలను ఈయన తట్టుకోగలడా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరో ఇన్‌స్కర్ ఇక్కడ బదిలీ అయ్యే వరకు నిలబడాలంటే మొత్తం సిబ్బందిని మార్చడమే మార్గమని భావిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

గతంలోనూ ఇటువంటి మార్పులు..

ఒకప్పుడు కృష్ణాజిల్లా పెనమలూరు పోలీసు స్టేషన్‌లోనూ ఇదే పరిస్థితి ఉండేది. అప్పటి ఎస్పీ మొత్తం సిబ్బందిని ఆ స్టేషన్ నుంచి బదిలీ చేసి కొత్త వారిని నియమించారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లోనూ ఇదే జరిగింది. ప్రతి విషయంలోనూ ఆ పోలీస్‌స్టేషన్ తీరు వివాదాస్పదం కావడంతో ఇన్‌స్పెక్టర్‌తోపాటు హోంగార్డుల వరకు అక్కడి పోలీసు కమిషనర్ బదిలీ చేశారు. భవానీపురంలో ఇప్పటికే కొత్త ఇన్‌స్పెక్టర్‌ను నియమించినందున మిగిలిన సిబ్బంది విషయంలో అధికారులు ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తున్నారని తెలిసింది.

● కూటమి ప్రభుత్వంలో లారీ ఇసుక రూ.12వేలు

ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంతంలోని 8 ఇసుక యార్డుల్లో ఇసుక లభ్యమవుతుంది. వీటిలో కీలకమైనది కీసర యార్డు. ఇక్కడ టన్ను రూ.290 నామినల్ ధరకే ఇసుకను అందిస్తున్నారు. సగటున ఒక వినియోగదారునికి 20 మెట్రిక్ టన్నుల ఇసుకను అందిస్తున్నారు. ఈ లెక్కన 20 టన్నులకు కలిపి రూ.5800 ఖర్చు మాత్రమే అవుతోంది. ఈ 20 టన్నుల ఇసుకను తీసుకు వెళ్లే సామర్థ్యం కలిగిన పది చక్రాల లారీకి సంబంధించి ట్రాన్స్‌పోర్టు ధర మరో రూ.5 వేల నుంచి రూ.6 వేలు అవుతుంది. ఈ లెక్కన గరిష్ఠంగా తీసుకున్నా 20 టన్నుల ఇసుక రూ.12,000కే లభిస్తోంది.

● వైసీపీ పాలనలో లారీ ఇసుక రూ.24వేలు

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో టన్నుకు రూ.700 - రూ.800 వరకు స్టాక్ యార్డుల్లో వసూలు చేశారు. దీనికితోడు అధికారులకు, స్టాక్ యార్డుల్లో సిబ్బందికి లంచాలు ఇవ్వాల్సి వచ్చేది. ఇలా అన్ని ఖర్చులు కలిపితే రూ.1000 వరకు అయ్యేది. మొత్తం 20 టన్నుల ఇసుక రూ.20 వేలు అయ్యేది. రవాణా ఖర్చు రూ.6 వేలు కలిపితే రూ.24 వేల వరకు గరిష్ఠంగా ఇసుక ధర ఉండేది.

కీసర స్టాక్ యార్డులో ఇసుక లోడింగ్



సగం ధరకే..!

సామాన్యుడి కల నెరవేరుతోంది. ఇంటి నిర్మాణం కోసం గత ఐదేళ్లు పడ్డ కష్టానికి ఈ ప్రభుత్వంలో ఉపశమనం లభిస్తోంది. అతి తక్కువ ధరలో ఇసుక అందుబాటులోకి వచ్చింది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 8 స్టాక్ యార్డుల్లో ప్రభుత్వం ఈ సౌకర్యం కల్పించింది. పది చక్రాల లారీలో 20 మెట్రిక్ టన్నుల ఇసుక తీసుకు వెళ్లే వినియోగదారునికి రూ.12వేలకే ఇసుకు ఇంటికి చేరుతోంది. గత ప్రభుత్వంలో ఇదే లారీ ఇసుక ఇంటికి చేరేసరికి రూ.24వేలు అయ్యేది. ఉచిత ఇసుక మొదలైన తొలి రెండ్రోజుల్లోనే యార్డుల వద్ద వాహనాలు భారీగా క్యూ కట్టాయి.

గత ప్రభుత్వంలో లారీ ఇసుక రూ.24 వేలు

ప్రస్తుత ప్రభుత్వంలో రూ.12 వేలకే ఇంటికి..

- ఎన్టీఆర్ జిల్లాలో నియంత్రణలోకి వచ్చిన రవాణా చార్జీలు
- కీసర నుంచి విజయవాడకు పది చక్రాల లారీకి రూ.6 వేలు
- ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు ఇంకా తక్కువ ధరకే..
- భవానీపురం, గొల్లపూడిలలో స్టాక్ యార్డులు ఏర్పాటు చేస్తే విజయవాడ వాసులకు మరింత తక్కువ ధరకు..
- ఇసుక స్టాక్ యార్డుల్లోని నిల్వలు వారం రోజుల వరకే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గత ప్రభుత్వంలో పోల్చుకుంటే కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక పథకం వల్ల వినియోగదారులు సగం ధరకే ఇసుకను పొందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంతంలోని వారైతే మరో 2 నుంచి 3 వేలు మినహాయింపు కూడా పొందుతున్నారు. బ్లాక్ మార్కెట్ తగ్గటం, ఎన్‌ఫోర్స్‌మెంట్ పెరగటం, జరిమానాల భయంతో రవాణా వాహనదారులు కూడా న్యాయబద్ధంగానే తీసుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంతంలో దగ్గరగా ఉండటం వల్ల ట్రాన్స్‌పోర్ట్ ధరల్లో ప్రయోజనాలు పొందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంతం నుంచి తూర్పు ప్రాంతం వచ్చే వాహనాలకు సగానికి సగం ప్రయోజనం దక్కుతుండటం విశేషం.

విజయవాడ సమీపంలో స్టాక్ యార్డులు ఏర్పాటు చేయాలి

విజయవాడ గ్రేటర్ విలీన జాబితా గ్రామాల్లో నిర్మాణరంగం ఎక్కువగా ఉంది. దీంతో ఇసుకకు డిమాండ్ ఉంది. విజయవాడ పరిసర ప్రాంతాలైన భవానీపురం ప్రాంతంలో ఒక స్టాక్ యార్డును ఏర్పాటు చేయటం వల్ల రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గుతతాయి. దీనివల్ల ఈ ప్రాంత ప్రజలు మరింత తక్కువ ధరకే ఇసుక దక్కుతుంది. విజయవాడ ప్రజల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణం భవానీపురం, గొల్లపూడి ప్రాంతాల్లో మూడు నుంచి నాలుగు ఇసుక స్టాక్‌యార్డులను కేటాయించాల్సిన అవసరం ఉంది.

స్టాక్ మరో వారానికే..

ప్రస్తుతం స్టాక్‌యార్డుల్లో ఉన్న ఇసుక నిల్వలు మరో వారం రోజుల వరకే అందుబాటులో ఉంటాయని తెలుస్తోంది. మంగళవారం జిల్లాలోని 8 స్టాక్ యార్డుల్లో వాహనాలు పోటెత్తాయి. క్షణం కూడా ఖాళీ లేకుండా వాహనాల రాకపోకలు సాగాయి. జిల్లాలో అత్యధికంగా 2 లక్షల టన్నుల వరకు కీసర స్టాక్‌యార్డులోనే నిల్వలు ఉన్నాయి. మిగిలినచోట్ల చాలా తక్కువగా ఉంది. మరో మూడు రోజుల్లో వీటిలో ఇసుక అయిపోయే అవకాశం ఉంది. కీసరలో ఉన్న నిల్వలు మరో వారం రోజులకు మాత్రమే సరిపోతాయి. జిల్లా యంత్రాంగం తక్షణం ఇసుక ర్యాంపుల నుంచి ఇసుకను తోడే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది.

● కీసర వద్ద టన్ను రూ.290 మాత్రమే

కంచికచర్ల : వైసీపీ పాలనలో కీసర స్టాక్ యార్డు టన్ను రూ.675 నుంచి రూ.800 వరకు తీసుకున్నారు. ట్రాక్టర్ ట్రక్కుకు 4.5 టన్నులు పడుతుంది. దీనికి రవాణా ఖర్చు కలుపుకుంటే రూ.5వేలకుపైగా ధర అవుతోంది. ఇప్పుడు యార్డుకు అయిన రవాణా ఖర్చు, లోడింగ్, సీనరేజ్, ఇతరత్రా పన్నులు కలిపి టన్నుకు కేవలం రూ.290 తీసుకుంటున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.1305 అవుతోంది. ప్రస్తుతం కంచికచర్లలో ట్రాక్టరు ఇసుక రూ.2వేల నుంచి రూ.2500 (యార్డు నుంచి రవాణా కలుపుకుని) పడుతోంది. యార్డు వద్ద ఇసుక కోసం క్యూలో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నందున రవాణాకు కిరాయి ఎక్కువ తీసుకుంటున్నారు. మున్ముందు ఈ ధర ఇంకా తగ్గుతుంది.

వైసీపీ పాలనలో ఇంటి నిర్మాణం ఆగిపోయింది



వైసీపీ పాలనలో ఇసుక కోసం పడిన బాధలు వర్ణనాతీతం. ఒక దశలో పది వేలు ఇస్తామన్నా ట్రక్కు ఇసుక కూడా దొరకలేదు. గత్యంతరం లేక ఇంటి పనులు ఆపేయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇవ్వడం సంతోషంగా ఉంది.

- జూలూరు విశ్వనాథం, కంచికచర్ల

బ్రహ్మయ్యలింగం చెరువుకు.. పర్యాటక సొబగులు

బోటింగ్, కాటేజీలు, రెస్టారెంట్ ఏర్పాటుకు ఏపీటీడీసీ ఆసక్తి

- క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఉన్నతాధికారుల నిర్ణయం
- ఆధ్యాత్మికత, పర్యాటక కలబోతగా.. బ్రహ్మలింగం చెరువు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) గన్నవరం ప్రజల కల నెరవేరబోతోంది. ప్రసిద్ధిగాంచిన బ్రహ్మలింగం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) దృష్టి సారించింది. త్వరలో ఈ ప్రాంతాన్ని పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారులు సందర్శించనున్నారు. గన్నవరం మండలం, చిక్కవరం సమీపంలో సువిశాలమైన 1200 ఎకరాల బ్రహ్మయ్యలింగం చెరువులో బోటింగ్ నిర్వహణ, కాటేజీలు, రెస్టారెంట్ ఏర్పాటు వంటి అంశాలను అధికారులు పరిశీలించనున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఏపీటీడీసీ అధికారులు బ్రహ్మయ్యలింగం చెరువులో బోటింగ్ కార్యకలాపాలకు ప్రయత్నాలు చేశారు.

గత టీడీపీ ప్రభుత్వంలో శ్రీకారం..

బ్రహ్మలింగం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చెయ్యాలని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. పోలవరం కుడి కాలువ నీటిని బ్రహ్మయ్యలింగం చెరువులో నింపేందుకు కొత్తగూడెం వద్ద ఎత్తిపోతల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈలోగా ఎన్నికలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం పర్యాటకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వంలో ఏపీటీడీసీ ఉన్నతాధికారులు బ్రహ్మయ్యలింగం చెరువు అభివృద్ధికి దృష్టి సారించారు.

ప్రకృతి అందాల సోయగం..

బ్రహ్మలింగం చెరువు సహజ ప్రకృతి అందాలతో అలరారుతోంది. చెరువు వెంబడి పచ్చటి కొండ సానువులతో ప్రాంతంలో 12వ శతాబ్ది నాటి బ్రహ్మలింగేశ్వర చారిత్రక ఆలయం ఉంది. కాలక్రమంలో శిథిలం కావటంతో అప్పటి చిక్కవరం గ్రామ పెద్ద అన్నే లక్ష్మణరావు, మరి కొందరు పెద్దలు, గ్రామస్థులు కలిసి శిథిలమైన ఆలయంలోని బ్రహ్మలింగాన్ని కొండదిగువన ప్రతిష్ఠింపచేశారు. కొండపైన శివలింగాన్ని కిందకు తీసుకురాకూడదని కంచి కామకోటి పీఠం సూచించటంతో అన్నే లక్ష్మణరావు బ్రహ్మలింగం చెరువును ఆనుకుని ఉన్న విశాలమైన పర్వతాన్ని ఎంపిక చేసి శివలింగాలపురం అని నామకరణం చేశారు. ఈ పర్వంతంపైకి ఘాట్ రోడ్డు ఏర్పాటు చేసి నల్లరాతి గ్రానైట్‌తో అధునాతన ఆలయాన్ని నిర్మించారు. పలువురు దాతల సహకారంతో పనులు ముగించారు. కొండపై ఏర్పాటు చేసిన ఆలయంలో తిరిగి బ్రహ్మలింగాన్ని ప్రతిష్ఠింపజేశారు. తర్వాత ఆలయ నిర్వహణను ట్రస్టీ అన్నే కంచికామకోటి పీఠానికి అప్పగించారు.

పర్యాటక ఆవశ్యకత..

ఆలయానికి చేరుకోవటానికి ఘాట్ రోడ్డుపై సిమెంట్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఆలయ అభివృద్ధితో పాటు ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధిచెందాల్సిన అవసరం ఉంది. చెరువులో బోటింగ్ కార్యకాలాపాలు ప్రారంభమైతే పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుంది. ట్రెక్కింగ్, క్యాంపింగ్‌కు కూడా ఈ ప్రాంతం అనువుగా ఉంటుంది. కాటేజీ, రెస్టారెంట్ వంటివి కూడా దిగువన నిర్మిస్తే మరింత ఆదరణ కలిగే అవకాశం ఉంది.

స్టాండింగ్ కమిటీ ఎన్నికలో వైసీపీకి షాక్!

విజయం దక్కినా.. పూర్తిస్థాయి ఓటింగ్ దక్కలేదు



పోలీసులతో వాగ్వివాదం తరువాత కార్పొరేటర్లకు సర్దిచెబుతున్న ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

- స్టాండింగ్ కమిటీకి తొలిసారిగా ఎన్నికలు
- ఓటింగ్‌కు హాజరైన 59 మంది కార్పొరేటర్లు



పోలీసుల పహారా

చిట్టినగర్, జూలై 9 : వీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పాలకవర్గం వైసీపీకి సొంతగూటి కార్పొరేటర్లే షాక్ ఇచ్చారు. ఓటింగ్‌కు హాజరైనా పూర్తిస్థాయిలో ఓట్లు వేయలేదు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు వర్గాలుగా విడిపోయారు. వైసీపీ నుంచి రెబల్ అభ్యర్థులుగా ఇద్దరు పోటీకి దిగినా బుజ్జగించి తప్పించారు. మంగళవారం జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికలో విజయం వైసీపీని వరించినా, పూర్తిస్థాయి ఓటింగ్ జరగలేదు.

మొత్తం ఆరు స్థానాలకు ఏడుగురు పోటీలో నిలిచారు. ఈ పదవులకు పార్టీ నేతలు రెండో డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలకుమారి, మూడో డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, 33వ డివిజన్ కార్పొరేటర్ వల్లూరి ఎన్‌డీఎస్ మూర్తి, 41వ డివిజన్ కార్పొరేటర్ ఇర్ఫాన్, 43వ డివిజన్ కార్పొరేటర్ బాపటి కోటిరెడ్డి, 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి వైసీపీ నుంచి బరిలోకి దిగారు. తెలుగుదేశం పార్టీ నుంచి 32వ డివిజన్ కార్పొరేటర్ చెన్నగిరి రామ్మోహనరావు పోటీ చేశారు. వీఎంసీలో మొత్తం 64 కార్పొరేటర్ స్థానాలు ఉన్నాయి. వాటిలో 11వ డివిజన్ కార్పొరేటర్ రాజీనామాను ఆమోదించడంతో 63 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వారిలో వైసీపీ ఫ్లోర్ లీడర్ సత్యనారాయణ, మరో కార్పొరేటర్ కలపాల అంబేద్కర్ ఓటింగ్‌కు హాజరురాలేదు. వైసీపీకి చెందిన బాలగోవిందు అనారోగ్యంతో ఉన్నారు. సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు ఎన్నికలను బహిష్కరించారు. మొత్తం 59 మంది ఎన్నికలకు హాజరయ్యారు. ఫలితాలు వచ్చే వరకు ఈ మొత్తం కార్పొరేటర్లు ఓట్లు వేశారని భావించారు. ఫలితాలు వెలువరించిన తర్వాత నిర్మల కుమారికి 47, ప్రవల్లికకు 47, వీఎన్‌డీఎస్ మూర్తికి 45, ఇర్ఫాన్‌కు 45, కోటిరెడ్డికి 46, దేవికి 44 ఓట్లు వచ్చాయి. దీంతో ఈ ఆరుగురు స్టాండింగ్ కమిటీకి ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు. టీడీపీ తరఫున బరిలోకి దిగిన రామ్మోహనరావుకు 16 ఓట్లు వచ్చాయి. వైసీపీకి మొత్తం 49 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఈ మొత్తం ఓట్లు వైసీపీకి పూర్తిస్థాయిలో పోలవ్వకపోవడం గమనార్హం. అసంతృప్తి కారణంగానే ఈ ఓట్లు వేయలేదని తెలుస్తోంది. గతంలో టీడీపీలో గెలిచిన మాధురీలావణ్య పార్టీ మారారు. అయినప్పటికీ టీడీపీ 12 మందితోపాటు అదనంగా నాలుగు ఓట్లు వచ్చాయి. నలుగురు కార్పొరేటర్ల మద్దతు ఉందని తెలుస్తోంది.

పోలీసులకు, కార్పొరేటర్లకు వాగ్యుద్ధం

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన కార్పొరేటర్లకు పోలీసులకు వాగ్యుద్ధం జరిగింది. ఓటింగ్ పూర్తయిన తర్వాత కార్పొరేటర్లు వీఎంసీ ప్రాంగణంలో నిలబడి పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. వారిని పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. దీంతో వారు రెచ్చిపోయారు. వీఎంసీ ప్రాంగణంలో పోలీసుల పెత్తనం ఏమిటని కార్పొరేటర్లు తిరగబడ్డారు. తర్వాత కాసేపటికి పరిస్థితి సర్దుకుంది.

● తొలి ఎన్నిక...

వీఎంసీ ఏర్పడిన తర్వాత స్టాండింగ్ కమిటీకి తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. కార్పొరేషన్‌కు ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు జరగడం సర్వసాధారణం. ఇక్కడ పాలకవర్గంగా ఉన్న పార్టీ కార్పొరేటర్లే స్టాండింగ్ కమిటీకి ఎన్నికవుతుంటారు. ఇదంతా ఏకగ్రీవంగా జరుగుతోంది. వీఎంసీ ఏర్పాటైన తర్వాత పాలకవర్గాలను ఎన్నుకోవడానికి ఎన్నికలు జరిగాయి. స్టాండింగ్ కమిటీలోని పదవులకు ఇప్పటి వరకు ఎన్నికలు జరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు తొలిసారిగా ఈ స్టాండింగ్ కమిటీకి ఎన్నికలు జరగడం గమనార్హం.

ఉల్లంఘనలపై ఉక్కుపాదం

- కలెక్టర్ సృజన హెచ్చరిక
- కీసర స్టాక్ యార్డు పరిశీలన

6లో..

పటిష్ట భద్రత!

- దుర్గగుడి సెక్యూరిటీ పటిష్టతపై సమీక్ష



పటిష్ఠ భద్రత!



» దుర్గగుడి సెక్యూరిటీ పటిష్టతపై సమీక్ష

వన్‌టౌన్, జూలై 9 : దుర్గగుడిలో సెక్యూరిటీ వ్యవస్థ పటిష్టతపై ఆలయ అధికారులు, పోలీసు అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. 2020లో ఆలయ సెక్యూరిటీ వ్యవస్థ, ఇతర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలకు ఇదే తరహాలో సమీక్షించి నివేదిక తయారు చేశారు. నాటి సూచనలతో పాటు తాజా పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పలు సూచనల కోసం ఆలయంలోని డోనర్‌సెల్‌లో కీలక సమావేశాన్ని నిర్వహించారు. సెక్యూరిటీ విభాగం, సీసీ కెమెరాల నిర్వహణ, భక్తులు ప్రవేశించే.. నిష్క్రమించే మార్గాలు, క్యూలు, అత్యవసర మార్గాలు, భక్తుల రద్దీ సమయాలలో అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించారు. బుధవారం కూడా సమావేశాన్ని కొనసాగించి నివేదికను రూపొందించనున్నారు. ఆలయానికి భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పరిమిత స్థలంలోనే ఎటువంటి ఏర్పాట్లు ఉండాలన్న దానిపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయనున్నారు. డీసీపీలు ఏబీటీఎస్ ఉదయరాణి, వెస్ట్‌జోన్ డీసీపీ హరికృష్ణ, డీసీసీ మురళీకృష్ణారెడ్డి, ఇంటెలిజెన్స్ డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఈవో రామారావు డిప్యూటీ ఈవో లీలాకుమార్, ఈఈ కోటేశ్వరరావు, ట్రాఫిక్, అగ్నిమాపక, ఆర్ అండ్ బీ, మునిసిల్ కార్పొరేషన్, విద్యుత్ తదితరడిపార్ట్‌మెంట్ల అధికారులు, వన్‌టౌన్ సీఐ, ఆలయ ఎస్‌పీఎఫ్, ఎగిల్ సంస్థ అధికారులు పాల్గొన్నారు.



దుర్గగుడి భద్రత ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అధికారులు



అమ్మవారి ఉత్సవమూర్తికి సారె సమర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు,

కనకదుర్గమ్మకు ప్రసాదాల విభాగం సారె

వన్‌టౌన్, జూలై 9 : ఆషాఢమాసం సందర్భంగా దుర్గమ్మవారికి నిర్వహిస్తున్న సారె సమర్పణ క్రమంలో మంగళవారం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రసాదాల తయారీ విభాగం సిబ్బంది, అధికారులు సారె సమర్పించారు. ప్రసాదాల కేంద్రంలో అమ్మవారి ఉత్సవమూర్తికి ఈవో కేఎస్ రామారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి వద్ద దేవతామూర్తులకు పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా బయలుదేరారు. కొండపైన ప్రసాదాల తయారీ విభాగం ఉద్యోగులు, కుటుంబసభ్యులు, అధికారులు అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం మహామండపంలోని ఆరో అంతస్తులో ఉత్సవమూర్తి వద్ద పూజలు నిర్వహించి సుగంధ పరిమళద్రవ్యాలు, పూలు, పండ్లు తదితరాలతో సారెను సమర్పించారు. పండితులు వారికి ఆశీస్సులు అందజేశారు. డిప్యూటీ ఈవో లీలాకుమార్, ఈఈ రమాదేవి, ఏఈవో పి.చంద్రశేఖర్, శానిటేషన్, ప్రసాదాల తయారీ విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సారె సమర్పించిన 786 మంది భక్తులు

దుర్గమ్మకు మంగళవారం విజయవాడకు చెందిన అపరాజిత సేవా భజనమండలి బృందం 200 మంది, ఈవో ఆధ్వర్యంలో 100 మందితో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తబృందాలు 786 మంది సారె సమర్పించారు. వారికి అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం మహామండపంలోని ఉత్సవమూర్తి వద్ద పూజాదికాలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు.



చెక్‌లు అందజేస్తున్న నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, తహసీల్దార్ శేషు

బూదవాడ ప్రమాద బాధితులకు చెక్కుల అందజేత

జగ్గయ్యపేట/జగ్గయ్యపేట రూరల్, జూలై 9 : బూదవాడ అల్ట్రాటెక్ ప్రమాదంలో క్షతగాత్రులైన ఏడుగురి కుటుంబసభ్యులకు మంగళవారం నందిగామ ఆర్డీవో రవీంద్రరావు నష్ట పరిహారం చెక్కులను అందజేశారు. బాధితులు గోపీనాయక్, బాలాజీ, బాణావత్ సైదా, పి.అర్జున రావు, బాణావత్‌స్వామి, వేముల సైదులు, ధారావత్ వెంకటేశ్వరరావుల కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికి రూ25లక్షల చెక్‌లను అందచేశారు. ఆయనతో పాటు జగ్గయ్యపేట తహసీల్దార్ శేషు ఉన్నారు.

బూదవాడలో మెగా వైద్యశిబిరం



బూదవాడలో మంగళవారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి చెందిన సీనియర్ వైద్యులు ప్రజలకు చికిత్స అందించారు. కార్యక్రమంలో జిల్లా డీసీహెచ్ నాయక్, డీఎంహెచ్‌వో సుహాసిని, వైద్యులు శ్రీనివాస్, హరినాద్, సంపత్, నాగేశ్వరరావు, నందిగామ, జగ్గయ్యపేట, బూచవరం, వత్సవాయి పరిధిలోని వైద్యాధికారులు పాల్గొన్నారని బూచవరం వైద్యాధికారి అనిల్‌కుమార్ తెలిపారు.

గ్రామస్థుల నిరసన ..

బూదవాడలో మంగళవారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఏ కర్మాగారం వ్లల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారో అదే కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆస్పత్రిలో శిబిరం నిర్వహించటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామానికి దూరంగా ఉన్న కంపెనీ ఆస్పత్రి శిబిరానికి వృద్ధులు, చిన్నారులు ఎలా వెళతారని ఆవేదన చెందారు. గ్రామంలో అల్ట్రాటెక్ కర్మాగారం ఏర్పాటు తరువాతనే రోగాల బారిన పడుతున్నామని, గ్రామ పరిస్థితిపై అధ్యయనం చేస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయని తెలిపారు. ముందుగా గ్రామంలో ప్రజలకు ఏఏ వైద్య అవసరాలున్నాయో కుటుంబాల వారీగా ఆరా తీసి వారికి కావాల్సిన వైద్యం అందించాలని అభిప్రాయపడ్డారు. దీనిపై వైద్యాధికారి అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అత్యవసరంగా ఏర్పాటు చేశామని కంపెనీ ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలు చేసేందుకు పరికాలు ఉండటంతో అక్కడ ఏర్పాటు చేశారని, విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామంలోనే నిర్వహించేలా చూస్తామని తెలిపారు.

గంజాయి బ్యాచ్ అరెస్టు

మైలవరం, జూలై 9 : మైలవరంలో 22 కిలోల సుమారు రూ.80 వేల విలువగల గంజాయిని, ఐదు మోటార్ బైక్‌లతో పాటు ఆరుగురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు మైలవరం పీఎస్‌లో డీసీపీ కె.శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడుతూ, మైలవరానికి చెందిన తొమ్మండ్రు అక్షయ్‌కుమార్, గరికపాటి శ్రీహర్ష, మగిశెట్టి యశ్వంత్, వేముల జమలయ్య, షిండే బాజీ, ఇబ్రహీంపట్నంకు చెందిన శివ, సీలేరు పుష్పలంకకు చెందిన ఇస్తావతు జగన్, మధు, టిల్లులతో కలిసి ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ పరిధిలో మోటార్ బైక్‌లను తస్కరించి వాటిని ఏజెన్సీ ప్రాంతంలో విక్రయించి వారి వద్దే గంజాయిని కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తూ జల్సాలు చేస్తున్నారన్నారు. మొత్తం 9 మందిలో ఆరుగురిని అరెస్టు చేయగా ముగ్గురు పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఏసీపీ మురళీమోహన్, సీఐ కిషోర్ బాబు, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.



అనుమంచిపల్లి ఇసుక డంప్ వద్ద నిలిచి ఉన్న ట్రాక్టర్‌లు

కూపన్ల కోసం క్యూ..

ఇసుక కోసం బారులు..

జగ్గయ్యపేట రూరల్ : బడుగు, బలహీన వర్గాల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక పంపిణీని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని అనుమంచిపల్లి వద్ద ఇసుక పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం పేదలకు ఇసుక లభ్యం కాకుండా కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నేడు ఉచిత ఇసుక ప్రారంభించటంతో లబ్దిదారులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఇసుక ట్రాక్టర్‌లను నడిపి ప్రారంభించారు. అనుమంచిపల్లి ఇసుక డంప్ వద్ద మంగళవారం ఉదయం నగదు కోసం ఏర్పాటు చేసిన స్కానర్ పని చేయకపోవటంతో దాదాపు ఏడు గంటల పాటు ఇసుక సరఫరా నిలిచిపోయింది. ఇసుక కోసం వచ్చిన వాహనాలు బారులు తీరాయి. ఒంటి గంట నుంచి లబ్దిదారులకు ఇసుక సరఫరా చేశారు.

ఉల్లంఘనలపై ఉక్కుపాదం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన హెచ్చరిక

» కీసర స్టాక్‌యార్డు పరిశీలన



కీసర స్టాక్ యార్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

కంచికచర్ల, జూలై 9 : ఉచిత ఇసుక పంపిణీ విధానం అమలులో లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. కంచికచర్ల మండలం కీసర స్టాక్ యార్డును మంగళవారం ఆమె సందర్శించి పంపిణీ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. నిర్మాణ అవసరాలకు మించి ఇసుక నిల్వ చేసినా, తిరిగి విక్రయించినా లేదా ఇతర రాష్ట్రాలకు తరలించినా జరిమానాతో పాటుగా క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఇసుక లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం లేకుండా త్వరితగతిన వినియోగదారులకు అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయించిన నామమాత్ర రుసుం మాత్రమే వసూలు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లాలో కంచెల, మాగల్లు, కొడవటికల్లు, అల్లూరుపాడు, అనుమంచిపల్లి, పోలంపల్లి, కీసర, మొగులూరు డిపోల వద్ద ఇసుక విక్రయాలు జరుగుతున్నాయన్నారు. కీసర స్టాక్ పాయింట్‌లో రెండు లక్షల 25 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. అన్ని స్టాక్ పాయింట్ల వద్ద వినియోగదారులు ఇబ్బందులు పడకుండా తాగు నీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. స్టాక్ పాయింట్లలో అందుబాటులో ఉన్న ఇసుక ధరలను గనులశాఖ వెబ్‌సైట్లో ఉంచామని, ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు మాత్రమే విక్రయించాలని చెప్పారు. రోజూవారి విక్రయాలు, నిల్వ వివరాలను రాత్రి ఎనిమిది గంటలలోపు గనుల శాఖ పోర్టల్లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇసుక ధరలను స్టాక్ పాయింట్ల వద్ద ప్రదర్శించాలన్నారు. ఒక వ్యక్తి రోజుకు 20 టన్నుల ఇసుక మాత్రమే తీసుకువెళ్లేందుకు అనుమతి ఉందన్నారు. విక్రయ లావాదేవీలను సీసీ కెమెరాలతో పర్యవేక్షించాలన్నారు. ఒకే బ్యాంకు ఖాతాతో అనుసంధానమై ఉండటం వల్ల లావాదేవీలకు వినియోగించే క్యూ ఆర్ కోడ్ విషయంలో కొంత ఆలస్యమవుతున్నదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. ప్రాథమిక దశలో క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ త్వరితగతిన లోడింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ పేర్కొన్నారు.

కీసర స్టాక్ యార్డు వద్ద ఇసుక కూపన్ల కోసం మంగళవారం సాయంత్రం వినియోగదారులు బారులుతీరారు. ఇసుక కోసం వచ్చిన వారికి అధికారులు ముందుగా కూపన్ల పంపిణీ చేపట్టారు. టన్ను రూ.290లకే ఇసుక లోడింగ్ చేస్తుండటంతో వినియోగదారులు పోటెత్తారు. దీంతో స్టాక్ యార్డు వద్ద భారీ క్యూ దర్శనమిచ్చింది. విజయవాడ, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, నందిగామ తదితర ప్రాంతాల నుంచి లారీలు, టిప్పర్లు వచ్చాయి. జాతీయ రహదారిపై రెండు వైపులా వాహనాలు బారులు తీరాయి. ఉదయం పది గంటలకు స్టాక్ యార్డు నుంచి సాగర్ కాల్వ వరకు లారీలు, టిప్పర్లు వందల సంఖ్యలో ఉన్నాయి. లోడింగ్ కొద్దిగా ఆలస్యమవుతుందని, గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నదని వాహనాల సిబ్బంది చెపుతున్నారు.

రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగుల భాగస్వామ్యం అవసరం

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



ఎంపీ చిన్నిని సత్కరిస్తున్న ఎన్‌జీవో నేతలు

విద్యాధరపురం, జూలై 9: రాష్ట్రాభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగుల భాగస్వామ్యం అవసరమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో చిన్నిని మంగళవారం ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు, జేఏసీ ఛైర్మన్ ఏ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీగా విజయం సాధించినందుకు మొక్కను అందించి దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ఉద్యోగులు పడిన మానసిక, ఆర్థిక ఇబ్బందులను గుర్తు చేశారు. ఎవ్వరూ 1న జీతాలు అందుకోలేకపోయారన్నారు. సీఎం చంద్రబాబు ఉద్యోగుల సంక్షేమం, ప్రయోజనాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారన్నారు. ఉద్యోగ సమస్యల పరిష్కారానికి, రాష్ట్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. సీఎం చంద్రబాబు సూచనతో కేంద్రం నుంచి నిధులు రాబట్టి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. విద్యాసాగర్ మాట్లాడుతూ గతంలో సీఎంగా చంద్రబాబు ఉన్నప్పుడు నిడమానూరు ఫ్లై ఓవర్, తూర్పు బైపాస్‌కు ఎంతో కృషి చేశారన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో ఉద్యోగులు తమవంతు సహకారం అందిస్తారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే 1న జీతాలు పడినట్టు తెలిపారు. నేతలు డి.సత్యనారాయణరెడ్డి, ఎండీ ఇక్బాల్, బి.సతీష్‌కుమార్, కే.శివలీల, ఎం.రాజబాబు, సీహెచ్‌వీ ప్రసాద్, నజీరుద్దీన్, రాజశేఖర్, విజయశ్రీ, ఏ సాంబశివరావు, సాయిరాం, శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిన్నిని కలిసిన వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని మంగళవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీలోని వాకర్స్ క్లబ్ సెక్రటరీ కే నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కే.శ్రీనివాసశేఖర్, నరసింహారావు, కార్యవర్గ సభ్యులు అమరేంద్ర బాబు, నాగభూషణం మర్యాదపూర్వకంగా కలిశారు.

బడుగు, బలహీన వర్గాల సేవలో టీడీపీ

టీడీపీ ఎప్పుడూ బడుగు, బలహీన వర్గాల సేవలో ముందంజలో ఉంటుందని శివనాథ్ అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో పశ్చిమలోని 40వ డివిజన్‌కు చెందిన దివ్యాంగుడు గోపిశెట్టి తిరునాథంకు ఆయన మూడు చక్రాల బండిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్నారన్నారు. పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, మల్లెపు రాజు, శేఖర్ పాల్గొన్నారు.

చాంబర్‌కు అండగా ఉంటా: చిన్ని

విద్యాధరపురం: విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు అండగా ఉంటానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్‌కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గడ్డం రవి ఎంపీ చిన్నికి పుస్తకాలు అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు వ్యాపారవర్గాలకు ఎప్పుడూ అండగా ఉంటానని తాను కూడా చాంబర్‌కు అండగా ఉంటానన్నారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్, వ్యాపారులు వీవీకే నరసింహారావు, తమ్మిన శ్రీనివాస్, గడ్డం సత్యనారాయణ, నూకల నాగేశ్వరరావు, జాలాది వెంకటేశ్వర్లు, కే.ఎల్ రంగనాయకులు, సీఎల్ అరుణకుమార్ పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్ ఐదో దశలో ప్రమాదం

● ఇద్దరికి గాయాలు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు ● బాధితులను పరామర్శించిన మంత్రి, మాజీమంత్రి



బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్, మాజీమంత్రి ఉమా

ఇబ్రహీంపట్నం/గొల్లపూడి, జూలై 9: ఎన్టీటీపీఎస్ 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం గలిగిన ఐదో దశలో సోమవారం అర్ధరాత్రి బాయిలర్ మరమ్మతుల సమయంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు ఉద్యోగులకు తీవ్ర గాయాలయ్యాయి. పర్మినెంట్ ఉద్యోగి చక్రధర్, కాంట్రాక్టు కార్మికుడు అప్పారావు బాయిలర్‌కు మరమ్మతులు చేస్తుండగా సడన్‌గా దాని డోర్స్ ఓపెనై అందులో ఉన్న వేడి ఫ్లై యాష్ బంక మట్టి వారిపై పడ్డాయి. ఈప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు అప్పారావు శరీరం 60శాతం కాలిపోగా, చక్రధర్ శరీరం 20 శాతం కాలినట్టు తెలుస్తోంది. వారిని గొల్లపూడి ఆంధ్రా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

ఐదేళ్ల పాపాల ఫలితం : మంత్రి సుభాష్, దేవినేని ఉమా

ఎన్టీటీపీఎస్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని ఆంధ్రా ఆసుపత్రికి వెళ్లి మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. దుర్ఘటనపై సమగ్ర విచారణ చేయిస్తామన్నారు.

దుర్గగుడి చైర్మన్ కర్నాటి హల్‌చల్

తన చాంబర్ డీఈవోకు కేటాయించడంపై రుసరుస

బోర్డుకు ఇంకా కాలపరిమితి ఉందంటూ ఉగ్యోగులపై ఆగ్రహం

వన్‌టౌన్, జూలై 9: దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు ఇంకా వైసీపీ ప్రభుత్వం అధికారంలోనే ఉందన్న భ్రమలోనే ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం దిగిపోయాక రాష్ట్రంలోని పలు దేవస్థానాల చైర్మన్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. కానీ దుర్గగుడి చైర్మన్, ధర్మకర్తలు రాజీనామా చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆయన దేవస్థానంలో హల్‌చల్ చేశారు. ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ తీరుపై ఉద్యోగులు మండిపడుతున్నారు. ఈవో రామారావు చైర్మన్ చాంబర్‌ను రెండ్రోజుల క్రితం డిప్యూటీ ఈవో లీలాకుమార్‌కు కేటాయించారు. 10 గంటలకు ఆయన దేవస్థానంలో రౌండ్స్‌కు వెళ్లారు. చాంబర్‌ను డీఈవోకు కేటాయించారన్న సమాచారం తెలుసుకున్న రాంబాబు ఉదయం 10గంటల తరువాత వచ్చి తన చాంబర్‌ను డీఈవోకు ఎలా కేటాయిస్తారు? నేను రాజీనామా చేయలేదు, మా బోర్డుకు 6నెలల గడువుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారాక బోర్డు కాలం ముగిసినట్టేనని చెప్పినా పట్టించుకోలేదు. రౌండ్స్ ముగించుకుని తన చాంబర్‌కు వచ్చిన డీఈవో లోపల చైర్మన్ ఉన్నారన్న విషయం తెలుసుకుని సుమారు గంట వేచి ఉన్నారు. తరువాత వేరేచోటికి వెళ్లారు. చైర్మన్ 2.30 గంటల వరకు కూర్చుని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని ఈవో దృష్టికి తీసుకువెళ్లారు. సాయంత్రం డీఈవో లీలాకుమార్ యథావిధిగా తన కార్యాలయానికి వచ్చారు. ఈవో ఆదేశాలతో సిబ్బంది చాంబర్ ముందు డీఈవో నేమ్‌బోర్డును ఏర్పాటు చేశారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

అజిత్‌సింగ్‌నగర్, జూలై 9: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఉద్యోగులు మంగళవారం సచివాలయాల శాఖ రాష్ట్ర సంచాలకుడు శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై శివప్రసాద్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్‌కే మహబూబ్ సుభానీ, ఎం. శశిధర్, చక్రవర్తి పాల్గొన్నారు.



భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబుకు దుర్గమ్మ చిత్రపటం ఇస్తున్న అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో తెలంగాణ డీసీఎం, మంత్రి

వన్‌టౌన్, జూలై 9: తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ఇంద్రకీలాద్రిపైనున్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. వారికి దేవదాయ కమిషనర్ కే సత్యనారాయణ, ఈవో రామారావు, అర్చక బృందం సాదర స్వాగతం పలికి ఆలయ మర్యాదలు అందజేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సోమవారం నగరంలో జరిగిన వైఎస్ఆర్ జయంతి సభకు హాజరైన విక్రమార్క, శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా విచ్చేసి దుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం దేవదాయకమిషనర్, ఈవో, అర్చకులు వారికి దుర్గమ్మ చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.

ఘనంగా ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవం

మొగల్రాజపురం, జూలై 9: జ్ఞానం, శీలం, ఏకతా అనే మూడు నినాదాలతో ప్రారంభమైన అఖిల భారత విద్యార్థి పరిషత్ విద్యార్థుల్లో జాతీయ భావం, దేశభక్తిని రగిలిస్తూ నడుస్తూ 76ఏళ్లుగా ఎదుగుతూ ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఉందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యాగంటి వెంకట గోపి చెప్పారు. ఏబీవీపీ నగర శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ మాజీ జాతీయ నేత పోతుగుంట రమేష్ నాయుడు శిఖామణి సెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీబీ సిద్ధార్థ కళాశాల నుంచి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎంజి రోడ్డు ఫుడ్‌కోర్టు వరకు సాగింది. యాగంటి వెంకట గోపి, జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి తిరిగే శివకుమార్, ఎస్ఎఫ్‌డీ రాష్ట్ర కన్వీనర్ ఎం. సుబ్రహ్మణ్యం, నగర కార్యదర్శి దుర్గారావు, అఖిల్, జితేంద్ర, బాలకాసి, రాజేష్, వసీం, హర్ష, వరుణ్, తరుణ్, మురళీ భారీగా విద్యార్థులు పాల్గొన్నారు.



హత్య కేసు నిందితులతో ఏఎస్పీ వెంకటేశ్వరరావు

భర్తను కడతేర్చిన భార్య, నిందితుల అరెస్టు

మచిలీపట్నం టౌన్, జూలై 9 : వివాహేతర సంబంధం నేపథ్యంలో కట్టుకున్న భర్తనే హత్య చేసిన భార్య, ఆమెకు సహకరించిన వారిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఎస్పీ కార్యాలయం వద్ద ఏఎస్పీ వెంకటేశ్వరరావు నిందితులను హాజరుపరిచారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఏఎస్పీ జి. వెంకటేశ్వరరావు కేసు వివరాలు తెలిపారు. ప్రియుడితో కలిసి కొంత మంది సహకారంతో భర్తను హత్య చేసిన ఈ కేసును త్వరితగతిన ఛేదించామన్నారు. బంటుమిల్లికి చెందిన చిగురుశెట్టి సుభాష్ చంద్రబోస్ ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడి భార్య శిరీష ఏలూరు జిల్లా ఎస్‌కెపల్లి గ్రామానికి చెందిన తిరుమలశెట్టి పరశురామయ్యతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ క్రమంలో భర్త అడ్డుగా ఉంటున్నాడని, హతమార్చాలని పథకం పన్నింది. ప్రియుడితో ఈ విషయం చెప్పింది. ప్రియుడు, మరో ముగ్గురితో కలిసి సుభాష్‌చంద్రబోస్‌కు పెదపట్నం నుంచి ఫోన్ చేస్తున్నామని, ఉల్లిపాయలు కావాలని, కిరాయి కూడా ఇస్తామని చెప్పారు. ఉల్లిపాయల మూటలు తీసుకుని పెదపట్నం వెళుతుండగా పథకం ప్రకారం 5వ తేదీ రాత్రి 7 గంటలకు బంటుమిల్లి మండలం నారాయణపురం గ్రామంలో స్మశానవాటిక దగ్గరకు సుభాష్‌చంద్రబోస్ రాగానే వెనుక నుంచి బైక్‌పై ముగ్గురు ఆటో దగ్గరకు వచ్చి ఐరన్ పైపులతో విచక్షణారహితంగా తల, ముఖంపై కొట్టారు. 108 అంబులెన్స్‌లో సుభాష్ చంద్రబోస్‌ను బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కేసులో నిందితులైన తిరుమలశెట్టి పరశురామయ్య, భార్య శిరీష, నిడమర్రు మండలం భువనపల్లి గ్రామానికి చెందిన కిల్లా హేమంతకుమార్, భీమవరానికి చెందిన కోడిగుడ్ల మౌలి, ఏలూరు జిల్లా భువనపల్లి గ్రామానికి చెందిన జువైనల్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కేసు ఛేదించిన పెడన, బంటుమిల్లి, గూడూరు ఎస్ఐ నాగేంద్ర కుమార్, వాసు, వీర్రాజులకు ఏఎస్పీ వెంకటేశ్వరరావు, డీఎస్పీ అబ్దుల్ సుభాన్‌లకు రివార్డులు అందజేశారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం : మంత్రి సవిత

గొల్లపూడి, జూలై 9 : బీసీల పునాదుల మీద ఉద్భవించిన పార్టీ టీడీపీ అని, బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమశాఖ భవనాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీలను వైసీపీ కేవలం ఓటు బ్యాంకుగానే చూసి అణచివేసిందన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ బెంచ్‌మార్క్‌ను అందుకున్న వీఎంసీ

చిట్టినగర్, జూలై 9: వీఎంసీ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ బెంచ్ మార్క్‌ను అందుకుందని 5వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ ఎస్ రత్నకుమారి అన్నారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో 5వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఎంసీ అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. ఫైనాన్స్ కమిషన్ ప్రధాన ధ్యేయమైన ఆర్‌ఆర్‌ఆర్ (రీసైకిల్ రీయూస్, రెడ్యూస్)లో ముందుందన్నారు. టాక్స్ రెవెన్యూ, నాన్ టాక్స్ రెవెన్యూ అసైన్డ్ టాక్స్, రాష్ట్ర సెంట్రల్ గవర్నమెంట్ గ్రాంట్స్ ఎయిర్ క్వాలిటీ, వాటర్ క్వాలిటీ, శానిటేషన్, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, బేసిక్ నీడ్స్ వంటి తదితర అంశాలపై వివిధ శాఖాధిపతులతో చర్చించారు. 5వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ ప్రొఫెసర్ కేవీ రమణారెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, ప్రొఫెసర్ ఎం.వి.ఎన్.పద్మారావు, కే కృపారావు, వీఎంసీ అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ కె.వి. సత్యవతి, జనరల్ డాక్టర్ ఏ.మహేష్, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

రైతుబజార్‌లో తక్కువ ధరలకే నిత్యావసరాలు

పటమట, జూలై 9 : రాష్ట్రవ్యాప్తంగా రైతుబజార్ల ద్వారా నిత్యావసర వస్తువులను ప్రజలకు బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరలకు అందించే కార్యక్రమం గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం అవుతుందని పటమట రైతుబజార్ ఎస్టేట్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

దీనిలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు ఏపీఐఐసీ కాలనీ రైతుబజార్‌లో గురువారం నుంచి నిత్యావసర సరకులు అమ్మకాలు ప్రారంభిస్తున్నామన్నారు. ఆ రోజు సెలవు లేదని, యధావిధిగా రైతుబజార్ సాగుతుందన్నారు.

జీపాట్‌లో సిద్ధార్థ ఫార్మశీకి ర్యాంకులు

మొగల్రాజపురం, జూలై 9: కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యా ప్రవేశాలకు నిర్వహించే జీపాట్ పరీక్షల్లో కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాల విద్యార్థులు జాతీయ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సునీత ఒక ప్రకటనలో తెలిపారు. పి.సౌజన్య జాతీయ స్థాయిలో 635 ర్యాంకు సాధించగా మరో 17 మందికి అత్యుత్తమ ర్యాంకులు వచ్చాయని తెలిపారు. ఇటీవల ప్రాంగణ ఎంపికల్లో గరిష్ఠంగా రూ.5లక్షల జీతంతో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను, జాతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సిద్ధార్థ అకాడమీ యాజమాన్యం అభినందించినట్లు పేర్కొన్నారు.

కార్యాలయాన్ని ధ్వంసం చేశారంటూ ఫిర్యాదు

విద్యాధరపురం, జూలై 9: టీడీపీ నేతలు కొంత మంది తన కార్యాలయాన్ని ధ్వంసం చేశారని 42వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ చైతన్యరెడ్డి మంగళవారం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు న్యాయం జరగకపోతే నిరాహారదీక్ష చేస్తానని తెలిపారు. టీడీపీ నాయకులు కక్షపూరితంగా విధ్వంసానికి పాల్పడుతున్నారని, దీనిని కట్టడి చేయాలని కోరారు. తన కార్యాలయాన్ని ధ్వంసం చేసినందుకు ఆమె ఆందోళన చేశారు.

సితార పార్కు సం'గతేమిటి'

- రెండేళ్ల నుంచి నాన్చుడే
- మద్యసేవనం, బహిర్భూమిగా వినియోగం
- నిరుపయోగంగా పార్కు స్థలం

భవానీపురం, జూలై 9 : 45వ డివిజన్‌లోని సితార జంక్షన్ మెయిన్‌రోడ్డులో పార్కు అభివృద్ధికి గ్రహణం పట్టుకుంది. గట్టు వెనుక ప్రాంతంలో చెప్పుకోదగ్గ పార్కు లేదు. దీంతో పలు డివిజన్ల ప్రజలకు ఆహ్లాదం ఎండమావిగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అప్పటి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అనాలోచిత నిర్ణయాలతో దీనికి అతీగతీ లేకుండా పోయింది. ఎన్నో ఆశలతో ప్రజల కోసం పార్కు నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య ఇప్పటికీ ఒంటరి పోరాటం చేస్తూనే ఉన్నారు. అయినా కార్పొరేషన్ అధికారులు మాత్రం ఈ వ్యవహారంలో ముందడుగు వేయలేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

జోజినగర్ చర్చి నుంచి సితార జంక్షన్ వరకూ బ్యూటిఫికేషన్, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని రూ.1.75 కోట్ల వ్యయంతో చేపట్టే పనులకు వెలంపల్లి 2022 జూన్ 30న శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఇక్కడ వైసీపీ కార్యాలయం ఏర్పాటు చేసేస్తామని, అటు తర్వాత అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ స్థలం పరిశీలన చేపట్టినప్పుడు షాపింగ్ కాంప్లెక్సులను ఏర్పాటు చేయాలని



నిరుపయోగంగా సితార పార్కు స్థలం

యోచించారు. ఈ రెండు చేయలేదు. సరి కదా. పార్కు స్థలం నిరుపయోగంగా ఉండటంతో స్థానికంగా మందుబాబులు ఇక్కడ పగలు, రాత్రీ తేడా లేకుండా మద్యసేవనంతో అధ్వానంగా మార్చేశారు. ఇదే అదునుగా ఇక్కడే స్థలాలను బహిర్భూమిగా వినియోగించడంతో పరిసరాలు దుర్గంధ పూరితంగా మారాయి. దీనిపై మేయర్, ప్రస్తుత ఎమ్మెల్యే సుజనా చౌదరిలు స్పందించి ప్రజలకు ఆహ్లాదం కోసం పార్కును సిద్ధం చేసేలా అధికారులకు ఆదేశాలివ్వాలని కోరుతున్నారు.

ప్రతీ కౌన్సిల్ సమావేశంలోనూ ప్రస్తావిస్తూనే ఉన్నా



భవానీపురం పరిసరాల్లో చెప్పుకోదగ్గ పార్కులేదని, ఇక్కడ పార్కు ఏర్పాటుకు ఎంతో ప్రయత్నం చేశాం. రెండేళ్ల క్రితం శంకుస్థాపన జరిగినప్పుడు ఎంతో ఆనందపడ్డాను. కార్పొరేటర్ ప్రతిపాదనకు విలువ లేకుండా పార్కు పనులను నిలిపివేశారు. ప్రతీ కౌన్సిల్ సమావేశంలోనూ ఇక్కడ పార్కు పనులపై అధికారులను అడుగుతున్నా అతీగతీ ఉండటం లేదు. ఇప్పటికైనా అధికారులు పార్కు పనులు చేపట్టాలని కోరుతున్నాను.

- మాధురి లావణ్య,కార్పొరేటర్



ధర్నా చేస్తున్న స్థానిక మహిళలు, సీపీఎం నాయకులు

తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం ధర్నా

చిట్టినగర్, జూలై 9: 50వ డివిజన్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేట శ్రామిక భవనం వద్ద స్థానిక మహిళలు, సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ 50వ డివిజన్ కొండప్రాంతంలో పలుచోట్ల మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. వస్తున్న కాస్తా మంచినీరు రంగుమారి వాసన వస్తున్నాయని, దీంతో ప్రజలు ఆ నీరు తాగలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ నీరు తాగటం వలన వ్యాధులు వ్యాప్తి చెందుతాయోమోనని భయపడుతున్నారన్నారు. డివిజన్‌లో పలుచోట్ల వాటర్ పైపులైన్ పూర్తిగా పాడయ్యాయని వెంటనే మరమ్మతులు నిర్వహించాలన్నారు. పలువురు స్థానిక మహిళలు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గొట్టుముక్కల తదితరులు



చంద్రబాబు, పవన్, గద్దె రామ్మోహన్ చిత్రపటానికి ఇసుక, పూలు, పాలతో అభిషేకం చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

ఉచిత ఇసుక పాలసీ అభినందనీయం

టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు

పటమట, జూలై 9 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం అభినందనీయమని, భవన నిర్మాణ కార్మికులు గత ఐదేళ్లుగా పడుతున్న కష్టాలు తొలగిపోయినట్లేనని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు అన్నారు. బెంజిసర్కిల్ భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద మంగళవారం ఉచిత ఇసుక పాలసీ తీసుకువచ్చినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ చంద్రబాబు చిత్రపటానికి కార్మికులు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుడు ఎత్తుడు, దించుడు కూలీతో పాటు రవాణాకు మాత్రం రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉచిత ఇసుక విధానం వలన సామాన్యులకు భారీ ఊరట లభించిందన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెంటపల్లి శ్యామ్, ఆదిబాబు, సూర్యప్రకాష్, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

రాణిగారితోట: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుకను ఉచితంగా అందిస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తన హామీని నేరవేర్చి పేద, మధ్యతరగతి వారితో పాటు నిర్మాణరంగ కార్మికుల్లో ఆనందం నింపారని వడ్డెర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దుర్గారావు, కాశీలు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇసుకను ఉచితంగా అందిస్తున్న సందర్భంగా రాణిగారితోటలోని వడ్డెర సంఘం కార్యాలయం వద్ద మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చిత్రపటానికి ఇసుక, పూలు, పాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన 30రోజుల్లోనే ఇసుకను ఉచితంగా అందించారని అందుకు ప్రజలు ముఖ్యంగా కార్మికులు ఎంతో సంతోషం వ్యక్తం చేసున్నారని అన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీని కూడా నెరవేర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం నాయకులు గోపాల, కొమెర శ్రీను, గుంజ క్రాంతి, మాధవ, సాంబయ్య, శీను, రామచంద్రయ్య, వెంకన్న, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు చర్యలు తీసుకోండి

నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సత్యవతి



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి

భారతీనగర్, జూలై 9: కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) కేవీ సత్యవతి ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆమె మంగళవారం బెంజిసర్కిల్ నుంచి కొత్త గవర్నమెంట్ హాస్పిటల్ వరకు జరుగుతున్న గ్రీనరీ పనులకు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రీనరీలో మిగిలి ఉన్న ఫెన్సింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కాలుష్యాన్ని తగ్గించేలా గ్రీనరీ నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీనరీ నిర్వహణకు ఓఅండ్ ఎం సూపర్‌వైజర్ తగిన చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. ఇరువైపులా ఉన్న గ్రీనరీలో కలుపు మొక్కలు ఎప్పటికప్పుడు తొలగిస్తూ పచ్చదనాన్ని అందంగా పెంపొందించాలన్నారు. అనంతరం 3,4 డివిజన్లలో పలు సర్వీస్ డ్రైయినేజీలను పరిశీలించారు. సైడ్ కాల్వల్లో పేరుకుపోయిన పూడికను, వ్యర్థాలను తొలగించాలని డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు తెలియజేశారు. అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్, 3,4 శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌టెన్నిస్‌లో అనూషకు మూడు కాంస్యాలు



విజయవాడ స్పోర్ట్స్, జూలై 9: పోలెండ్‌లోని గ్రాడ్జిస్క్ మాజోవికీ నగరంలో ఈ నెల 2 నుంచి 8 వరకు జరిగిన 17వ పోలెండ్ కప్ అంతర్జాతీయ సాఫ్ట్ టెన్నిస్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి అనూష మూడు కాంస్యాలతో సత్తా చాటింది. వ్యక్తిగత, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో మూడు కాంస్యాలను సాధించిన అనూషను శాప్ వైస్‌చైర్మన్, వీసీ, ఎండీ పీఎస్. ప్రద్యుమ్న ఒక ప్రకటనలో అభినందించారు. ఇలాంటి మరెన్నో పతకాలను సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

దుర్గమ్మ సన్నిధిలో శ్రీశైల పీఠాధిపతి శివచార్య మహాస్వామిజీ



వన్‌టౌన్, జూలై 9: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో కనకదుర్గమ్మను మంగళవారం శ్రీశైల పీఠాధిపతి జగద్గురు డాక్టర్ చిన్న సిద్ధరామ పండితారాధ్య శివచార్య మహాస్వామిజీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ఈవో కేఎస్ రామారావు, అర్చకులు, అధికారులు స్వామిజీకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిజీ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. వేద పండితులు స్వామిజీకి వేద స్వస్తి పలికారు. ఈవో స్వామిజీకి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. స్వామిజీ అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం ఆయన మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామిజీకి ఈవో దుర్గగుడి విశేషాలను తెలియజేశారు.

ఒలింపిక్స్ ఫ్లాగ్ బేరర్‌గా పీవీ సింధు ఎంపికపై హర్షం

విజయవాడస్పోర్ట్స్, జూలై 9 : పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తరపున మహిళా షట్లర్ పీవీ.సింధు ఫ్లాగ్ బేరర్‌గా ఎంపిక కావడంపై బాయ్ జాయింట్ సెక్రటరీ, ఏపీబీఏ సెక్రటరీ డాక్టర్ పోలినేని అంకమ్మ చౌదరీ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రెండుసార్లు ఒలింపిక్స్ మెడల్స్ సాధించిన పీవీ సింధు ఈ సారి పతకం సాధిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. పీవీ సింధుతో పాటు హెచ్ఎస్.ప్రణయ్, లక్ష్యసేన్(సింగిల్స్), ఆర్.సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి(పురుషుల డబుల్స్), అశ్విని పొన్నప్ప, తానిషా(మహిళా డబుల్స్) బ్యాడ్మింటన్‌లో బరిలో దిగుతున్నారని అంకమ్మ చౌదరి తెలిపారు. పురుషుల డబుల్స్ ప్లేయర్స్ నెం 1 ర్యాంకర్స్ జోడి సాత్విక్ సాయిరాజ్ కూడా పతకం సాధిస్తాడన్న ఆశాభావం వ్యక్తం చేస్తూ షట్లర్లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏపీఈఏపీ సెట్ కౌన్సెలింగ్

భారతీనగర్, జూలై 9: జిల్లాలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మంగళవారం ఏపీఈఏపీ సెట్ -2024 కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్‌సీసీ కేటగిరిలో 203 మంది, క్రీడావిభాగంలో 86 మంది, క్యాప్ విభాగంలో 204 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారంతా సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకున్నట్లు పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్, ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

చిట్టినగర్, జూలై 9: నగరపాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్యసమావేశం బుధవారం ఉదయం జరగనుంది. ప్రధాన అజెండాలో 122 ప్రతిపాదిత అంశాలు చర్చకు రానున్నాయి. 34వ డివిజన్‌లో ఉన్న మ్యాంగో మార్కెట్ తరలింపు అంశం, సుమారు రూ. 4కోట్లతో తలపెట్టిన ట్రాఫిక్ సిగ్నల్ అంశాలపై విపక్షాల అభ్యంతరాలతో సమావేశం వాడీ వేడిగా సాగన్నుంది.

పేదల ఇళ్ల నిర్మాణాలకు సహకరించండి

హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే గద్దె

పటమట, జూలై 9: ఎన్టీఆర్ టీడీపీని స్థాపించినప్పుడే కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతో ముందుకు సాగారని, దానిలో ప్రధానమైనది పక్కా గృహాల కల్పన అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఉదయం రామ్మోహన్ హౌసింగ్ అధికారులతో సమావేశమై పలు అంశాలు వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం పేదలకు పక్కా గృహాలు కల్పించడం కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని అందులో భాగంగానే షేర్ వాల్ టెక్నాలజీతో టిడ్కో గృహాలను అత్యాధునికగా అన్ని సౌకర్యాలతో నిర్మాణం చేసిందన్నారు. తూర్పులో స్థలాలు పొంది ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి ఇబ్బంది పడుతున్న పేదలకు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేసుకునేలా అధికారులు వారికి సహకరించాలన్నారు. గత ప్రభుత్వం ఇసుక కృత్రిమ కొరత సృష్టించిందని, సీఎం చంద్రబాబు ఇసుక ఉచితం చేసి పేదల సొంతింటి కలకు చేయూతనిచ్చారని అన్నారు. సెంట్ స్థలాల్లో ఇల్లు కట్టుకునే వారికి సకాలంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు ఇవ్వలేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారని, అటువంటి ఇబ్బందులు ఈ ప్రభుత్వంలో లేకుండా చూడాలని అధికారులను కోరారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లల్లో 95 శాతం బేస్‌మట్టం స్థాయిలో ఉన్నాయని, లబ్ధిదారులతో అధికారులు మాట్లాడి వారికి అవసరమైన సదుపాయాలు కల్పించి గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. హౌసింగ్ డీఈఈ విజయ్‌బాబు, పీడీ రజనీ, ఏఈ కేవీఎస్, పలువురు హౌసింగ్ ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.



హౌసింగ్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా

- ఏసీపీ వంశీధర్ గౌడ్, ట్రాఫిక్ సీఐ మహేంద్ర



వన్‌టౌన్, జూలై 9: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు ఉంటాయని ఏసీపీ వంశీధర్ గౌడ్, ట్రాఫిక్ సీఐ మహేంద్రలు హెచ్చరించారు. మంగళవారం బందర్ రోడ్డులోని రాఘవయ్య పార్కు సెంటర్‌లో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోవడమో, అంగవికలురు కావడమో జరుగుతుందని దీని వలన వాహనదారులకే గాక వారి కుటుంబసభ్యులకు కూడా ఇబ్బందులు కలుగుతాయన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్, హెల్మెట్ ధారణ, వన్‌వే రైడ్‌లు, రాంగ్ క్రాసింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ తదితరాల గురించి వాహనదారులకు వివరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని లేకుంటే జరిమానాలు కట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి అని పేర్కొన్నారు.

12న జరిగే రథయాత్రకు రండి

- ఎంపీ కేశినేని శివనాథ్‌ను ఆహ్వానించిన ఇస్కాన్ ప్రతినిధులు



విద్యాధరపురం, జూలై 9: ఇస్కాన్ విజయవాడ ఆధ్వర్యంలో ఈ నెల 12న నగరంలో జరగనున్న శ్రీ జగన్నాథ రథయాత్రకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని ఇస్కాన్ విజయవాడ ప్రతినిధులు ఆహ్వానించారు. మంగళవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని చిన్నిని ఇస్కాన్ విజయవాడ వైస్ ప్రెసిడెంట్ వేణుధారి కృష్ణదాస్, పీఆర్‌వో శ్యామ్ సుందర్ అచ్యుత్ దాస్‌లు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రథయాత్ర విశేషాలను వారిని అడిగి తెలుసుకున్నారు. నగరంలో శ్రీశ్రీ జగన్నాథ రథయాత్ర ఈ నెల 12న ప్రారంభమై కొనసాగుతుందని వారు ఎంపీకి వివరించారు.

ఏడుగురు గంజాయి విక్రేతల అరెస్టు

- మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం

వన్‌టౌన్, జూలై 9: ఇతర ప్రాంతాల నుంచి దొంగచాటుగా గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఏడుగురు నిందితులను సూర్యారావుపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. స్టేషన్ పరిధిలోని పున్నమ్మతోట వద్ద నిందితులు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కృష్ణా జిల్లా యనమలకుదురు లాకుల వద్ద ఉంటున్న కూసం వెంకట దినేష్ కుమార్ అలియాస్ కేవీ (21), భూక్యా సామ్రాజ్ అలియాస్ మాణిక్యం అలియాస్ నాని(23), ధమ్ము కిరణ్ జోజి అలియాస్ గని(20), యనమలకుదురు భగత్‌సింగ్‌నగర్‌లో ఉంటున్న కొడాలి డోలాస్‌కుమార్ అలియాస్ డాడి (20), కొల్లి భానుప్రకాష్ అలియాస్ భాను (19), తిమ్మసర్తి కార్తీక్ అలియాస్ కార్తీక్ (23), మోస సేతు (19)లను కోర్టుకు హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించింది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భారతీనగర్, జూలై 9 : విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా రింగ్‌రోడ్డు సెక్షన్‌లో పరిధిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ, నోవాటెల్ హోటల్ వెనుక రోడ్డు, సర్వీస్ రోడ్డు, అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్, చందమామ హాస్పిటల్ ఏరియా తదితర పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అలరిస్తున్న సంగీత ఆరాధనోత్సవాలు



ద్రోనేంద్ర ఫణికుమార్ వేణుగానం

విజయవాడ కల్చరల్, జూలై 9: సద్గురు సంగీత ఆరాధన ఉత్సవాలు అలరిస్తున్నాయి. అభిమానమెన్నడు (బేగడ), కామాక్షి కామకోటిపీఠ (సింహేంద్ర మధ్యమం), తొలిసే జేసిన పూజా ఫలము (శుద్ధ బంగాళ), సరోజదళ నేత్రి (శంకరాభరణం) వంటి కీర్తనలతో ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. సత్యనారాయణపురం శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత సద్గురువర్యుల సంగీత ఆరాధన ఉత్సవాలలో భాగంగా శ్రీవారి శిష్య ప్రశిష్య బృందం ఆధ్వర్యంలో నాలుగో రోజు మంగళవారం ఐదు బృందాలు కచేరీలు చేశారు. ఆర్.అమూల్య, కల్పన, స్వరజ, బి.ఎ.దుర్గాభవానీ, శివలెంక విశ్వనాథ్‌లు మధురగానం చేయగా జి.ద్రోనేంద్ర ఫణికుమార్ తన వేణుగానంతో శ్రోతలను పరవశింప చేశారు. కార్యక్రమాన్ని మోదుమూడి సుధాకర్ పర్యవేక్షించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 10 జూలై 2024
cinema@andhrajyothy.com

సీనియర్లూ శభాష్




ఇప్పుడున్న పరిస్థితుల్లో హీరోయిన్లుగా పదేళ్ల పాటు కొనసాగటమే గొప్ప. 20 ఏళ్ల వయసులో కథానాయికలుగా వెండితెరపై మెరిసిన ముద్దుగుమ్మల్లో చాలామంది 40వ పడికి చేరువలో మాత్రం హీరో అక్క వదిన, తల్లి లాంటి సైడ్ క్యారెక్టర్లకు మారుతున్నారు. కానీ బాలీవుడ్‌లో కొందరు కథానాయికలు మాత్రం దీనికి వి ఎనహాయింపుగా నిలుస్తున్నారు. 20 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నా ఇంకా హీరోయిన్ల వేషాలతోనే అభిమానులను అలరిస్తున్నారు. హీరోలతో రొమాన్స్ చేసే చిలిపి పాత్రలు లాంటివి చేయకపోయినా కథను ముందుకు నడిపించే దమ్మున్న పాత్రలు చేస్తూ శభాష్ సీనియర్స్ అనిపించుకుంటున్నారు.

వెండితెరకు తరగని అందం

1997లో తమిళ సినిమా 'ఇరువర్' (ఇద్దరు)తో హీరోయిన్‌గా వెండితెర ఎంట్రీ ఇచ్చారు విశ్వసుందరి ఐశ్వర్యారాయ్. హీరోయిన్‌గా 25 ఏళ్ల ప్రస్థానాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. వివాహమైనా, ఓ పాపకు జన్మనిచ్చినా ఆమె క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. పెళ్లి తర్వాత ఆమె నటించిన కొన్ని సినిమాలు అపజయం పాలైనా తన అభిరుచికి అద్దం పట్టే సినిమాలు చేస్తూ వచ్చారు. గతేడాది మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'పొన్నియిన్ సెల్వన్' సిరీస్‌లో నందిని పాత్రలో తన అందం, అభినయంతో ప్రత్యేకాకర్షణగా నిలిచారు.

రూ. 150 కోట్ల చిత్రంతో...

2000 సంవత్సరంలో వచ్చిన 'రెఫ్యూజీ' చిత్రంతో కథానాయికగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు కరీనాకపూర్ ఖాన్. ఆ తర్వాత బాలీవుడ్ అగ్రహీరోలందరితోనూ నటించి లెక్కకు మిక్కిలి హిట్ చిత్రాలను తన ఖాతాలో వేసుకున్నారు. కథానాయికగా ఆమె వయసు 24 ఏళ్లు అయినా ఇప్పటికీ తన చిత్రాలతో బాక్సాఫీసు దగ్గర సందడి చేస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఆమె లీడ్‌రోల్ పోషించిన 'క్రూ' చిత్రం ఏకంగా రూ. 150 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఓ వైపు బాలీవుడ్ అగ్రహీరోల చిత్రాలు బాక్సాఫీసు దగ్గర బోల్తా పడుతుంటే ఈ లో బడ్జెట్ చిత్రం మాత్రం ఆశ్చర్యపరుస్తూ మంచి వసూళ్లను రాబట్టింది. ప్రస్తుతం ఆమె 'సింగం ఎగైన్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ సంచలన అత్యాచార కేసు ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రంలోనూ కరీనా లీడ్ రోల్‌లో కనిపించనున్నానే టాక్ వినిపిస్తోంది.

జోరు చూపుతున్న టబు

'క్రూ' చిత్రంలో కీలకపాత్ర పోషించిన మరో సీనియర్ హీరోయిన్ టబు సైతం తన జోరు చూపుతున్నారు. బాలనటిగా హిందీ చిత్రసీమలో అడుగుపెట్టిన ఆమె తెలుగు చిత్రం 'కూలీ నంబర్ 1' తో హీరోయిన్‌గా మారారు. ఈ చిత్రం విడుదలై దాదాపు 35 ఏళ్లు కావొస్తోంది. ఓ వైపు లీడ్‌రోల్స్ చేస్తూనే మధ్యమధ్యలో హీరోయిన్‌గానూ సత్తా చాటుతున్నారు. ప్రస్తుతం ఆమె అజయ్‌దేవ్‌గణ్ హీరోగా నటిస్తున్న 'ఆరోం మే కహాఁ దమ్ థా'చిత్రంలో ఆయనకు జోడీగా నటిస్తున్నారు. వారిద్దరి కలయికలో వస్తున్న పదో చిత్రం ఇది.

వెండితెర రాణి

కభీ ఖుషీ కభీ ఘమ్, ప్యార్ దీవానా హోతా హై లాంటి ఎన్నో సూపర్‌హిట్ చిత్రాలతో హీరోయిన్‌గా మెప్పించారు రాణీ ముఖర్జీ. 1996లోనే ఓ బెంగాలీ చిత్రంతో కథానాయికగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన రాణీ ముఖర్జీ ఇప్పటికీ హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాలతో సత్తా చాటుతున్నారు. 'మర్దానీ 2, బంటీ ఔర్ బబ్లీ 2, మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' లాంటి వరుస చిత్రాల్లో లీడ్‌రోల్స్ పోషించి మంచి విజయాలను అందుకున్నారు. తాజాగా ఆమె సోనాలీ బోస్ దర్శకత్వంలో మహిళా ప్రాధాన్య చిత్రం చేయబోతున్నారు.



మెరుపు కలల జోడీ మరోసారి

అరవింద్ స్వామి, ప్రభుదేవా హీరోలుగా వచ్చిన 'మెరుపు కలలు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు కాజోల్. 'బాజీఘర్, 'దిల్ వాలే దుల్హనియా లేజాయేంగే' చిత్రాలు బాలీవుడ్‌లోని ఆమె విజయ పరంపరలో కొన్ని. అజయ్ దేవ్‌గణ్‌తో పెళ్లయ్యాక కొన్నాళ్లు సినిమాలకు విరామం ఇచ్చారు. ప్రస్తుతం చరణ్‌తేజ్ ఉప్పలపాటి దర్శకత్వంలో ప్రభుదేవా, కాజోల్ జంటగా ఓ చిత్రం రాబోతోంది. 27 ఏళ్ల తర్వాత ఈ కాంబో సెట్టయింది. సంయుక్తా మీనన్ ఈ చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు.

తగ్గని హవా

హిందీ చిత్రసీమలో 90వ దశకంలో హీరోయిన్‌గా అరంగేట్రం చేసి అగ్ర కథానాయికగా ఎదిగారు మాధురీ దీక్షిత్. 'ఖల్నాయక్, హమ్ ఆప్కే హై కౌన్, బేటా, రాజా' తదితర చిత్రాల్లో ఆమె నటన ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసింది. మంచి డాన్సర్‌గానూ తనదైన ముద్ర వేశారు. పెళ్లయ్యాక సినిమాలు చేయడం తగ్గించారు మాధురీ. ప్రస్తుతం ఆమె 'ఢమాల్ 4లో' లీడ్‌రోల్‌లో నటించేందకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ టాక్. ఇంకా రవీనాటాండన్, జుహీచావ్లా, మనీషా కోయిరాలా, అమీషా పటేల్, విద్యాబాలన్ లాంటి సీనియర్ హీరోయిన్లు కథానాయిక ప్రాధాన్య చిత్రాలతో అభిమానులను ఎంటర్‌టైన్ చేస్తున్నారు.

వెబ్ సిరీస్‌లో త్రిష



హీరోయిన్ త్రిష తొలిసారిగా ఓ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారు. అనూహ్యమైన మలుపులతో, ఉత్కంఠభరితంగా సాగే ఆ సిరీస్ పేరు 'బృంద'. సోనీ లివ్‌లో ఆగస్టు 2న ఇది స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, మరాఠీ, బెంగాలీ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుండడం విశేషం. ఈ సిరసీ్ గురించి దర్శకుడు సూర్య మనోజ్ వంగాల మాట్లాడుతూ 'ఆద్యంతం సస్పెన్స్‌తో 'బృంద' సిరీస్ సాగుతుంది. శక్తిమంతమైన ఫిమేల్ లీడ్ నేరేటివ్ స్టోరీ ఇది. దీన్ని చూశాక ఇప్పటిదాకా నమ్ముతున్న నమ్మకాల మీద ఫోకస్ పెరుగుతుంది. ఈ జోనర్‌లో వచ్చే సినిమాలకు కొత్త నిర్వచనం చెప్పేలా ఉంటుంది' అన్నారు. సూర్య మనోజ్ వంగాల, పద్మావతి మల్లాది కలసి రూపొందించిన స్ర్కీన్‌ప్లే సిరీస్‌కు హైలైట్ అవుతుందని అంటున్నారు. డ్రామా, క్రైమ్, మిస్టరీ అంశాలతో రూపొందిన ఈ సిరీస్‌కు శక్తికాంత్ కార్తిక్ సంగీతం అందించారు. దినేష్ కె బాబు ఛాయాగ్రాహకుడు. ఇంద్రజిత్ సుకుమారన్, జయప్రకాశ్, ఆమని, రవీంద్ర విజయ్, ఆనంద్ సామి, రాకేందు మౌళి తదితరులు నటించారుజ


నాగులాపురం నాగమ్మ



మంచు లక్ష్మీ ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడికల్ డ్రామా 'ఆది పర్వం'. శివకంఠంనేని, ఆదిత్య ఓం, ఎస్తర్ నోరోనా, శ్రీజిత ఘోష్, సుహాసిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో ఎమ్.ఎస్.కె.రచన నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా సాంగ్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సంజీవ్ మేగోటి మాట్లాడుతూ "ఈ సినిమాలో మంచు లక్ష్మీ 'నాగులాపురం నాగమ్మ'గా నటిస్తున్నారు. ఆ పాత్రలో ఆమె నట విశ్వరూపం చూస్తారు. ఆమె చేసిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాకే హైలైట్" అని చెప్పారు. "ఆదిపర్వం' మీ అందరికీ నచ్చేలా ఉంటుంది" అని మంచు లక్ష్మీ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: పవన్ శేఖర్ పసుపులేటి, సినిమాటోగ్రఫీ: ఎస్.ఎన్.హరీశ్, సంగీతం: మాధవ్ సైబా, సంజీవ్ మేగోటి, బి.సుల్తాన్ వలి, ఓపెన్ బనానా, లుబెక్ లీ మార్విన్.

కేస్ నంబర్ 15 ఏమిటి?

అజయ్, రవిప్రకాశ్, హర్షిణి, మాండవియ సెజల్, చమ్మక్ చంద్ర, చిత్రం శ్రీను ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'కేస్ నం.15'. తడకల వంకర్‌రాజేశ్ స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'కేస్ నం.15' ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా తడకల వంకర్‌రాజేశ్ మాట్లాడుతూ "సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలోని సన్నివేశాలు



ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి. సినిమాను ఎక్కడా రాజీ పడకుండా తెరకెక్కించాం. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ మంచి పేరు వస్తుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఆర్.కె.స్వామి, సినిమాటోగ్రఫీ: అనమ్ వెంకట్, సంగీతం: జాన్.

భారతీయుడు-2 బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు




భారతీయుడు-2 సినిమా బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రజా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి మద్దతుగా నటుడు కమల్‌హాసన్‌తో పాటు చిత్ర బృందం శంకర్, సిద్ధార్థ, సముద్రఖని కలిసి డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా అవగాహన వీడియో రూపొందించడం హర్షించదగ్గ విషయమన్నారు. కాగా గత వారం కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు కొత్త వాహనాలు ప్రారంభించిన సమయంలో డ్రగ్స్ నిర్మూలనకు సినీ పరిశ్రమ తమ వంతు సహకారం అందించాలని సీఎం సూచించారు. ప్రతి సినిమా విడుదల సమయంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నటీనటులు కనీసం రెండు నిమిషాల నిడివితో వీడియో చిత్రీకరించి ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు సినీ ప్రముఖులు, క్రీడా కారులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్నారు.

నా మాటల్ని అపార్థం చేసుకున్నారు

'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తను మాట్లాడిన మాటల్ని అపార్థం చేసుకున్నారని సిద్ధార్థ్ చెప్పారు. డ్రగ్స్ కట్టడికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తాను. సీఎం సార్.. మేం ఎప్పుడూ మీతోనే" అంటూ ప్రత్యేకంగా విడుదల చేసిన వీడియోలో ఆయన పేర్కొన్నారు.



గుండెపోటుతో ఉషా ఉతప్ భర్త కన్నుమూత

ప్రముఖ గాయని ఉషా ఉతప్ ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆమె భర్త జానీ చాకో ఉతప్ సోమవారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయసు 78 ఏళ్లు. కోల్‌కతాలోని వారి ఇంట్లో టీవీ చూస్తున్న సమయంలో ఆయనకు గుండె పోటు రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆయన మరణించారని వైద్యులు తెలిపారు. ఈ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఈ గ్యాప్ నాకు చాలా నేర్పింది

'నన్ను దోచుకుందువటే' చిత్రంతో ఆరంగేట్రం చేసి.. వరుస సినిమాల్లో నటించారు నభా నటేశ్. కానీ 2021లో వచ్చిన 'మాస్ట్రో' సినిమా తర్వాత తెరపై కనిపించలేదు. ఈ విరామానికి కారణాన్ని ఆమె లేటెస్ట్‌గా నటించిన 'డార్లింగ్' సినిమా ట్రైలర్ లాంచ్‌లో తెలిపారు. "2022లో నాకు యాక్సిడెంట్ అయ్యింది. ఆ సమయంలో నా చేతిలో మూడు ప్రాజెక్ట్స్ ఉన్నందున.. వాటిని పూర్తి చేసేందుకు సర్జరీ చేసుకుని తగినంత విరామం లేకుండా సెట్స్‌లో అడుగుపెట్టాను.. దాంతో ఆ గాయం తిరగబెట్టింది. అందుకే ఇన్నేళ్లు సినిమాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇప్పటివరకూ నేను గ్లామరస్ పాత్రలే ఎక్కువ పోషించాను. ఈ గ్యాప్ నాకు చాలా నేర్పింది. ఇప్పటి నుంచి నటనా ప్రాధాన్యమున్న పాత్రల్లోనూ నటించాలనుకుంటున్నాను. అందుకే స్క్రిప్‌ల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాను" అని చెప్పారు. నభా నటించిన 'డార్లింగ్' చిత్రం ఈ నెల 19న విడుదల కానుండగా, ఆమె నటిస్తున్న 'స్వయంభు' చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

వినోదాత్మకంగా పేకమేడలు



'నా పేరు శివ', 'అంధగారం' 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న వినోద్‌కిషన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'పేకమేడలు'. అనూష కృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో 'ఎవరికీ చెప్పొద్దు' సినిమా ఫేమ్ రాకేశ్ వర్రే సినిమాను నిర్మిస్తున్నారు. టీజర్, పాటలు లాంచ్ చేసి.. ఇప్పటికే పలు రకాల విభిన్న ప్రమోషన్ కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకుంది చిత్రబృందం. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ "సామాన్యుల జీవితాల్లో జరిగే సంఘటనల ఆధారంగా ఈ సినిమా కథను రాసుకున్నాను. వినోదంతో పాటు భావోద్వేగాలను మిళితం చేసిన సినిమా ఇది" అని అన్నారు. చిత్ర నిర్మాత రాకేశ్ వర్రే మాట్లాడుతూ "ఇది కేవలం ఒక వినోదాత్మక చిత్రమే కాదు.. ఒక భార్య తన భర్తకు అన్ని వేళలా ఎంతగా సపోర్ట్ చేస్తుందో చూపించే చిత్రం" అని చెప్పారు. "ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను" అని హీరో వినోద్‌కిషన్ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: సృజన అడుసుమిల్లి, హంజా అలీ, డీఓపీ: హరిచరణ్.కె, సంగీతం: స్మరణ్‌సాయి.

దర్శకుడే హీరో!



కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఎక్కువగా లభిస్తున్న ప్రస్తుత తరుణంలో దర్శకనిర్మాతలు ఇప్పుడు విభిన్న కథాంశాలను ఎన్నుకుంటూ చిత్రాలు నిర్మిస్తున్నారు. ఆ కోవలో వస్తున్న మరో చిత్రం 'కళింగ'. ఇంతకుముందు 'కిరోసిన్' చిత్రంలో నటించిన ధ్రువ వాయు ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. దర్శకుడు కూడా ఆయనే. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సీనియర్ రైటర్ విజయేంద్రప్రసాద్ విడుదల చేశారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోస్టర్‌లో హీరో, అతని వెనుక ఉగ్ర రూపంలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి విగ్రహం, హీరో చేతిలో కాగడ... ఇవన్నీ సినిమా మీద ఆసక్తి పెంచుతున్నాయి. ప్రగ్యా నయన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో 'ఆడుకాలం' నరేన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మురళీధర్ గౌడ్, లక్ష్మణ్, తనికెళ్ల భరణి, సమ్మెట గాంధీ, బలగం సుధాకర్, సంజయ్‌కృష్ణ, హరిశ్చంద్ర తదితరులు ఇతర ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్.

స్పోర్ట్స్

విజయవాడ ● బుధవారం 10 జూలై 2024

సా. 4.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



శుభ్‌మన్ గిల్

ఆధిక్యం కోసం భారత్

ఓపెనర్‌గా జైస్వాల్!

నేడు జింబాబ్వేతో మూడో టీ20

హరారే: ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా భారత యువ జట్టు కీలక మ్యాచ్ ఆడనుంది. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమంగా ఉండగా, నేడు జింబాబ్వేతో జరిగే మూడో మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగబోతోంది. తద్వారా ఆధిక్యం సాధించి ఆతిథ్య జట్టును ఒత్తిడిలోకి నెట్టవచ్చు. అయితే టీ20 వరల్డ్‌కప్ అనంతరం యశస్వీ జైస్వాల్, సంజూ శాంసన్, శివమ్ దూబే జట్టులో చేరడంతో తుది కూర్పు ఆసక్తికరంగా మారింది. ఓపెనర్‌గా అభిషేక్, జైస్వాల్‌లలో ఎవరివైపు మొగ్గు చూపుతారనేది వేచి చూడాల్సిందే. ఆ స్థానంలో ఇప్పటికే అభిషేక్ శర్మ దుమ్మురేపే ఆటతీరుతో శతకం బాదేశాడు. అయితే ఆడిన 17 టీ20ల్లో 161కి పైగా స్ట్రయిక్ రేట్‌తో ఉన్న జైస్వాల్‌పైనే కెప్టెన్ గిల్ ఆసక్తి చూపవచ్చు. అప్పుడు అభిషేక్ వన్‌డౌన్‌లో ఆడాల్సి ఉంటుంది. అదే జరిగితే రుతురాజ్ నాలుగో స్థానంలో, ఇక కీపర్‌గా శాంసన్ ఆ తర్వాత బరిలోకి దిగుతారు. మిడిలార్డర్‌లో ఆల్‌రౌండర్ దూబే, పరాగ్ ఇన్నింగ్స్‌ను కదం తొక్కించగలరు. అలాగే సాయి సుదర్శన్, జురెల్, పరాగ్ తమ స్థానాలను కోల్పోవాల్సి ఉంటుంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించిన జింబాబ్వే ఆ తర్వాత అన్నింటా విఫలమై 100 పరుగుల తేడాతో చిత్తయింది. ముఖ్యంగా భారత స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఈ జట్టు బ్యాటర్లు పూర్తిగా తేలిపోతున్నారు. ఈ కీలక మ్యాచ్‌లోనైనా బ్యాటింగ్ విభాగం రాణిస్తే భారత్‌కు పోటీ ఇవ్వగలుగుతుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, అభిషేక్, రుతురాజ్, శాంసన్, దూబే, రింకూ, సుందర్, బిష్ణోయ్, అవేశ్, ముకేశ్.

జింబాబ్వే: మదెవెరె, ఇన్నోసెంట్, బెన్నెట్, సికందర్ రజా (కెప్టెన్), మైర్స్, క్యాంప్‌బెల్, మదండె, మసకద్జ, జోంగ్వే, ముజరబాని, చటారా.



ఇక గంభీర్ శకం

టీమిండియా కోచ్‌గా నియామకం

- ప్రకటించిన బీసీసీఐ
- శ్రీలంక టూర్‌తో ఇన్నింగ్స్ షురూ

న్యూఢిల్లీ: భారత జట్టు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ నియామకాన్ని భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం బోర్డు కార్యదర్శి జై షా ట్వీట్ చేశాడు. టీ20 వరల్డ్‌కప్‌తో ద్రవిడ్ కాంట్రాక్ట్ ముగిసింది. శ్రీలంకతో ఈ నెల 27నుంచి జరిగే సిరీస్ నుంచి కోచ్‌గా ప్రయాణం ఆరంభించనున్న గంభీర్ రెండేళ్లపాటు పదవిలో ఉంటాడు. ఈ సిరీస్‌లో భారత జట్టు మూడేసి వన్డేలు, టీ20లు ఆడనుంది. 42 ఏళ్ల గౌతీకి కోచ్‌గా పనిచేసిన అనుభవం లేకపోయినా పలు ఐపీఎల్ జట్లకు మెంటార్‌గా సేవలందించాడు. ఈ ఏడాది కోల్‌కతా నైట్‌రైడర్స్ టైటిల్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. 'భారత దేశమే నా గుర్తింపు. దేశానికి సేవ చేయడం ఈ జన్మకు దక్కిన గొప్ప గౌరవం. కొత్త పాత్రలో టీమిండియాతో మమేకవుతున్నా. కానీ, నా లక్ష్యం మాత్రం ఒక్కటే.. భారత్‌ను గర్వించేలా చేయడం. ప్రజల కలలను నెరవేర్చడానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తాన'ని గంభీర్ ఎక్స్‌లో పోస్టు చేశాడు. కాగా ద్రవిడ్ పదవీకాలం ఇటీవలి వరల్డ్‌కప్‌తోనే ముగిసిన విషయం తెలిసిందే. గంభీర్ ఎంపిక ఆలస్యమైనందున జింబాబ్వేలో పర్యటిస్తున్న భారత జట్టు తాత్కాలిక కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్‌ను నియమించారు. గంభీర్ తన కెరీర్‌లో 2007 టీ20 వరల్డ్‌కప్, తర్వాత 2011 వన్డే ప్రపంచకప్ గెల్చుకున్న భారత జట్టులో సభ్యుడు. ఇక ఐపీఎల్‌లో కెప్టెన్‌గా కోల్‌కతా జట్టును రెండుసార్లు (2012, 2014) విజేతగా నిలిపాడు. గంభీర్ వేతనం ఎంతనేది బోర్డు వెల్లడించనప్పటికీ ఏడాదికి సుమారు 10 నుంచి 12 కోట్లు ఉండవచ్చని భావిస్తున్నారు.

సవాళ్లపై సవారీ

టీమిండియా సంధి దశలో ఉన్న కీలక సమయంలో గంభీర్ జట్టు కోచింగ్ బాధ్యతలు అందుకొంటున్నాడు. రోహిత్, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా లాంటి స్టార్లు టీ20 ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పడంతో.. వారి లోటును భర్తీ చేయడం గంభీర్‌కు ఇప్పుడు పెనుసవాల్‌గా మారనుంది.

మా కోసం దిగి వచ్చావు!

ద్రవిడ్‌పై రోహిత్ భావోద్వేగ పోస్టు

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్ విన్నింగ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌ను ఉద్దేశించి రోహిత్ శర్మ నెట్‌లో భావోద్వేగ పోస్టు పెట్టాడు. మెగా ఈవెంట్‌తో రాహుల్ కాంట్రాక్ట్ ముగిసింది. అయితే, అతడితో తన ప్రయాణం ఎంతో అద్భుతమని రోహిత్ కొనియాడాడు. 'నా నమ్మకానివి, నా కోచ్‌వి, నా స్నేహితుడివి' అని రాశాడు. 'క్రికెట్‌లో నువ్వో దిగ్గజానివి. కానీ, మాకు కోచ్‌గా వచ్చేటప్పుడు గత కీర్తులను ద్వారం వద్దే విడిచావు. మా స్థాయికి దిగావు. నీతో ఏదైనా చెప్పగల సౌలభ్యాన్ని కల్పించావు. నీ నుంచి ఎంతో నేర్చుకొన్నా. నీతో నడచిన ప్రతీ జ్ఞాపకం ఎంతో ఆనందదాయకం' అని పేర్కొన్నాడు. తన అభిమాన ఆటగాడిని కోచ్‌గా పొందడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నాడు. 'నా భార్య నిన్ను 'వర్క్ వైఫ్' అని అంటుంది. నేను కూడా అలా పిలవడాన్ని అదృష్టంగా భావిస్తాన'ని రోహిత్ చెప్పాడు.





మెద్వెదెవ్

సిన్నర్

సిన్నర్‌కు షాక్

- సెమీస్‌లో అల్కారజ్, మెద్వెదెవ్
- పొలిని, వికిక్ కూడా ● వింబుల్డన్

లండన్: వింబుల్డన్‌లో వరల్డ్ నెం:1 జానిక్ సిన్నర్‌కు షాక్ తగలగా.. స్పెయిన్ ఆటగాడు కార్లోస్ అల్కారజ్, డానిల్ మెద్వెదెవ్, ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్ట్ జాస్మిన్ పొలిని, అన్‌సీడెడ్ డోన్నా వికిక్ సెమీస్‌కు దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన థ్రిల్లింగ్ క్వార్టర్స్ మ్యాచ్‌లో టాప్ సీడ్ సిన్నర్ (ఇటలీ) 7-6(7), 4-6, 6-7(4), 6-2, 3-6తో మెద్వెదెవ్ (రష్యా) చేతిలో పరాజయం పాలయ్యాడు. ఐదు సెట్లపాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో మూడో సెట్‌లో సిన్నర్ చికిత్స తీసుకోవడానికి లాకర్ రూమ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చిన అనంతరం దీటుగానే పోరాడుతూ నాలుగో సెట్ నెగ్గినా.. ఆఖరి సెట్‌లో మాత్రం చేతులెత్తేశాడు. మరో మ్యాచ్‌లో మూడో సీడ్ అల్కారజ్ 5-7, 6-4, 6-2, 6-2తో టామీ పాల్ (అమెరికా)పై విజయం సాధించాడు.

డోన్నా తొలిసారి..: అన్‌సీడెడ్ ప్లేయర్ డోన్నా వికిక్ కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌లోకి అడుగుపెట్టింది. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో వికిక్ (క్రొయేషియా) 5-7, 6-4, 6-1తో లులు సున్ (న్యూజిలాండ్)పై పోరాడి నెగ్గింది. 7వ సీడ్ పొలిని (ఇటలీ) 6-2, 6-1తో నవారో (అమెరికా)ను చిత్తు చేసి ఫైనల్-4కు చేరుకొంది.

జొకోకు కోపమొచ్చింది: నొవాక్ జొకోవిచ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. రౌండ్-16లో జొకోవిచ్ 6-3, 6-4, 6-2తో హోల్గర్ (నార్వే)పై నెగ్గాడు. అయితే, మ్యాచ్ ముగిసిన తర్వాత తనను గేలిచేసే ప్రయత్నం చేసిన ఫ్యాన్స్‌కు స్ట్రాంగ్‌గా కౌంటర్ ఇచ్చాడు. అలాంటి వారికి 'గూ...డ్ నైట్.. వెరీ గూ....డ్ నైట్' అంటూ అసహనం వ్యక్తం చేశాడు.



లెక్క సరిచేశారు..

- చెలరేగిన భారత్
- సిరీస్ 1-1తో సమం
- దక్షిణాఫ్రికా చిత్తు

చెన్నై: సిరీస్ నిర్ణాయక మ్యాచ్‌లో భారత మహిళల జట్టు అటు బంతితో.. ఇటు బ్యాటుతో కదం తొక్కింది. తద్వారా ఇప్పటికే వన్డే, టెస్టు సిరీస్‌లను దక్కించుకున్న హర్మన్ సేన మూడు టీ20ల సిరీస్‌ను సైతం 1-1తో సమం చేయగలిగింది. బలహీనంగా కనిపించిన బౌలింగ్ దళం మూడో టీ20లో జూలు విదిల్చింది. పేసర్ పూజా వస్త్రాకర్ (4/13) తన అద్భుత ఫామ్‌ను కొనసాగించగా.. స్పిన్నర్ రాధా యాదవ్ (3-1-6-3) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో వణికించింది. దీంతో సఫారీలు కనీసం వంద పరుగులు కూడా చేయలేక చతికిలపడ్డారు. అటు స్వల్ప ఛేదనలో భారత్ పది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. రెండో మ్యాచ్ వర్షంతో రద్దయిన విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 17.1 ఓవర్లలో 84 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ బ్రిట్స్ (20), బోష్ (17) మాత్రమే ఆకట్టుకున్నారు. పూజా, రాధా మిడిలార్డర్, టెయిలెండర్ల పనిబట్టడంతో 23 పరుగుల వ్యవధిలోనే ప్రత్యర్థి చివరి ఏడు వికెట్లు నేలకూలడం గమనార్హం.

ఓపెనర్లే..: స్వల్ప ఛేదనను భారత్ కేవలం 10.5 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 88 పరుగులతో ముగించింది. ఓపెనర్లు మంధాన (54 నాటౌట్), షఫాలీ (27 నాటౌట్) స్వేచ్ఛగా బ్యాట్లు ఝుళిపించారు. మంధాన ఈ మ్యాచ్‌లో అంతర్జాతీయ క్రికెట్ (అన్ని ఫార్మాట్లు)లో 7500 పరుగులు పూర్తిచేసింది. ఇక ఈ గెలుపుతో భారత జట్టు టీ20ల్లో 100 విజయాలను నమోదు చేసుకుంది. టీమిండియా మొత్తం 187 మ్యాచ్‌లాడింది.

దక్షిణాఫ్రికా: 17.1 ఓవర్లలో 84 ఆలౌట్. (బ్రిట్స్ 20, బోష్ 17; రాధా యాదవ్ 3/6, వస్త్రాకర్ 4/13)
భారత్: 10.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 88 (మంధాన 54 నాటౌట్, షఫాలీ 27 నాటౌట్)

నెదర్లాండ్స్ X ఇంగ్లండ్

నేడు 'యూరో' రెండో సెమీస్
రాత్రి 12.30 నుంచి సోనీలో..

డార్ట్‌మండ్ (జర్మనీ): యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మరో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. వరుసగా రెండోసారి ఫైనల్ చేరాలన్న పట్టుదలతో ఉన్న ఇంగ్లండ్.. బుధవారం అర్ధరాత్రి జరిగే రెండో సెమీస్‌లో పటిష్ట నెదర్లాండ్స్‌తో తలపడనుంది. కెప్టెన్ హ్యారీ కేన్ ఫిట్‌నెస్ అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఫేవరెట్‌గా కనిపిస్తున్నా.. ఏ సమయంలోనైనా మ్యాచ్‌ను మలుపు తిప్పగల సత్తా ఉన్న ప్లేయర్లు నెదర్లాండ్స్ జట్టులో ఉన్నారు.

కోహ్లీ పబ్‌పై కేసు!

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీకి చెందిన వన్ 8 కమ్యూన్ పబ్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. ఇక్కడి చిన్నస్వామి స్టేడియం సమీపంలో ఉండే ఈ పబ్‌ను అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా పెద్దపెద్ద సౌండ్లు పెడుతూ నిర్వహిస్తున్నారని స్థానికుల నుంచి, పోలీసుల నుంచి ఫిర్యాదులు రావడంతో పబ్ మేనేజర్‌పై కేసు నమోదైనట్టు బెంగళూరు సెంట్రల్ డీసీపీ శేఖర్ హెచ్‌టీ తెలిపారు.

ఫేవరెట్ అర్జెంటీనా

కెనడాతో 'కోపా' సెమీస్ నేడు
ఉదయం 5.30 నుంచి

న్యూయార్క్: డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా మరోసారి కోపా అమెరికా కప్ ఫైనల్‌పై గురిపెట్టింది. కెనడాతో జరిగే తొలి సెమీస్‌లో మెస్సీ సేన ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. గాయంతో బాధపడుతున్న మెస్సీ ఈ మ్యాచ్‌లో ఆడతాడని కోచ్ ప్రకటించడం అభిమానులకు ఊరటనిచ్చేదే. మరోవైపు కెనడా తొలిసారి సెమీస్‌లోకి అడుగుపెట్టింది. లీగ్ దశలో అర్జెంటీనా చేతిలో చిత్తయిన కెనడా.. ఈసారి గట్టిపోటీ ఇవ్వాలనే పట్టుదలతో ఉంది.

బిజినెస్

సూక్ష్మ రుణాలు రూ.2 లక్షలు మించొద్దు

కోల్‌కతా: సూక్ష్మ రుణ (మైక్రో ఫైనాన్స్) సంస్థలు మంజూరు చేసే రుణాలకూ పరిమితులు ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సంస్థల నుంచి ఒక్కో రుణ గ్రహీతకు ఇచ్చే రుణాలను రూ.2 లక్షలకు పరిమితం చేయాలని ఈ సంస్థలకు ప్రాతినిధ్యం వహించే మైక్రో ఫైనాన్స్ ఇండస్ట్రీ నెట్‌వర్క్ (ఎంఎఫ్ఐఎన్) కోరింది. అలాగే వీరికి రుణాలు ఇచ్చే సూక్ష్మ రుణ సంస్థలనూ నాలుగుకు పరిమితం చేయాలని సూచించింది. కుటుంబ ఆదాయం, తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించే స్థోమత ఆధారంగానే వీరికి రుణాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. సూక్ష్మ రుణ సంస్థల నుంచి ఎడాపెడా అప్పులు తీసుకుని.. తిరిగి చెల్లించేటప్పుడు అనేక మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎంఎఫ్ఐఎన్ ఈ సూచనలు చేయడం విశేషం.

విజయ డయాగ్నోస్టిక్‌లో ఏఐ మెహ్వార్ వాటా విక్రయం

ముంబై: విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఏఐ మెహ్వార్ కమర్షియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎల్ఎల్‌సీ 2.2 శాతం వాటాలను రూ.176.17 కోట్లకు విక్రయించింది. మంగళవారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ వాటాను విక్రయించినట్లు ఎన్ఎస్ఈ బల్క్ డేటా గణాంకాలు వెల్లడించాయి. 2.2 శాతం వాటాలకు సమానమైన 22.50 లక్షల షేర్లను ఏఐ మెహ్వార్ విక్రయించింది. సగటున ఒక్కో షేరును రూ.738 ధరకు విక్రయించింది. విజయ డయాగ్నోస్టిక్‌లో ఏఐ మెహ్వార్‌కు 2.99 శాతం వాటా ఉంది. కాగా విజయ డయాగ్నోస్టిక్‌లో 18 లక్షల షేర్లను కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్ కొనుగోలు చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,200 ▼	67,100 ▼	99,000 ▼
ముంబై	72,346 ▼	66,269 ▼	91,847 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ

హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	113
కరీంనగర్	105	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	129
కర్నూలు	105	నెల్లూరు	129
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	113		

ఈక్విటీ మదుపరుల సంపద

రూ.451 లక్షల కోట్లు

● సరికొత్త రికార్డు గరిష్ఠాలకు సూచీలు ● మరో 391 పాయింట్ల లాభంతో 80,351 వద్ద ముగిసిన సెన్సెక్స్

24,400 ఎగువ స్థాయికి చేరిన నిఫ్టీ

వాహన, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు జిగేల్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ ఒక దశలో 436.79 పాయింట్ల వృద్ధితో 80,397.17 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును తాకి.. చివరికి 391.26 పాయింట్ల లాభంతో 80,351.64 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. నిఫ్టీ సైతం ఒక దశలో 123.05 పాయింట్లు ఎగబాకి 24,443.60 వద్ద ఇంట్రాడే రికార్డును, చివరికి 112.65 పాయింట్ల లాభంతో 24,433.20 వద్ద కొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

దీంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.1.56 లక్షల కోట్లు పెరిగి రూ.451.27 లక్షల కోట్లకు (5.41 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. దేశీయ, అంతర్జాతీయ సానుకూలతల నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు వాహన, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరపడం ఇందుకు తోడ్పడింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత పెంచాయి.

- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 21 లాభపడ్డాయి. మారుతి సుజుకీ షేరు 6.60 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎం అండ్ ఎం 2.68 శాతం, టాటా మోటార్స్ 1.24 శాతం పెరిగాయి. పర్యావరణహిత వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు హైబ్రిడ్ కార్లపై రిజిస్ట్రేషన్ పన్నును మాఫీ చేస్తున్నట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించడంతో వాహన షేర్లకు డిమాండ్ పెరిగింది.
- బ్లూచి‌ప్‌లతో పాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలోనూ కొనుగోళ్లు జరగడంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.36 శాతం, స్మాల్‌క్యాప్ 0.22 శాతం పెరిగాయి.
- రంగాలవారీ సూచీల్లో ఆటో అత్యధికంగా 2.17 శాతం పుంజుకుంది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ సైతం 2 శాతం రాణించింది. రియల్టీ, కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ, హెల్త్‌కేర్ సూచీలు ఒక శాతానికి పైగా పెరిగాయి.



పేటీఎంకు కీలక అనుమతి!

కష్టాల్లో ఉన్న డిజిటల్ చెల్లింపుల కంపెనీ పేటీఎంకు కొంత ఊరట లభించినట్లు తెలిసింది.. తన కీలక అనుబంధ విభాగమైన పేటీఎం పేమెంట్ సర్వీసెస్ వ్యాపారంలో రూ.50 కోట్లు ఇన్వెస్ట్‌మెంట్‌కు చైనా పెట్టుబడులను పర్యవేక్షించే ప్రభుత్వ కమిటీ అనుమతి తెలిపినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ పెట్టుబడులకు ఆర్థిక శాఖ కూడా అనుమతివ్వాల్సి ఉన్నప్పటికీ, కమిటీ నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించడంతో కంపెనీకి ప్రధాన అవరోధం తొలిగినట్లయింది. ఈ క్లియరెన్స్ కోసం పేటీఎం రెండేళ్లుగా వేచిచూస్తోంది. మరికొంత కాలంపాటు అనుమతి లభించకపోయి ఉంటే, పేటీఎం తన పేమెంట్స్ సేవల వ్యాపారాన్ని మూసివేయాల్సిన పరిస్థితి. చైనాకు చెందిన యాంట్ గ్రూప్ పేటీఎంలో పది శాతం వరకు వాటా కలిగి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ కమిటీ గతంలో ఈ పెట్టుబడి ప్రతిపాదనను పక్కన పెట్టింది.

ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి రికార్డు నిధులు

గత నెలలో రూ.40,608 కోట్లు రాక

అందులో రూ.21,000 కోట్లు సిప్

ఈ ఏడాది జూన్‌లో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)లో ఇన్వెస్టర్లు రికార్డు స్థాయిలో రూ.40,608 కోట్ల పెట్టుబడులు పెట్టారు. మే నెలలో వచ్చిన పెట్టుబడుల కంటే ఇది 17 శాతం అధికమని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) తెలిపింది. కాగా, గత నెల క్రమానుగత పెట్టుబడి పథకాల్లోకి (సిప్) సైతం రికార్డు స్థాయిలో రూ.21,262 కోట్ల పెట్టుబడులు వచ్చాయని యాంఫీ వెల్లడించింది. మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నిర్వహణలో ఉన్న నికర ఆస్తుల (ఏయూఎం) విలువ రూ.27.62 లక్షల కోట్లకు చేరుకుందని, అందులో సిప్‌ల ఏయూఎం రూ.12.43 లక్షల కోట్లుగా ఉందని అసోసియేషన్ పేర్కొంది. గత నెలలో 55 లక్షల కొత్త సిప్‌లు రిజిస్టర్ అయ్యాయని, దాంతో మొత్తం సిప్‌ల సంఖ్య 8.98 కోట్లకు చేరుకుందని యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని తెలిపారు.

కిమ్స్ చేతికి విశాఖ క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్

డీల్ విలువ రూ.75 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్ (కిమ్స్ హాస్పిటల్స్).. ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నంలోని క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్ (క్యూఎన్ఆర్ఐ)ను కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. క్యూఎన్ఆర్ఐ హాస్పిటల్ యజమానులైన చలసాని హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వంద శాతం వాటాలను కొనుగోలు చేయటం ద్వారా దీన్ని చేజిక్కించుకున్నట్లు వెల్లడించింది. ఈ కొనుగోలు కోసం రూ.75 కోట్ల వరకు వెచ్చించనున్నట్లు పేర్కొంది. నెల రోజుల్లో డీల్ పూర్తవుతుందని భావిస్తున్నట్లు తెలిపింది. 1995లో విశాఖలోని కీలకమైన రెసిడెన్షియల్ ప్రాంతంలో కార్యకలాపాలు ప్రారంభించిన క్వీన్స్ ఎన్ఆర్ఐ 200 పడకల సామర్థ్యంతో హాస్పిటల్‌ను నిర్వహిస్తోంది. విశాఖపట్నం లో కార్డియాలజీ, అంకాలజీ విభాగాల్లో సేవలందిస్తున్న హాస్పిటల్స్‌లో క్యూఎన్ఆర్ఐ కీలకంగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో క్యూఎన్ఆర్ఐ టర్నోవర్ రూ.62.60 కోట్లుగా ఉంది.

విశాఖలో రెండో హాస్పిటల్

కాగా కిమ్స్ హాస్పిటల్స్ ఇప్పటికే విశాఖలో మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్, గ్యాస్ట్రో యూనిట్‌ను నిర్వహిస్తోంది. విశాఖలో తమకు ఇది రెండో హాస్పిటల్ అని, ఈ ప్రాంతంలో శరవేగంగా వృద్ధి చెందేందుకు ఈ కొనుగోలు ఎంతగానో దోహదపడుతుందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బీ భాస్కర్ రావు తెలిపారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లో తమ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు అవసరమైన అన్ని అవకాశాలను పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు. క్యూఎన్ఆర్ఐ కొనుగోలుతో విశాఖలో కిమ్స్ హస్పిటల్స్ మొత్తం పడకల సంఖ్య 630కి చేరిందని భాస్కర్ రావు వెల్లడించారు. 2018లో ఐకాన్ హాస్పిటల్స్‌ను కొనుగోలు చేయటం ద్వారా కిమ్స్ హాస్పిటల్స్ విశాఖపట్నంలోకి అడుగుపెట్టింది.

ఓఎన్‌జీసీ రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా 2038 నాటికి తన చమురు, గ్యాస్ ఉత్పత్తి యూనిట్లలో కర్బన ఉద్గారాల విడుదలను జీరోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం దాదాపు రూ.2 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్యాస్‌ను వృథాగా మండించడానికి పూర్తిగా ఫుల్‌స్టాప్ పెట్టాలని భావిస్తోంది. దీనికి తోడు 2030 నాటికి రూ.97,000 కోట్ల పెట్టుబడితో 5,000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు ఏర్పాటుచేయనుంది. 2035 నాటికి హరిత హైడ్రోజన్ లేదా అమ్మోనియా ప్లాంట్ల ఏర్పాటు కోసం మరో రూ.65,000 కోట్లు ఖర్చు చేయనుంది. మిగతా రూ.38,000 కోట్లు 2038 నాటికి 1,000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉండే తీర ప్రాంత పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటు కోసం వినియోగించబోతున్నట్టు ఓఎన్‌జీసీ తెలిపింది.

మార్చి నాటికి 3,000 మంది క్లయింట్ల లక్ష్యం
టాక్ ఇన్ఫోసెక్

ముంబై: సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ సంస్థ టాక్ (టీఏసీ) ఇన్ఫోసెక్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 3,000 మంది కస్టమర్లను చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి 500 మంది కొత్త క్లయింట్స్‌ను చేర్చుకున్నట్లు కంపెనీ తెలిపింది. కొత్త క్లయింట్లలో అమెరికా,జపాన్ సహా పలు దేశాలకు చెందిన కంపెనీలున్నాయని పేర్కొంది. భారత్‌లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ, రిలయన్స్ గ్రూప్, డీబీఎస్ బ్యాంక్ సహా మరికొన్ని కంపెనీలు.. సంస్థ ఖాతాదారులుగా ఉన్నాయి.

2023-24లో 4.7 కోట్ల ఉద్యోగాల కల్పన: ఆర్‌బీఐ

ముంబై: దేశంలోని 27 ప్రధాన రంగాల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4.7 కోట్ల మందికి కొత్తగా ఉద్యోగాలు వచ్చాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజా నివేదికలో తెలిపింది. 2023 మార్చినాటికి దేశంలో ఉద్యోగాల్లో ఉన్న వారి సంఖ్య 59.67 కోట్లు కాగా 2024 మార్చి చివరి నాటికి వారి సంఖ్య 64.33 కోట్లకు చేరినట్టు పేర్కొంది. టార్న్‌క్విస్ట్ అగ్రిగేషన్ ఫార్ములా ప్రకారం ముందు ఏడాదితో పోల్చితే 2023-24లో ఉపాధి వృద్ధి రేటు 3.2 శాతం నుంచి 6 శాతానికి పెరిగినట్టు ఆర్‌బీఐ పేర్కొంది. పారిశ్రామిక సంస్థల స్థాయిలో ఉత్పాదకతను మదింపు చేసేందుకు ఉపయోగించే ఇండియా క్లెమ్స్ అంటే మూలధనం (కె), కార్మిక శక్తి (ఎల్), ఇంధనం (ఇ), మెటీరియల్ (ఎం), సేవల (ఎస్) డేటాబేస్ ఆధారంగా ఆర్‌బీఐ ఈ నివేదిక విడుదల చేసింది. వ్యవసాయం, వేట, అడవులు, మత్స్య రంగాలు 25.3 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నట్టు తెలిపింది. అలాగే అధిక సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్న వాటిలో అగ్రస్థానంలో నిలిచిన రంగాల్లో నిర్మాణ, వాణిజ్య, రవాణా, స్టోరేజ్ రంగాలున్నట్టు పేర్కొంది.

నియామకాల జోరు

హైదరాబాద్, విశాఖల్లో పెరగనున్న హైరింగ్

టీమ్‌లీజ్ నివేదిక వెల్లడి

ముంబై: కొలువుల మార్కెట్ కోలుకుంటోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోలిస్తే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలల్లో నియామకాలు ఆరు శాతానికిపైగా పెరగనున్నాయి. మంగళవారం విడుదలైన 'టీమ్‌లీజ్ ఎంప్లాయ్‌మెంట్ ఔట్‌లుక్ రిపోర్ట్' ఈ విషయం తెలిపింది. హైదరాబాద్‌తో సహా దేశంలోని 20 ప్రధాన నగరాల్లో 23 పరిశ్రమలకు చెందిన 1,417 కంపెనీల ప్రధాన అధికారులను ఇంటర్వ్యూ చేసి టీమ్‌లీజ్ ఈ నివేదిక రూపొందించింది. ఇంటర్వ్యూలో పాల్గొన్న కంపెనీల ప్రధాన అధికారుల్లో 56 శాతం మంది వచ్చే కొద్ది నెలల్లో మరిన్ని నియామకాలు చేపట్టబోతున్నట్టు చెప్పారు. 23 శాతం మంది ఎలాంటి నియామకాలు ఉండవని చెబితే, 21 శాతం మంది మాత్రమే ఉన్న ఉద్యోగాల్లో కోతపెట్టబోతున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లో ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో నియామకాలు, గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 47.57 శాతం పెరుగుతాయని టీమ్‌లీజ్ అంచనా. ఇదే సమయంలో ఢిల్లీలో 53.21 శాతం, బెంగళూరులో 50.46 శాతం పెరగనున్నాయి. విశాఖలోనూ ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో నియామకాలు 15.88 శాతం పెరుగుతాయని టీమ్‌లీజ్ అంచనా. స్టార్టప్‌లు, చిన్న, మధ్య తరహా కంపెనీల్లో నియామకాలు జోరుగా పెరుగుతున్నట్టు నివేదిక తెలిపింది.

కలలన్నీ.. కల్లలయ్యాయి..!

» అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మృతి

» జలపాతంలో జారిపడిన తూర్పుగోదావరి జిల్లా వాసి



గోపాలపురం, జూలై 9: కొడుకుని ఉన్నతంగా చూడాలనుకొన్న ఆ కన్నవారి కలలన్నీ కల్లలయ్యాయి. ఉన్నత చదువులు చదివి తమకు అండగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కొడుకు అమెరికాలో ప్రమాదవశాత్తు మరణించడంతో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన గద్దె సాయిసూర్య అవినాశ్ (24) అక్కడ ప్రమాదవశాత్తు జలపాతంలో జారిపడి ప్రాణాలు కోల్పోయాడు. చిట్యాల గ్రామానికి చెందిన గద్దె శ్రీనివాసరావు, శిరీష దంపతులకు ఇద్దరు సంతానం. కుమార్తె వాసవ్యకు వివాహమైంది. కుమారుడు అవినాశ్ తాడేపల్లిగూడెంలో బీటెక్ పూర్తిచేసి.. గతేడాది జనవరిలో అమెరికాకు వెళ్లి అక్కడి ట్రైన్ యూనివర్సిటీలో ఎంఎస్ చేస్తున్నాడు. స్నేహితులతో కలిసి ఈ నెల 7న న్యూయార్క్‌లోని అల్బానీలో ఉన్న బార్బర్‌విల్లే జలపాతానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారడంతో అవినాశ్ జలపాతంలో పడిపోయి మృతి చెందాడని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ వెల్లడించింది. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపింది. ఈ వార్త తల్లిదండ్రులకు సోమవారం తెలియడంతో వారు హతాశులైపోయారన్నారు. చిట్యాలలో విషాదఛాయలు అలముకున్నాయి.

నకిలీ కంపెనీలు.. బలవంతపు చాకిరీ!

» అమెరికాలో నలుగురు తెలుగువారు అరెస్టు

హ్యూస్టన్, జూలై 9: నకిలీ కంపెనీలు సృష్టించి, ఉద్యోగులతో బలవంతంగా పనిచేయిస్తున్నారనే ఆరోపణలపై ఓ మహిళ సహా నలుగురు తెలుగు వారిని అమెరికాలో పోలీసులు అరెస్టు చేశారు. టెక్సాస్‌లో వేర్వేరు చోట్ల దాదాపు వంద మందికిపైగా యువతీ యువకులను నియమించినట్లు గుర్తించారు. ప్రిన్స్‌టన్‌లోని కొలీన్ కౌంటీ ప్రాంతం గిన్స్‌బర్గ్ లేన్‌లోని ఓ ఇంట్లో పెద్దసంఖ్యలో యువతులు నివసిస్తున్నారని, అక్కడేవో అనుమానాస్పద కార్యకలాపాలు సాగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో సంతోష్ కట్కూరి(31)కి చెందిన ఆ ఇంటిని గత మార్చి 13న పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు చెందిన పలు ప్రోగ్రావింగ్ షెల్ కంపెనీల్లో 15మంది యువతులతో సంతోష్ భార్య ద్వారకా గుండా(31) పనిచేయిస్తున్నట్లు గుర్తించారు. మానవ అక్రమ రవాణాకు కేంద్రంగా భావిస్తున్న ఆ ఇంట్లో ఎలాంటి సామగ్రి లేదని, కేవలం కంప్యూటర్లు, దుప్పట్లు మాత్రమే ఉన్నాయని, యువతులంతా అక్కడి గదుల్లో నేలపైనే నిద్రిస్తున్నారని అధికారులు వెల్లడించారు. విచారణలో ప్రిన్స్‌టన్, మెలిస్సా, మెక్ కిన్నే ప్రాంతాల్లోనూ షెల్ కంపెనీలు నెలకొల్పి 100 మందికిపైగా ఉద్యోగులతో ఇదేవిధంగా చాకిరీ చేయిస్తున్నట్లు నిర్ధారించారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడ్డారన్న నేరారోపణలపై సంతోష్, ద్వారకతో పాటు వారికి సహకరించిన చందన్ దేశిరెడ్డి(24), అనిల్ మాలె (37)ను పోలీసులు అరెస్టు చేశారు.

గ్యాస్, ఆధార్ లింక్‌కు గడువేమీ లేదు

» పెట్రోలియం మంత్రి హర్దీప్‌సింగ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 9: వంట గ్యాస్ కనెక్షన్ నెంబరుతో ఆధార్ అనుసంధానానికి తుది గడువు అంటూ ఏమీ లేదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ మంగళవారం స్పష్టం చేశారు. వినియోగదారులు తమకు అనుకూలమైన సమయాల్లో ఈ ప్రక్రియను చేసుకోవచ్చని తెలిపారు. బోగస్ కనెక్షన్ల ఏరివేతకు, రాయితీలు దుర్వినియోగం కాకుండా చూసేందుకు వినియోగదారులంతా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని చెప్పారు. గత ఎనిమిది నెలలుగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఉద్దేశం మంచిదే అయినప్పటికీ ఇందుకోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ కేరళ ప్రతిపక్ష నేత వి.డి.సతీశన్ ఆయనకు లేఖ రాశారు. దీనికి మంత్రి ఎక్స్ ద్వారా బదులిచ్చారు.

తొలిసారిగా భారత్ స్నైపర్ రైఫిల్స్ ఎగుమతి

న్యూఢిల్లీ, జూలై 9: బెంగళూరుకు చెందిన చిన్న ఆయుధాల తయారీ సంస్థ ఎస్ఎస్ఎస్ డిఫెన్స్ శక్తిమంతమైన '.338 లాపువా మాగ్నమ్ క్యాలిబర్ స్నైపర్ రైఫిల్స్' ఎగుమతి కోసం ఓ మిత్ర దేశం నుంచి మెగా కాంట్రాక్టును దక్కించుకుంది. భారత్... స్నైపర్ రైఫిళ్లను విదేశాలకు ఎగుమతి చేయడం ఇదే తొలిసారని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ స్నైపర్ రైఫిళ్లను బ్యారెల్‌తో సహా పూర్తిగా భారత్‌లోనే తయారు చేశారు. ఈ రైఫిళ్లతోపాటు పలు మిత్రదేశాల నుంచి దాదాపు రూ.418 కోట్ల విలువైన రక్షణ సామగ్రిని సరఫరా చేసే కాంట్రాక్టును కూడా 'ఎస్ఎస్ఎస్ డిఫెన్స్' దక్కించుకుంది. ఎస్ఎస్ఎస్ డిఫెన్స్ సంస్థ ఇప్పటికే 1,500 మీటర్లు, అంతకంటే ఎక్కువ దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం కలిగిన స్నైపర్ రైఫిళ్ల ఎగుమతిని పూర్తిచేసిందని రక్షణ వర్గాలు వెల్లడించాయి.

హత్రాస్ దుర్ఘటన వెనుక కుట్ర ఉండొచ్చన్న సిట్

లక్నో, జూలై 9: యూపీలోని హత్రాస్‌లో తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం తన నివేదికను సమర్పించింది. ఈ దుర్ఘటన వెనుక పెద్ద కుట్ర ఉన్నదనే వాదనను తోసిపుచ్చలేమని అందులో పేర్కొంది. మరింత లోతుగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. నిర్వాహకులు అవాస్తవాలతో అనుమతులు పొందారని, జన సమూహాన్ని నియంత్రించేందుకు సరైన చర్యలు కూడా తీసుకోలేదని, ప్రమాదానికి వారిదే పూర్తి బాధ్యతని స్పష్టం చేసింది. తనిఖీలకు వీలు లేకుండా పోలీసులను అడ్డుకుని అనుచితంగా ప్రవర్తించారని, భోలే బాబాను ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకుండానే భక్తులు కలిసేందుకు అనుమతిచ్చారని వివరించింది. సిట్ నివేదికతో యూపీ ప్రభుత్వం హత్రాస్ ఎస్డీఎం, సర్కిల్ అధికారి, మరో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసింది.

పతంజలిలో 14 ఉత్పత్తుల అమ్మకాలు నిలుపుదల

న్యూఢిల్లీ, జూలై 9: తమ సంస్థకు చెందిన 14 ఉత్పత్తుల అమ్మకాలను నిలిపివేసినట్టు పంతంజలి ఆయుర్వేద సంస్థ మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆ ఉత్పత్తుల తయారీకి ఇచ్చిన లైసెన్సులను ఉత్తరాఖండ్ ప్రభుత్వం రద్దు చేయడంతో దాని పర్యవసానంగా వాటి అమ్మకాలను ఉపసంహరించుకున్నామని పేర్కొంది. ఈ మేరకు దేశంలోని 5,606 అమ్మకం కేంద్రాలకు సూచనలు ఇచ్చామని తెలిపింది. అయితే ఆ 14 ఉత్పత్తుల ప్రకటనలను ప్రసారం చేయకూడదని సామాజిక మాధ్యమాలకు కూడా సూచించారా అని ధర్మాసనం ప్రశ్నించింది. సామాజిక మాధ్యమాలు ఆ సూచనలను అమలు చేస్తున్నదీ లేనిదీ అన్న విషయమై రెండు వారాల్లో అఫిడవిట్ సమర్పించాలని ఆదేశించింది.

అన్షుమన్ కుటుంబానికి రాహుల్ పరామర్శ

లఖ్‌నవూ, జూలై 9: అమరవీరుడు, కీర్తిచక్ర అవార్డు గ్రహీత కెప్టెన్ అన్షుమన్ సింగ్ కుటుంబాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పరామర్శించారు. మంగళవారం తన సొంత నియోజకవర్గం ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ వెళ్లేందుకు లఖ్‌నవూలో విమానం దిగిన రాహుల్ అక్కడి గెస్ట్ హౌస్‌లో కెప్టెన్ అన్షుమన్ సింగ్ కుటుంబాన్ని కలుసుకున్నారు. రాహుల్ తమకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారని అనంతరం అన్షుమన్ తల్లి మంజు సింగ్ చెప్పారు. ఆర్మీని రెండు విభాగాలుగా విభజించవద్దని, అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాలని ఆమె కోరారు.

ఎంత ముద్దొస్తుందో..!

» అమర సైనికుడు అన్షుమన్ భార్యను ఉద్దేశిస్తూ సోషల్ మీడియాలో పలువురి వికృత కామెంట్లు

రాయ్‌బరేలీ, జూలై 9: యూట్యూబర్ ప్రణీత్‌హనుమంతు వ్యవహారంతో సోషల్ మీడియా వికృత రూపంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ మొదలైంది. ఇదే సమయంలో.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన భారత సైనికుడు అన్షుమన్ సింగ్ భార్య స్మృతి గురించి సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన కామెంట్లు పెట్టిన వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ వెల్లువెత్తుతోంది. అన్షుమన్ త్యాగానికి గుర్తుగా భారత ప్రభుత్వం ఆయనకు కీర్తిచక్ర అవార్డును ప్రకటించింది. ఆయన భార్య స్మృతి ఇటీవల రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ఆ అవార్డును అందుకున్నారు. ఈ వీడియోను వార్తా సంస్థలు సోషల్ మీడియాలో పోస్టు చేయగా.. "ఎంత ముద్దొస్తుందో...." అంటూ కొంత మంది స్మృతిని ఉద్దేశిస్తూ వికృత కామెంట్లు చేశారు. ఈ నేపథ్యంలో.. ఎక్స్‌లో అహ్మద్ కే పేరుతో ఖాతా ఉన్న వ్యక్తిపై నెటిజన్లు జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అతన్ని గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని కమిషన్ ఢిల్లీ పోలీసులను ఆదేశించింది.

భారత్‌కు రష్యా

అణు సహకారం

ఆ దేశ అణు ఇంధన సంస్థ అధిపతి వెల్లడి

మాస్కో, జూలై 9: భారతదేశానికి చాలాకాలంగా అణుఇంధన రంగంలో సహకారాన్ని అందిస్తున్న రష్యా.. మనదేశంలో మరో ఆరు హై-పవర్ అణువిద్యుత్ కేంద్రాల నిర్మాణంలో సహకరించడానికి ముందుకొచ్చింది. దీంతోపాటు లో-పవర్ అణువిద్యుత్ కేంద్రాల ఏర్పాటు అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు ఆ దేశ అణు ఇంధన సంస్థ రోసాటోమ్ సీఈవో అలెక్సీ లిఖచేవ్ వెల్లడించారు. మంగళవారం నాడు.. రష్యాలోని ఆటమ్ పెవిలియన్ సందర్శనకు వెళ్లిన భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఆయనే దగ్గరుండి ఆ పెవిలియన్‌ను చూపించారు. చిన్న చిన్న ట్రాపికల్ న్యూక్లియర్ పవర్‌స్టేషన్లను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్మించుకోవడంలో భారత్‌కు సహకారం అందించేందుకు.. ఇందుకు అవసరమైన నిర్మాణ భాగాలను నేరుగా ఢిల్లీకి సరఫరా చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీకి తెలిపారు. అలాగే.. భారతదేశంలో నాలుగో తరం అణుసాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయాలని రోసాటోమ్ కోరుకుంటున్నట్టు అలెక్సీ చెప్పారు. భారతదేశంలో 'ఫ్లోటింగ్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ల(ఎఫ్ఎన్‌పీపీ)' అభివృద్ధిపై కూడా రష్యా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆసక్తి చూపింది. ఫ్లోటింగ్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ అంటే.. ఓడలపై నిర్మించే అణువిద్యుత్ కేంద్రాలు. అమెరికా 1960ల్లోనే ఈ తరహా పవర్‌ప్లాంట్‌ను ఒకదాన్ని నిర్మించింది. ఆ తర్వాత రష్యా కూడా ఆ దిశగా పరిశోధనలు చేసి ఫ్లోటింగ్ పవర్‌ప్లాంట్‌ను నిర్మించింది. 2019లో దాన్ని ప్రారంభించింది. భారత అణు ఇంధన కమిషన్ చీఫ్ ఈ ఏడాది మే నెలలో రష్యాలో పర్యటించినప్పుడు ఎఫ్ఎన్‌పీపీలపైన, అతి పెద్ద న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టులపైన చర్చించారు. కాగా.. అణు సాంకేతిక పరిజ్ఞానాన్ని శాంతియుత అవసరాలకు వాడుకోవడంలో రష్యా-భారత్ మధ్య మధ్య సహకారం ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యంలో అత్యంత కీలకమైన అంశమని ఇరు దేశాలూ మంగళవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. ప్రధాని మోదీ కూడా దీనిపై 'ఎక్స్' వేదికగా ఒక ట్వీట్ చేశారు. ఇరు దేశాల మధ్య సహకారంలో 'ఎనర్జీ' ముఖ్యమైన మూలస్తంభమని, ఈ రంగంలో తమ బంధాన్ని బలోపేతం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

శాంతి.. శాంతి..

బాంబులు, తుపాకులు, బుల్లెట్ల మధ్య శాంతి చర్చలు సఫలం కావని, ఏ సంక్షోభానికీ యుద్ధరంగం పరిష్కారం చూపదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. కొత్త తరానికి అవసరమైన ఉజ్వల భవిష్యత్తుకు శాంతియుత వాతావరణం అత్యవసమన్నారు. రెండు రోజుల రష్యా పర్యటనలో ఉన్న మోదీ మంగళవారం జరిగిన 22వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. సోమవారం జరిగిన అనధికారిక భేటీలో పుతిన్ చెప్పిన మాటలు తనకు శాంతి సాధ్యమేనన్న ఆశను కల్పించాయన్నారు. ఇదే సందర్భంగా.. ఉక్రెయిన్‌పై రష్యా సోమవారం జరిపిన దాడిలో ఓ పిల్లల ఆస్పత్రి కూడా ఉండటం, పలువురు చిన్నారులు మరణించిన విషయాన్ని మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. 'మానవత్వాన్ని విశ్వసించే వారెవరైనా ప్రాణనష్టం సంభవించినప్పుడు బాధపడతారు. అందులోనూ అభంశుభం తెలియని పిల్లలు మరణిస్తే, హత్యకు గురైతే అది హృదయవిదారకంగా ఉంటుంది. ఎంతో ఆవేదన కలుగుతుంది' అని పేర్కొన్నారు. 'నిన్న జరిగిన సమావేశంలో ఉక్రెయిన్‌పై ఒకరి అభిప్రాయాలు మరొకరం విన్నాం. అంతర్జాతీయ శాంతిపై ప్రపంచ దక్షిణ దేశాలకు ఉన్న ఆశలను నేను వెల్లడించాను' అని తెలిపారు. భారత్ ఎల్లప్పుడూ శాంతి కోసమే కృషి చేసిందని, ఉక్రెయిన్‌తో రష్యాకు కొనసాగుతున్న సంక్షోభానికి ముగింపు పలకటానికి తన వంతు పాత్ర పోషించటానికి సిద్ధంగా ఉందని మోదీ చెప్పారు. గత కొన్నేళ్లలో ప్రపంచదేశాలు ఆహారం, ఇంధనం, ఎరువుల కొరత తను ఎదుర్కొంటూ ఉంటే.. భారత్‌లో మాత్రం ఆ సమస్య రాలేదని, రష్యాతో తమకు ఉన్న స్నేహమే దీనికి కారణమని, భారత్‌లో పెట్రోల్, డీజిల్ కొరత తలెత్తకుండా రష్యా సహకరించిందని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్ గత 40 ఏళ్లుగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటోందని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తాము ఖండిస్తామని స్పష్టం చేశారు. శిఖరాగ్ర సదస్సు అనంతరం మోదీ విలేకర్లతో మాట్లాడుతూ, పుతిన్‌తో తన చర్చలు ఫలప్రదంగా సాగాయని తెలిపారు. మరోవైపు, పుతిన్ మాట్లాడుతూ.. ఉక్రెయిన్ సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించటానికి మోదీ ప్రయత్నిస్తున్నారని, అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఇరుదేశాల వాణిజ్యం గత ఏడాది 66 శాతం పెరిగిందని, ఈ ఏడాది తొలి త్రైమాసికంలో మరో 20 శాతం పెరిగిందన్నారు. ఈ ఏడాది అక్టోబరులో రష్యాలో జరిగే బ్రిక్స్ సదస్సుకు రావాల్సిందిగా మోదీని పుతిన్ ఆహ్వానించారు. కాగా, రష్యా అత్యున్నత పౌర పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్ ద ఫస్ట్ కాల్డ్'ను పుతిన్ మోదీకి అందించారు. ఇరుదేశాల మధ్య స్నేహసంబంధాల బలోపేతానికి కృషిచేసినందుకు ఈ పురస్కారాన్ని మోదీకి ఇచ్చారు. కాగా.. ఇంధనం, వ్యవసాయం తదితర రంగాల్లో పెట్టుబడుల ద్వారా 2030నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రూ.8.3లక్షల కోట్లకు పెంచుకోవాలని ఇరు దేశాలూ నిర్ణయించినట్టు సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. ఇరు దేశాల కరెన్సీలతో వాణిజ్య చెల్లింపులు సహా 9 అంశాలపై ఒక ఒప్పందానికి వచ్చినట్టు వివరించాయి. కాగా.. రెండు రోజుల రష్యా పర్యటన ముగించుకున్న ప్రధాని మోదీ మంగళవారం అక్కడి నుంచే ఆస్ట్రియాకు బయల్దేరి వెళ్లారు.

అన్ని వేళలా మిత్రదేశం

రష్యాలో ఉన్న భారతీయులను ఉద్దేశించి మంగళవారం ప్రసంగించిన మోదీ.. రష్యా భారత్‌కు సుఖదుఃఖాల్లో, అన్ని వేళలా విశ్వసించదగిన మిత్రదేశమని పేర్కొన్నారు. 'రష్యాలో శీతాకాలంలో ఉష్ణోగ్రతలు ఎంతగానైనా పడిపోనివ్వండి.. భారత్-రష్యా స్నేహం మాత్రం ఎల్లప్పుడూ వెచ్చగానే ఉంటుంది' అని వ్యాఖ్యానించారు.

భారతీయులను వెనక్కి పంపడానికి ఓకే!

తమ సైన్యంలో సహాయక సిబ్బందిగా భారతీయులను నియమించుకోకూడదన్న భారత్ విజ్ఞప్తికి రష్యా అంగీకరించింది. ఇప్పటికే రష్యా సైన్యంలో పని చేస్తున్న భారతీయులను భారత్‌కు తిప్పిపంపించటానికి కూడా సమ్మతి తెలిపింది. పుతిన్‌తో జరిగిన అనధికారిక భేటీలో మోదీ దీని గురించి చర్చించారని, ఈ నేపథ్యంలోనే రష్యా నిర్ణయం తీసుకుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీనిపై రష్యా అధికారికంగా ప్రకటన చేస్తుందని తెలిపాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా.. పలువురు భారతీయ యువకులను సైన్యంలో చేర్చుకొని వారిని యుద్ధరంగానికి తరలించింది. వీరిలో హైదరాబాద్‌కు చెందిన ఒక యువకుడితోపాటు సూరత్‌కు చెందిన మరో యువకుడు మరణించారు.

కారులో షికారు

తమ దేశానికి అతిథిగా వచ్చిన ప్రధాని మోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ తన నివాసాన్ని దగ్గరుండి చూపించారు. ఒక ఎలక్ట్రిక్ కారులో మోదీని కూచోబెట్టుకొని స్వయంగా డ్రైవ్ చేస్తూ పుతిన్ ఆ ప్రాంతమంతా చూపించారు. అనంతరం, ఇరువురు నేతలూ కారు దిగి ఒక తోటలో నడుస్తూ మాట్లాడుకున్నారు.



రక్తపిపాసితో ఆలింగనమా?

పుతిన్‌ను మోదీ ఆప్యాయంగా ఆలింగనం చేసుకోవటాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తప్పుబట్టారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం నాయకుడు ప్రపంచంలోనే అత్యంత రక్తపిపాసి అయిన ఓ నేరస్థుడిని ఆలింగనం చేసుకోవటం శాంతి ప్రయత్నాలకు పెద్ద దెబ్బ. తీవ్ర నిరుత్సాహం కలిగించే విషయం' అని పేర్కొన్నారు. మోదీ పర్యటన సమయంలోనే ఉక్రెయిన్‌లో ఓ పిల్లల ఆస్పత్రితోపాటు పలు చోట్ల రష్యా దాడులు జరిపింది. ఈ దాడుల్లో 39 మంది మరణించారు.

లోకం తీరు



పూరీ 'రత్న భండార్'ను 14న తెరవాలి

» అవసరమైతే తాళం విరగ్గొట్టాలి

» జగన్నాథ మందిర కమిటీకి సిఫారసు చేసిన ఉన్నత స్థాయి సంఘం

భువనేశ్వర్, జూలై 9: పూరీ శ్రీజగన్నాథ మందిరంలో నగలు, ఇతర విలువైన వస్తువులను భద్రపరిచే 'రత్న భండార్'లోని లోపలి గదిని ఈ నెల 14న తెరవాలని ఉన్నతస్థాయి సంఘం సిఫార్సు చేసింది. రత్న భండార్‌ను తెరిచే విషయమై ఏర్పాటయిన జస్టిస్ బిశ్వనాథ్ రథ్ ఆధ్వర్యంలోని ఉన్నతస్థాయి సంఘం మంగళవారం పూరీలో సమావేశమయి కూలంకషంగా చర్చలు జరిపింది. లోపలి గదిని తెరవాలని ఆలయ నిర్వహణ కమిటీకి ఏకగ్రీవంగా సిఫార్సు చేసింది. ఆ కమిటీ ఈ సిఫార్సును రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి అనుమతి తీసుకోనుంది. 46 ఏళ్ల క్రితం చివరిసారిగా 1978లో రత్నభండార్‌ను తెరిచి నగల విలువను లెక్కించారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో రత్న భండార్ తెరవడం ప్రచార అంశంగా మారింది. తాము అధికారంలోకి వస్తే రత్న భండార్‌ను తెరిపిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ప్రస్తుతం ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడంతో హామీ అమలు కోసం ఉన్నత స్థాయి సంఘాన్ని నియమించింది. ఈ సంఘానికి శ్రీ జగన్నాథ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ) చీఫ్ అడ్మినిస్ట్రేటర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. రత్న భండార్‌కు ఉన్న రెండో తాళం చెవిని ఇవ్వాలని ఆయనను కమిటీ కోరింది. అయితే ప్రస్తుతం రథయాత్ర దృష్ట్యా బిజీగా ఉన్నందున ఇప్పుడే ఇవ్వలేమని ఆయన సమాధానం ఇచ్చారు. దాంతో ఈ నెల 14న ఇవ్వాలని సూచించింది. ఒకవేళ రెండో తాళం చెవి ద్వారా తెరవలేని పరిస్థితి వస్తే తాళాన్ని బద్దలు కొట్టాలని కమిటీ నిర్ణయించింది. నగల జాబితాను రూపొందించాలని, అవసరమైనవాటికి మరమ్మతులు చేయించాలని ప్రతిపాదించింది.

సంక్షేమం సున్నా.. సాధికారత శూన్యం!

(మొదటి పేజీ తరువాయి)

కరిగిపోయింది!. అయితే.. ఎస్‌బీఐ తమ పాలనకు వీరతాళ్లు వేసిందంటూ.. రోత పత్రిక రాసుకొచ్చింది. నిజానికి ఎస్‌బీఐకి ఇలాంటి అధ్యయనాలు చేసి నివేదికలివ్వాలంటే ఏపీ గురించి సమాచారం కావాలి. మరి ఈ సమాచారం ఎవరిచ్చారు? అంటే.. ఖచ్చితంగా జగన్ ప్రభుత్వమే ఇచ్చింది. మరి జగన్ సర్కారే ఇచ్చిన సమాచారం ఆధారంగా వండి వార్చిన నివేదికలో వాస్తవాలు తెలుస్తాయా అనేది కీలక అంశం. దీంతో పాటు బడ్జెట్ పుస్తకాల్లో వేసే గారడీ లెక్కలను, ఆర్థిక శాఖ ఇచ్చిన అవాస్తవ సమాచారం ఆధారంగా రూపొందించే కాగ్ నివేదికలు ఆధారం చేసుకున్నారు. అందుకే ఎస్‌బీఐ నివేదికలో ఆ పుస్తకాల్లో ఉన్నట్టు గత ఐదేళ్లలో సగటు వార్షిక ఆదాయవృద్ధి 12%, రెవెన్యూ రాబడిలో 11% సంక్షేమ పథకాలకు ఖర్చు చేశారని రాశారు. ఏటా 47 లక్షల మందికి జగనన్న విద్యాకానుక ఇచ్చారని రాసింది. ఇది అవాస్తవం. పిల్లలకు ఇచ్చిన రాతపుస్తకాలపై కూడా జగన్ ఫొటోలు ముద్రించారు. ఇది అనవసర ఖర్చే. ఎస్‌బీఐకి ఇదెందుకు ఇవ్వలేదన్నది ప్రధాన ప్రశ్న.

మరిన్ని వాస్తవాలు ఇవీ..

- 2023-24లో విద్యార్థుల సంఖ్య 38.25 లక్షలుండగా 39.96 లక్షల విద్యాకానుక కిట్లు కొన్నారు. మిగిలిన 1.7 లక్షలు ఎక్కడున్నాయో తెలియదు. ఒక్కో కిట్టుకు సగటున రూ.2,100 వెచ్చించారు. ఈ లెక్కన రూ.35.71 కోట్ల విలువైన సామగ్రి ఎవరి జేబుల్లోకి వెళ్లిందో చెప్పలేదు. దీనిని దాచేసి అంతా బాగుందని నివేదికలో తెలిపారు. అలాగే, 2022-23లో 45,14,687 కిట్లు కొన్నారు. వీటిలోనూ 4.48 లక్షల కిట్లు మిగిలిపోయాయి. ఒక్కొక్క కిట్టుకి సగటున రూ.1,565 ఖర్చు చేశారు. దాదాపు రూ.70 కోట్లు గోల్‌మాల్ ఇక్కడ జరిగింది.
- పొదుపు మహిళలకు సున్నావడ్డీ కింద రూ.4,969 కోట్లు ఖర్చు చేసినట్టు అచ్చేశారు. టీడీపీ హయాంలో డ్వాక్రా సంఘాలకు బ్యాంకులు ఇచ్చే రుణపరిమితి రూ.10 లక్షల వరకు ఉండేది. ఆలోపు ఎంత రుణం తీసుకున్నా రూ.5 లక్షల వరకు సున్నావడ్డీ రాయితీ వర్తించేది. జగన్ అధికారంలోకి రాగానే ఈ వడ్డీ రాయితీని రూ.3 లక్షలకు తగ్గించారు. అంటే రూ.2 లక్షల రుణానికి రాయితీలో కోత పెట్టారు. దీంతో డ్వాక్రా మహిళలపై వడ్డీ భారం పడింది. మరి దీనిలో సున్నా వడ్డీ రాయితీ ఏముంది?.. దీనిని కూడా దాచేసి అంతా చక్కగా ఉందని రాసుకొచ్చారు.
- 'అమ్మఒడి' పథకాన్ని ఐదేళ్లపాటు ఇచ్చినట్టు ఎస్‌బీఐ నివేదికలో పేర్కొన్నారంటూ.. రోతపత్రికలో డబ్బాకొట్టారు. నాలుగేళ్లు మాత్రమే ఆ పథకం ఇచ్చారు. అందులో కూడా కోతలు విధించారు.
- 'చేయూత' కింద మహిళలకు ఏటా రూ.5,060 కోట్లు ఇచ్చారని రాసుకొచ్చారు. కానీ, ఏ ఒక్కసారి కూడా పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు ఈ నిధులు చేరలేదు. చివరి ఏడాది 'చేయూత' పథకాన్ని అడ్డం పెట్టుకుని ఓట్లు కొనుగోలు చేయాలని జగన్ కుట్రలు పన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ కుట్రలను భగ్నం చేసింది. ఈ పథకానికి జగన్ ఫిబ్రవరిలో బటన్ నొక్కారు. కానీ, పోలింగ్ తేదీ మే 13 వరకు ఖాతాల్లో జమ చేయలేదు.

నీట్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

పట్నాలో అదుపులోకి తీసుకున్న సీబీఐ.. వారిలో ఒకరు నీట్ పరీక్ష రాసిన అభ్యర్థి

» ఈ కేసులో 11కు చేరిన అరెస్టులు

» పట్నా, గోధ్రా సెంటర్లలో 183 మందికే 640 కన్నా ఎక్కువ మార్కులు

» నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడి



హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నీట్ అక్రమాలపై దర్యాప్తుచేస్తున్న సీబీఐ.. పట్నాలో తాజాగా మరో ఇద్దరిని అరెస్టు చేసింది. నలందకు చెందిన సన్నీ అనే అభ్యర్థిని, రంజిత్ కుమార్ అనే మరో అభ్యర్థి తండ్రిని అదుపులోకి తీసుకుంది. దీంతో ఈ కేసులో సీబీఐ ఇప్పటిదాకా చేసిన అరెస్టుల సంఖ్య 11కు పెరిగింది. ఈ పదకొండు మందిలో.. నీట్ పరీక్ష రాసిన అభ్యర్థి తాజాగా అరెస్ట్ అయిన సన్నీ ఒక్కడే. మిగతా 10 మందీ.. పేపర్ లీకేజీకి పాల్పడటం, నిందితులకు ఆశ్రయం ఇవ్వడం వంటి వేర్వేరు ఆరోపణలపై అరెస్టయినవారు. అలాగే, ఇప్పటిదాకా అరెస్టయినవారిలో ఎనిమిది మంది బిహార్‌కు చెందినవారు కాగా.. ఇద్దరు గుజరాతీలు (గోధ్రా, లాతూరుకు చెందినవారు). మరొకరు డెహ్రాడూన్‌కు చెందిన వ్యక్తి. కాగా.. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి కేసులు నమోదైన పట్నాలోని 12 పరీక్షా కేంద్రాల్లో 175 మంది, గోధ్రాలోని 2 సెంటర్లలో 8 మంది (మొత్తం కలిపి 183 మంది) మాత్రమే 640 అంతకన్నా ఎక్కువ స్కోర్ చేసినట్టు జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడించింది. పట్నాలో రాసినవారిలో 35 మంది మాత్రమే 680 అంతకన్నా ఎక్కువగా మార్కులు సాధించగా.. గోధ్రాలోని ఎగ్జామ్ సెంటర్లలో పరీక్ష రాసిన ఏ అభ్యర్థీ ఆ మార్కులు సాధించలేకపోయారని వివరించింది. 'నీట్ పేపర్ లీకేజీ సుస్పష్టం. అయితే, అది ఏ స్థాయిలో జరిగిందో తేలాల్సి ఉంది. పెద్ద ఎత్తున జరిగి ఉంటే మళ్లీ పరీక్షకు ఆదేశించక తప్పదు' అంటూ సుప్రీంకోర్టు సోమవారం వ్యాఖ్యానించిన నేపథ్యంలో.. ఎన్‌టీఏ అధికారులు ఈ వివరాలను వెల్లడించారు. పదివేలలోపు ర్యాంకులు సాధించినవారంతా ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాలేదని.. దేశంలోని 800 సెంటర్లలోనూ ర్యాంకర్లు విస్తరించి ఉన్నారని తెలిపారు. ఎంబీబీఎస్‌లో లేదా దంత వైద్య కళాశాలల్లో సీట్లు సాధించే ర్యాంకు సాధించిన లక్ష మందీ.. దేశంలోని 4,500 సెంటర్ల పరిధిలో (మొత్తం పరీక్షా కేంద్రాల సంఖ్య 4,750) విస్తరించి ఉన్నారని తెలపడం ద్వారా.. లీకేజీ పెద్ద ఎత్తున జరగలేదని విషయాన్ని స్పష్టం చేశారు. కాగా, నీట్‌ను రద్దు డిమాండ్ల నేపథ్యంలో.. మాజీ ఐఏఎస్ అధికారులు ఆర్.సుబ్రమణ్యన్, సుతీర్థ భట్టాచార్య, జోధ్‌పూర్ ఐఐటీ మాజీ డైరెక్టర్ ప్రేమ్ కల్రా స్పందించారు. నీట్‌కు ప్రత్యామ్నాయాన్ని సూచిస్తూ.. విద్యార్థుల ప్రతిభను కేవలం 3 గంటల్లో హడావుడిగా అంచనా వేయడానికి బదులు.. 11, 12 తరగతుల్లో తరచుగా అంచనా వేయాలన్నారు. అలాగే.. ఏడాదికి ఆరు వారాల చొప్పున రెండుసార్లు ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎస్ వంటివాటిలో ఇంటర్న్‌షిప్‌కు అవకాశమిచ్చి అక్కడ వారి సామాజిక, వ్యావహారిక స్వభావాలను అంచనా వేయాలన్నది రెండో సూచన. ఈ రెండింటికీ 40 శాతం చొప్పున వెయిటేజీ ఇచ్చి.. ప్రవేశపరీక్షల్లో వచ్చే మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇవ్వాలని (40:40:20 నిష్పత్తి) తమ ప్రతిపాదనలో వివరించారు.

80 శాతం తప్పులు..

ఎన్‌టీఏ ఇటీవల విడుదల చేసిన 'కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ)-యూజీ' పరీక్ష ఆన్సర్ కీలో చాలా తప్పులు ఉన్నాయని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక అభ్యర్థి అయితే ఆన్సర్ కీలో 80శాతం తప్పులే ఉన్నట్టు ఆవేదన వెలిబుచ్చారు. మరో అభర్థి 'ఈ బోగస్ ఆన్సర్ కీని మేం అస్సలు అంగీకరించం' అంటూ 'ఎక్స్'లో ట్వీట్ చేశాడు. ఈ నేపథ్యంలో.. అభ్యర్థులు ఎత్తిచూపిన తప్పులను సబ్జెక్ట్ నిపుణులు పరిశీలిస్తారని, అనంతరం తుది ఆన్సర్ కీని విడుదల చేసి ఫలితాన్ని వెల్లడిస్తామని ఎన్‌టీఏకి చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

అసంఘటిత రంగం గత ఏడేళ్లలో ఢమాల్!

» దేశంలో సగానికి పైగా రాష్ట్రాల్లో ఉపాధి కోల్పోయిన లక్షలాది మంది

» ఎన్ఎస్ఎస్‌వో నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ, జూలై 9: గడిచిన ఏడేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా సగానిపైగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసంఘటిత రంగం కుదేలైందని, ఫలితంగా లక్షలాది మంది ఉపాధి కోల్పోయారని నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్(ఎన్ఎస్ఎస్‌వో) నివేదిక స్పష్టం చేసింది. 2015-2023 మధ్య 13 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో కార్మికులు, చిరు వ్యాపారులు, ఇతర అసంఘటిత రంగంలోని వారు లక్షల సంఖ్యలో ఉపాధి కోల్పోయారని తెలిపింది. ఉపాధి కోల్పోయిన వారిలో చిన్నపాటి సంస్థల్లో పనిచేసుకునేవారు, చిన్న పరిశ్రమల ఉద్యోగులు, ఆయా పరిశ్రమల్లో భాగస్వాములు, చిరు వ్యాపారులు ఉన్నారని వివరించింది. పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 30 లక్షల మంది అసంఘటిత రంగంలో ఉపాధి కోల్పోయారని పేర్కొంది. అదేవిధంగా కర్ణాటకలో 13 లక్షలు, తమిళనాడులో 12 లక్షలు, యూపీలో 7.91 లక్షలు, ఏపీలో 6.77 లక్షలు, కేరళలో 6.4 లక్షలు, అసోంలో 4.94 లక్షలు, తెలంగాణలో 3.44 లక్షల మంది గత ఏడేళ్లలో రోడ్డున పడ్డారని నివేదిక వివరించింది. ఢిల్లీలో 3 లక్షల మంది ఉపాధి కోల్పోయారని నివేదిక స్పష్టం చేసింది. గత ఏడేళ్లలో అసంఘటిత రంగం దెబ్బతినడంపై కేంద్ర ఆర్థిక శాఖ కూడా గమనించినట్టు ఎన్ఎస్ఎస్‌వో నివేదిక స్పష్టం చేసింది. రానున్న బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు, గ్రామీణ నిరుద్యోగాన్ని తగ్గించేందుకు ప్రతిపాదనలు చేసే అవకాశం ఉందని తెలిపింది.

ఈ రాష్ట్రాల్లో పెరిగింది..

అయితే.. 2015-23 మధ్య ఏడేళ్ల కాలంలో కొన్ని రాష్ట్రాల్లో అసంఘటిత రంగం పుంజుకున్నట్టు ఎన్ఎస్ఎస్‌వో నివేదిక వెల్లడించింది. మహారాష్ట్రంలో 24 లక్షల మందికి కొత్తగా ఉపాధి లభించినట్టు తెలిపింది. గుజరాత్‌లో 7.62 లక్షల మంది, ఒడిసాలో 7.61 లక్షల మంది, రాజస్థాన్‌లో 7.56 లక్షల మంది కొత్తగా ఉపాధి పొందినట్టు వివరించింది.

యువత నిరుద్యోగులుగా ఉండాలన్నదే మోదీ లక్ష్యం



న్యూఢిల్లీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): దేశంలోని యువతను నిరుద్యోగులుగా ఉంచడమే మోదీ ప్రభుత్వం లక్ష్యమని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. నిరుద్యోగ సమస్యపై సిటీగ్రూప్ ఇచ్చిన స్వతంత్ర ఆర్థిక నివేదికలను మోదీ ప్రభుత్వం ఖండిస్తోందని, అయితే ప్రభుత్వ డేటాను ఎలా తిరస్కరిస్తారని ఆయన ప్రశ్నించారు. వివిధ సంస్థల నివేదికలను ఉటంకిస్తూ 'ఎక్స్'లో ఖర్గే మంగళవారం సుదీర్ఘ పోస్టు చేశారు. గత పదేళ్లలో కోట్లాది మంది యువత కలలు ఛిన్నాభిన్నం కావడానికి మోదీ ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. "ఎన్ఎస్ఎస్‌వోకు చెందిన అన్‌ఇన్‌కార్పొరేటెడ్ సెక్టర్ ఎంటర్‌ప్రైజెస్ వార్షిక సర్వే ప్రకారం... 2015-23 మధ్యకాలంలో తయారీ రంగంలోని అసంఘటిత యూనిట్లలో 54 లక్షల ఉద్యోగాలు పోయాయి" అని ఖర్గే పేర్కొన్నారు. ఐఐఎం లఖ్‌నవూ నివేదిక ప్రకారం... దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరుగుదల, విద్యావంతుల్లో అధిక నిరుద్యోగం, శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉందని తేలిందని వివరించారు.

నేడు రాష్ట్రానికి బీపీసీఎల్ బృందం

» సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆయిల్ దిగ్గజ కంపెనీ బీపీసీఎల్ (భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్)కు చెందిన ఉన్నతాధికారుల బృందం బుధవారం రాష్ట్రానికి రానుంది. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ కానుంది. రూ.60 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఆయిల్ రిఫైనరీ విషయమై చర్చించే నిమిత్తం ఈ బృందం వస్తున్నట్లు సమాచారం. ఈ ఆయిల్ రిఫైనరీని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని చంద్రబాబు ఇటీవల ఢిల్లీ పర్యటనలో కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వంతో ప్రాథమిక చర్చల నిమిత్తం కంపెనీ బృందం వస్తున్నట్లు సమాచారం.

రాష్ట్ర ఏఏజీగా సాంబశివ ప్రతాప్

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా న్యాయవాది ఇ.సాంబశివ ప్రతాప్ నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయ శాఖ కార్యదర్శి వి.సునీత(ఎఫ్ఏసీ) మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన నియామకం అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సాంబశివప్రతాప్‌ది పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు మండలం, తిల్లపూడి గ్రామం. ఉమ్మడి హైకోర్టుతో పాటు విభజిత ఏపీ హైకోర్టులో గత 40 సంవత్సరాల నుంచి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. 1996-2002 మధ్య ఆంధ్రప్రాంత మున్సిపాలిటీలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలు అందించారు. 2016-19 మధ్య ప్రభుత్వ జీపీగా పనిచేశారు. జనసేన ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి న్యాయపరమైన సేవలందిస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల తరువాత జనసేన పార్టీ లీగల్ సెల్ చైర్మన్‌గా ఉన్నారు.

కేఆర్ఎంబీపై అఫిడవిట్ దాఖలు చేయండి: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ఇతర అవసరాలకు అనుమతులు లేకుండా నీటిని వినియోగిస్తున్న విషయంపై ఆంధ్రప్రదేశ్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కృష్ణానది పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకువచ్చే అంశంపై కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జస్టిస్ అభయ్ ఎస్ ఒకా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసి నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై విచారించింది. కృష్ణా పరివాహక ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి ఇవ్వడం తమకు సమ్మతమేనని ఏపీ గతంలోనే చెప్పింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం విముఖత వ్యక్తం చేస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది. ఇరు వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. ఆ లోపు అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది.

ప్రక్షాళన ఆరంభం

(మొదటి పేజీ తరువాయి)

ప్రవీణ్ ప్రకాశ్‌కు చంద్రబాబు ప్రభుత్వం ఉద్వాసన పలికింది. స్వచ్ఛంద పదవీవిరమణ (వీఆర్ఎస్) కోరుతూ ఆయన పెట్టుకున్న దరఖాస్తును మంగళవారం ఆమోదించేసింది. ఈయన అత్యంత వివాదాస్పదుడు.. ఒక్క అధికారితోనూ సఖ్యత ఉండదు. జగన్ అధికార పగ్గాలు చేపట్టగానే ఢిల్లీ నుంచి ఈయన్ను పిలిపించి తన పేషీలో నియమించుకున్నారు. కీలకమైన సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)కూడా అప్పగించారు. ఇక అంతే.. సర్వం తానే అన్నట్లు వ్యవహరించారు. విచ్చలవిడితనం పెరిగిపోయింది. సీనియర్ ఐఏఎస్ అధికారులను కూడా లక్ష్యపెట్టని స్థితికి చేరుకున్నారు. నిబంధనలను అతిక్రమించి రెండు సార్లు ఎన్నికల సంఘం ఆగ్రహానికి గురైన ఈయన.. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నప్పుడు టీచర్లను వేధించుకు తిన్నారు. పాఠశాలలు సందర్శించి.. టీచర్లను పిల్లల ముందే గద్దించడం.. అకారణంగా సస్పెండ్ చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. కొత్త ప్రభుత్వం రాగానే అయన్ను బదిలీచేసి పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. దీంతో ఆయనకు పరిస్థితి అర్థమైపోయింది. తాను చేసిన అకార్యాలకు శిక్ష తప్పదని గ్రహించారో ఏమో.. వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుని.. మూడు నెలల నోటీసు ఇచ్చారు. సెప్టెంబరు 30తో నోటీసు గడువు ముగుస్తుంది. అది ముగిసే ముందు వీఆర్ఎస్‌ను ఆమోదిస్తున్నట్లు ప్రభుత్వం జీవో ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పుడే ఉత్తర్వులివ్వడం గమనార్హం. దీనర్థం ఈ మూడు నెలల్లో ఆయనకు పోస్టింగ్ కూడా ఇవ్వరన్న మాట. ఆయనలా జగన్ కోసం పనిచేసిన ఇంకొందరు అధికారులకు గట్టి హెచ్చరిక సందేశం పంపేందుకే చంద్రబాబు ప్రభుత్వం ఇలా చేసింది.

దారి తప్పినోళ్లు ఎందరో..

జగన్ ఐదేళ్ల హయాంలో చాలా మంది ఐఏఎస్‌లను నయానో భయానో లొంగదీసుకున్నారు. కొందరు సీనియర్ అధికారుల మెడపై కత్తిపెట్టి తమకు కావలసిన పనులు చేయించుకున్నారు. తప్పుడు కేసులు, అరెస్టులకు కొందరు అధికారులు భయపడి ఆయన చెప్పినట్టల్లా చేసి అభాసుపాలయ్యారు. కొత్త ప్రభుత్వం వచ్చాక వీరందరిపై వేటు పడుతుందని అందరూ భావించారు. వైసీపీ కార్యకర్తల్లా పనిచేసిన అధికారులు ఎవరా అని లెక్కదీస్తే.. మూడొంతుల మంది జగన్‌తో అంటకాగారని తేలింది. ఇంత మందిని తప్పించడం కుదిరే పనికాదు. అసలే రాష్ట్రంలో ఐఏఎస్‌ల కొరత ఉంది. దీనికితోడు జగన్ అనాలోచితంగా 13 కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడంతో 13 మంది చొప్పున కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లను నియమించాల్సి వచ్చింది. దీంతో ఐఏఎస్‌ల కొరత మరింత పెరిగింది. ఈ పరిస్థితుల్లో మూడొంతుల మందిని పక్కనపెట్టడానికి చంద్రబాబు ప్రభుత్వం వెనుకాడుతోంది. అందుకే ఈ జాబితాను వడపోసి.. వ్యవస్థలను అతలాకుతలం చేసిన సీనియర్లపై తొలుత దృష్టి సారించింది. పరిమిత సంఖ్యలో ఒక్కొక్కరినీ సాగనంపేందుకు సమాయత్తమైంది. ఇందులో భాగంగానే ప్రవీణ్ ప్రకాశ్‌పై మొదటి వేటుపడింది. ఇలాంటివారిని లూప్‌లైన్‌లో ఉంచినా.. ఎక్కడో ఒక చోట పోస్టింగ్ ఇవ్వాల్సిందేనని.. అక్కడ కూడా వ్యవస్థను నాశనం చేస్తారని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే పూర్తిగా నీతి తప్పినవారిని మాత్రమే ఏరివేయాలని అనుకుంటోంది. అతిత్వరలోనే ఇద్దరు ముగ్గురిపై ఈ దిశగా చర్యలుంటాయని తెలుస్తోంది.

హేమచంద్రారెడ్డి రాజీనామా ఆమోదం

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలి చైర్మన్ కె. హేమచంద్రారెడ్డి రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. జేఎన్‌టీయూ-అనంతపురంలో ప్రొఫెసర్‌గా ఉన్న ఆయన్ను వైసీపీ ప్రభుత్వం మండలి చైర్మన్‌ను చేసింది. తొలివిడత పదవీకాలం ముగిశాక రెండోసారి కూడా అవకాశం ఇచ్చింది. అయితే, జగన్ హయాంలో పూర్తిస్థాయిలో వైసీపీ కార్యకర్తగా ఆయనపై ముద్ర పడింది. ప్రభుత్వం ఏం చెబితే అది.. గుడ్డిగా అమలుచేశారనే విమర్శలున్నాయి. ఈ కారణంగానే ఎన్నికల ఫలితాలు విడుదలైన రోజే పదవికి రాజీనామా చేశారు. కొన్ని ఫైళ్లను మండలి కార్యాలయంలోనే ధ్వంసం చేశారు. రాజీనామా లేఖను ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి వాట్సా‌ప్‌లో పంపి వెళ్లిపోయారు. మెడికల్ లీవుకు దరఖాస్తు చేసుకోగానే ముఖ్య కార్యదర్శి మంజూరు చేశారు. ఇప్పుడు ఆయన రాజీనామాకు ఆమోదం లభించింది.

అవినీతిపై విచారణకు పిల్.. రాష్ట్ర ఉన్నత విద్యామండలి తాజా మాజీ చైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ కె. రామ్మోహనరావుల అవినీతిపై విచారణకు ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. బుధవారం ఆ పిటిషన్ విచారణకు రానుంది. అయితే, ఈ విచారణకు ఒక్కరోజు ముందు ఆయన రాజీనామాకు ఆమోదం తెలపడంతో పిల్ తీవ్రత తగ్గుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన అవినీతిపై విచారణ జరపాలని ఏపీ నిరుద్యోగ ఫోరం ఇటీవల ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. అలాగే ఆయనను ప్రొఫెసర్ పోస్టు నుంచి సస్పెండ్ చేయాలనే డిమాండ్ చేశారు.

"సమర్థ పాలన ఉంటే పేదలు కూడా బాగుపడతారు. వాళ్ల జీవితాలు మెరుగుపడాలి. లేకపోతే వారి జీవితాలు మరింత నాశనం అవుతాయి. గత దుష్పరిపాలన వల్ల ఎంత నష్టం జరిగిందో తెలియడానికే ఈ కసరత్తు (శ్వేతపత్రాల విడుదల) చేపట్టాం"

"తిక్కలోడు తిరణాలకు వెళ్తే ఎక్కా, దిగా సరిపోయిందని నానుడి. అదే మాదిరిగా వైసీపీ ప్రభుత్వం దిక్కుమాలిన నిర్ణయాలతో వ్యవస్థలను నాశనం చేసింది. సౌర విద్యుత్ కంపెనీలతో తగాదా పెట్టుకొని వాళ్ల వద్ద కరెంటు తీసుకోలేదు. ఎంతో ఖర్చు పెట్టి బయట కొన్నారు. చివరకు కరెంటు తీసుకోకపోయినా సౌర విద్యుత్ కంపెనీలకు ప్రభుత్వం డబ్బు చెల్లించాల్సి వచ్చింది. ప్రజల సొమ్మును వృథా చేశారు"

\- చంద్రబాబు



టారిఫ్‌కు కట్టడి!

(మొదటి పేజీ తరువాయి)

పేదోడినని చెప్పుకునే జగన్....విద్యుత్తుచార్జీల విషయంలో పేదోళ్లపైనే భారం వేసేలా టారిఫ్ వసూలు చేశారన్నారు. తెలుగుదేశం హయాంలో 50 యూనిట్ల వరకూ 101 రూపాయలను వసూలు చేస్తే .. జగన్ జమానాలో 98 శాతం పెంపుదల చేసి 199 రూపాయలు చేశారని విమర్శించారు. నెలకు 100 యూనిట్లను వాడేవారిపై టీడీపీ హయాంలో రూ.244 వసూలు చేస్తే, జగన్ ప్రభుత్వం 86 శాతాన్ని పెంచి రూ453ను వసూలు చేసిందన్నారు. అదేవిధంగా 200 యూనిట్లను వాడేవారిపై టీడీపీ సర్కారు 632 రూపాయలు వసూలు చేస్తే .. జగన్ జమానాలో 78 శాతం పెంచి రూ.1123 వసూలు చేశారని వివరించారు. ఈ విధంగా పేద, మధ్య తరగతి వర్గాలపై 78 నుంచి 98 శాతం చార్జీలను పెంచిన జగన్ .. 300 యూనిట్లపైబడి కరెంటు వాడే సంపన్నులపై కేవలం 29శాతం పెంపుదలతో రూ.2037 చార్జీలను వసూలు చేశారన్నారు. ఈ విధానాన్ని బట్టి జగన్ పెత్తందారీ విధానాలు అమలు చేశారని అర్థమవుతోందని చంద్రబాబు అన్నారు. వైసీపీ పాలనలో పేద, మధ్యతరగతి వర్గాలపై చార్జీలను వేయడంవల్ల కోటి 53లక్షల మంది వినియోగదారులు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారని చంద్రబాబు అన్నారు.

ట్రూఅప్‌పై నిర్ణయం తీసుకోలేదు

గుజరాత్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా కేంద్రం ప్రకటించిందని చంద్రబాబు తెలిపారు. విశాఖ జిల్లా పూడిమడకలో ఎన్‌టీపీసీ నిర్మించదలచిన థర్మల్ విద్యుత్కేంద్రానికి బదులు గ్రీన్‌హైడ్రోజన్ ప్లాంటును ఏర్పాటు చేస్తామంటూ ప్రతిపాదించిందని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌మిషన్ లైన్లను వేయాల్సి ఉందన్నారు. ఇంధన రంగంలో హైబ్రీడ్ విధానాలను అమలు చేస్తామన్నారు. ఎక్కడికక్కడ గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడం ద్వారా ట్రాన్స్‌మిషన్ నష్టాలను తగ్గించేందుకు వీలుందని చంద్రబాబు వెల్లడించారు. విద్యుత్తు రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్రం నుంచి సహాయ సహకారాలను తీసుకుంటామని చెప్పారు. జగన్ జామానాలో విద్యుత్తు రంగానికి రూ.1,29,503 కోట్ల మేర నష్టాలు వచ్చాయని చంద్రబాబు అన్నారు. ఈ నష్టాలు పూడ్చాలని కేంద్రాన్ని కోరలేమన్నారు. జగన్ ప్రభుత్వంలోని రూ.17,000 కోట్ల ట్రూఅప్ చార్జీలపై ఏం చేయాలో నిర్ణయం తీసుకోలేదన్నారు.

మీటర్లపై నిర్ణయం తీసుకోలేదు..

గృహాలకు స్మార్ట్‌మీటర్ల బిగింపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదనీ, ఇప్పటికే వ్యవసాయ పంప్‌సెట్లకు బిగించిన మీటర్లపైనా త్వరలోనే సమీక్ష జరుపుతామని చంద్రబాబు తెలిపారు. ఇప్పటికే వ్యవసాయ పంప్ సెట్లకు మీటర్లను బిగించిన వాటిని ఏం చేయాలో నిర్ణయిస్తామన్నారు. వ్యవసాయ పంప్‌సెట్లకు సోలార్ ప్యానళ్లను బిగించే కార్యక్రమాన్ని అమలుచేసే యోచనలో ఉన్నామన్నారు. ఈ పథకం వల్ల నాలుగేళ్లలో ప్రయోజనం కనిపిస్తుందని వివరించారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో (సెకీ) డిస్కమ్‌లు చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయబోమని, దానివల్ల న్యాయపరమైన ప్రతిబంధకాలు ఎదురవుతాయని చెప్పారు. పంప్డ్ స్టోరేజీ జల విద్యుదుత్పత్తి కేంద్రాలకు గత ప్రభుత్వం ఇచ్చిన ఆమోదాన్ని రద్దు చేయడం పైనా నిర్ణయం తీసుకోలేదన్నారు. "వీటన్నింటి పైనా కూలంకషంగా అధ్యయనం చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులకు కేంద్ర ఆమోదం ఉంది. ఈ పథకాల వల్ల రాష్ట్రానికి ఆదాయం వస్తుంది" అని చంద్రబాబు తెలిపారు. స్థానిక సంస్థల నుంచి వసూలు చేసిన సెస్‌లో కొంతభాగమే, విద్యుత్తు రంగానికి వెళ్లిందని చెప్పారు. విద్యుత్తు రంగంపై పూర్తిస్థాయి అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. మేధావులు, సామాన్యులు , మీడియా ప్రతినిధుల నుంచి దీనిపై సలహాలు తీసుకుంటామన్నారు. విద్యుత్తు రంగాన్ని గాడిలో పెట్టగల విశ్వాసం తనకుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

3.0 అమలు చేయాల్సిందే

విద్యుత్తు రంగాన్ని గాడిలో పెట్టాలంటే .. ఇప్పటిదాకా రెండుసార్లు (2001, 2014-19) అమలు చేసిన సంస్కరణల స్థానంలో 3.0ను అమలు చేయాల్సిందేనని సీఎం భావిస్తున్నారు. దీనికోసం స్వశక్తిపై విద్యుత్తు రంగం నిలబడేలా, స్థానికంగా విద్యుదుత్పత్తి సంస్థలను ప్రోత్సహించాలి. రూఫ్ టాప్ సోలార్ వినియోగాన్ని పెంచాలి. సబ్‌స్టేషన్ స్థాయిలో వ్యవసాయరంగంలోనూ సోలార్ విద్యుత్తు వాడకాన్ని, ఈవీ ప్యానళ్ల ఉత్పత్తిని, వినియోగాన్ని పెంచాలి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. గ్రిడ్ మేనేజ్‌మెంట్‌ను సమర్థంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలి. చౌకగా విద్యుదుత్పత్తిని చేసే హైబ్రీడ్, బీఈఎస్ఎస్, థర్మల్, గ్యాస్‌ఉత్పత్తి ప్లాంట్లను ప్రోత్సహించాలి. ఏపీని 'ఎనర్జీ స్టోరేజీ' రాష్ట్రంగా మార్చాలి.. ఏపీని ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దాలంటే .. ప్రకృతి ఇంధనోత్పత్తిపై దృష్టి సారించాలి.

కష్టాల కడలిలో కరెంటు

» జగన్ షాక్‌లతో కునారిల్లిన విద్యుత్ రంగం

ఐదేళ్ల జగన్ పాలనలో ఇతర రంగాల తరహాలోనే ఇంధన రంగమూ ఛిద్రమైపోయింది. రాష్ట్రం మిగులు విద్యుత్తు నుంచి.... కొంటే తప్ప కరెంటు ఇవ్వలేని దుస్థితిలోకి జారిపోయింది. జగన్ విధ్వంసకర పాలన కారణంగా ఈ రంగంపై ఏకంగా రూ.1,28,503కోట్ల భారం పడింది. విద్యుత్తు రంగంలో తనకు విశేషానుభవం ఉందని, తనకు హైడల్ పవర్ ప్రాజెక్టులు ఉన్నాయని.. వాటిని సమర్థవంతంగా నడిపానని చెప్పుకునే జగన్.. విద్యుత్తు రంగాన్ని పూర్తిగా ఛిన్నాభిన్నం చేశారు. ఇంధన రంగంపై గడచిన ఐదేళ్ల జగన్ పాలనలోని లోపాలు.. ప్రజలపై పడుతున్న భారాలను ఎప్పటికప్పుడు "ఆంధ్రజ్యోతి" ప్రచురించిన కథనాలు అక్షర సత్యాలేనని మంగళవారం ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం తేలతెల్లం చేసింది. గత ప్రభుత్వ హయాంలో పూర్తికావచ్చిన విజయవాడ థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని.. కృష్ణపట్నం థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చూపడంతో జెన్కోపై రూ.12,818 కోట్ల భారం పడింది. పోలవరం జల విద్యుత్కేంద్రం జాప్యం కారణంగా మరో 4,737కోట్ల భారం పడింది. ఈ మొత్తం పోలవరం జల విద్యుత్కేంద్రం నిర్మాణానికి అయ్యే వ్యయం కంటే రెట్టింపునకు చేరింది. స్వల్పకాలిక విద్యుత్తు కొనుగోళ్ల కారణంగా రూ.2691 కోట్ల భారం డిస్కమ్‌లపై పడింది. జగన్ అట్టహాసంగా చెబుతున్న సోలార్ పవర్ కార్పొరేషన్ ద్వారా దొడ్డిదారిని అదానీ నుంచి కొనుగోలు చేసే 7వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తుతో ఏడా 3,850కోట్ల భారం పడుతుంది. అంటే.. 25ఏళ్లకు ఏకంగా రూ.96,250కోట్లు పడుతుందని అధికారంగా ప్రభుత్వం ప్రకటించింది. విద్యుత్తు రంగంలో చేసిన అప్పులకు వడ్డీలే నెలనెలా రూ.10,892కోట్లకు చేరాయి. డిస్కమ్‌లకూ.. ఏపీపీడీసీఎల్‌కు రూ.9610కోట్ల మేర నష్టం వాటిల్లింది. థర్మల్ విద్యుత్కేంద్రాలలో ఉత్పత్తిని నిలిపివేయడం వల్ల రూ.3135కోట్ల మేర నష్టం ఏర్పడింది. విద్యుత్తు చార్జీలు పెంచడం వల్ల ప్రజలపై నేరుగా రూ.32,166 కోట్ల భారం పడింది. విద్యుత్తు సంస్థలు చేసిన రుణభారం రూ.49,596 కోట్లు కూడా వినియోగదారులపైనే పడింది.

ప్రోత్సాహకాలను రద్దుచేశారు..

జగన్ తీసుకున్న నిర్ణయాలతో విద్యుత్తు రంగం భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వచ్చింది. సోలార్, పవన విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలను జగన్ రద్దు చేశారు. దీనిని హైకోర్టు తప్పుబట్టింది. ఫలితంగా విద్యుత్తును కొనుగోలు చేయకుండానే ఒప్పందాన్ని పునరుద్ధరించాల్సి వచ్చింది. దీని వల్ల పెండింగ్ బకాయిలు చెల్లించాల్సి వచ్చింది. దీని భారం రూ.9,000 కోట్లు పడింది. విద్యుత్తు రంగంలో పునరుత్పాదక సంస్థలకు 2015 నుంచి 2018 దాకా అందించిన ప్రోత్సాహకాలను నోటి మాటతో జగన్ రద్దు చేశారు. 2018-19 మధ్యకాలంలో విద్యుత్తు పంపిణీ సంస్థల రుణాలు రూ.62,826 కోట్లు. అవి 2023-24 నాటికి ఏకంగా 1,12,422కోట్లకు చేరుకున్నాయి. క్యాపిటల్ వ్యయ రుణాలు రూ.36,792కోట్ల నుంచి రూ.46,380 కోట్లకు పెరిగాయి. ఆపరేషనల్ వ్యయ రుణాలు రూ.26,034 కోట్ల నుంచి 66,042 కోట్లకు ఎగబాకాయి. ప్రభుత్వ సబ్సిడీ రూ.7,680కోట్ల నుంచి రూ.12,681 కోట్లకు జగన్ జమానాలో పెరిగింది. ప్రభుత్వ బకాయిలు రూ.5,265 కోట్ల నుంచి రూ.15,157 కోట్లకు పెరిగాయి. ట్రూఅప్, సర్‌చార్జీల భారం రూ.17,137 కోట్లకు చేరింది. దీనిని వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సి ఉందని డిస్కమ్‌లు చెబుతున్నాయి.

స్వల్పకాలిక విద్యుత్తు కొనుగోళ్లు పెంచేశారు

రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు రాలేదు కానీ విద్యుత్తు డిమాండ్ పెరిగింది. 2018 నాటికి 3373 ఎంయూ నుంచి 11,655ఎంయూ దాకా బహిరంగ మార్కెట్లో స్వల్పకాలిక విద్యుత్తు కొనుగోలు చేశారు. దీనివల్ల రూ.43,416 కోట్ల మేర డిస్కమ్‌లపై భారం పడింది. 2018-19 నాటికి సగటున బహిరంగ మార్కెట్లో స్వల్పకాలిక విద్యుత్తును యూనిట్‌కు రూ.4.02చొప్పున కొంటే జగన్ జమానాలో రూ.7.61 చొప్పున కొన్నారు. దీనివల్ల రూ.26,030 కోట్ల భారం పడింది. స్వల్పవ్యవధిలో బొగ్గు కొన్నందున రూ.12,250 కోట్ల భారం జెన్కోపై పడింది. 2019-24 దాకా అసమర్థ పాలనతో విద్యుత్తు సంస్థలపై రూ.62,000కోట్ల భారం పడింది. జగన్ తీసుకున్న అనాలోచిత, అసమర్థ నిర్ణయాలతో డిస్కమ్‌ల నష్టాలు రూ.29,147 కోట్ల నుంచి 34,090కోట్లకు చేరాయి. కృష్ణపట్నం విద్యుత్కేంద్రం నష్టం రూ.1,565 కోట్ల నుంచి రూ.6,240 కోట్లకు చేరింది.

పెట్టుబడిదారుల్లో భయం

2019 నుంచి 2024 వరకూ జగన్ పాలనలో పెట్టుబడిదారుల్లో భయం నెలకొంది. అమరావతి పరిధిలో ఏపీ ట్రాన్స్‌కో చేపడుతున్న పనులన్నింటిని రద్దు చేశారు. దీనివల్ల 1,315 కోట్ల నష్టం వాటిల్లింది. విండ్, సోలార్ ఉత్పత్తిని నిలిపివేయడం వల్ల రూ.500 కోట్ల నష్టం ఏర్పడింది. హిందూజాకు 2020-22 మధ్య కాలంలో విద్యుత్తు చార్జీల కింద రూ.1,235 కోట్లు అదనంగా చెల్లించారు. విద్యుత్తు స్వల్పకాలిక కొనుగోళ్ల కోసం ఏపీజెన్కో థర్మల్ విద్యుత్తు ప్లాంట్లను బ్యాకింగ్ డౌన్ చేసేశారు. రూ.16,699 కోట్ల మేర విద్యుత్తు చార్జీలను జగన్ జమానాలో పెంచారు. ట్రూఅప్ చార్జీలు రెండు సార్లు రూ.5,886 కోట్లు, 3,977 కోట్లు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.5,604 కోట్లు మొత్తంగా రూ.32,166 కోట్ల భారం వేశారు.

48 గంటలు.. 25 వేల టన్నులు!

రాష్ట్రంలో జోరుగా ఉచిత ఇసుక పంపిణీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక విధానంపై ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక డిపోలు ఎన్నడూ లేనంతగా కళకళలాడిపోతున్నాయి. గత ఐదేళ్లుగా ఇసుక ధరలకు భయపడి గృహనిర్మాణం వాయిదా వేసుకున్న సామాన్యులు, బిల్డర్లు, కంపెనీలు సైతం ఈ డిపోల వద్దకు క్యూకట్టారు. కలెక్టర్లు, రెవెన్యూ అధికారుల స్వీయపర్యవేక్షణలో ఉచిత ఇసుక పంపిణీ జరుగుతోంది. గనుల శాఖ అధికార వర్గాల సమాచారం ప్రకారం.. గత 48గంటల వ్యవధిలో ఇసుక డిపోల నుంచి 25వేల టన్నుల ఇసుకను ప్రజలకు పంపిణీ చేశారు. మరో 75వేల టన్నుల కోసం వినతులు స్వీకరించారు. వాటిని బుధవారం సెటిల్ చేస్తారని తెలిసింది. ఉచిత ఇసుక మొదలైన సోమవారం లాంఛనంగా పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఆ రోజు 4,500 టన్నుల ఇసుకను పంపిణీ చేశారు. మంగళవారం 20,500 టన్నులు ఇచ్చారు. అయితే ఉచిత ఇసుక విధానంపై కొందరికి సరైన అవగాహన లేక తమ వద్ద ఫీజులు తీసుకుంటున్నారంటూ గగ్గోలు పెట్టారు. గతంలో రూ.1,300కే ఇసుక ఇస్తే, ఇప్పుడు ఎక్కువ వసూలు చేస్తున్నారని గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన ఓ వ్యక్తి సీఎస్‌కు ఫిర్యాదు చేశారు. దానికి రశీదును కూడా జతచేశారు. అది 2020లో ఏపీఎండీసీ అమ్మినప్పటిది. దానిని పరిశీలించగా, గతంకంటే ఇప్పుడు రూ.350 తక్కువ వసూలు చేసినట్లుగా ఉంది. దీంతో అధికారులు వినియోగదారుడికి ఫోన్‌చేసి స్పష్టత ఇచ్చారు. 'ఉచిత ఇసుక అంటే. ఏ రుసుము, ఫీజు, పన్నులు లేకుండా ఫ్రీగా ఇస్తారని భావిస్తున్నారు. కానీ చట్టబద్ధమైన ఫీజులు, సీనరేజీ, జీఎస్టీ వంటివి వినియోగదారుడే భరించాలి.. వారికి ఈ విషయాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలి' అని ఇసుక పంపిణీ అధికారులు గనుల శాఖకు సూచిస్తున్నారు.



బనగానపల్లెలో చంద్రబాబు చిత్రానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, టీడీపీ కార్యకర్తలు

తూర్పు స్టాక్ పాయింట్ల వద్ద టన్ను రూ.270

రాజమహేంద్రవరం/బనగానపల్లె: తూర్పుగోదావరి జిల్లాలో ఏడు స్టాక్ పాయింట్ల వద్ద ఉచిత ఇసుక పంపిణీ మొదలైంది. రేపోమాపో డీసిల్టేషన్ ర్యాంపుల్లోని ఇసుకను కూడా పంపిణీ చేయనున్నారు. ఇసుక తవ్వకం, లోడింగ్ రూ.30, రీలోడింగ్‌కు రూ.30, సీనరేజీ రూ.66, జీఎస్టీ 18శాతం, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) రూ.19.68, మెరిట్(ఖనిజాన్వేషణ నిధి) 2శాతం, ర్యాంపు నుంచి స్టాక్ పాయింట్‌కు రవాణా చార్జీలు కలిపి మొత్తం టన్ను ఇసుక ధర రూ.270గా నిర్ణయించారు. ఉచిత ఇసుక విధానం తెచ్చినందుకు మంగళవారం నంద్యాల జిల్లా బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, టీడీపీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు.

బుద్ధిజ్ఞానం లేని వింత పశువులు


» ఉచిత ఇసుకను కూడా తప్పుబడతారా?: చంద్రబాబు

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ నేతలు బుద్ధిజ్ఞానం లేని వింత పశువుల్లా ప్రవర్తిస్తున్నారని సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. చివరకు ఉచిత ఇసుక విధానాన్ని కూడా తప్పుబట్టే స్థితికి దిగజారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుకను ఉచితంగా ఇవ్వడం వల్ల మార్కెట్లో రేటు నాలుగో వంతుకు పడిపోయిందని.. దీనిని భరించలేక విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం అక్కడ అమరావతి సచివాలయంలో విద్యుత్‌పై శ్వేతపత్రం విడుదల సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో తప్పులను దిద్దుకుంటూ వస్తున్నాం. అప్పుడు ఇసుక అడ్డగోలుగా తవ్వి అమ్ముకున్నారు. మేమొచ్చి ఉచిత ఇసుక పథకం ప్రవేశపెట్టాం. ప్రభుత్వానికి ఏమీ చెల్లించాల్సిన పని లేదు. తవ్విన ఖర్చులు, రవాణా ఖర్చులు, జీఎస్టీ ఎవరైనా చెల్లించాల్సిందే కదా! దీనిని కూడా తప్పుబడుతూ వైసీపీ నేతలు రాజకీయం చేయాలని చూస్తున్నారు. ఇసుకను కావలసిన వారి ఇళ్లకు ప్రభుత్వమే తీసుకెళ్లి ఉచితంగా ఇవ్వడం సాధ్యమేనా? అన్నీ తెలిసి కూడా వింత పశువుల్లా మాట్లాడుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగోలేదు. అయినా ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచితంగా ఇసుక ఇస్తున్నాం. అది దుర్వినియోగం కాకుండా చూస్తాం' అని స్పష్టం చేశారు. వానాకాలంలో ఇసుక కొరత రాకుండా నదుల వద్ద బోటు సొసైటీలకు అనుమతులు ఇవ్వబోతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నీ వక్రమార్గం పట్టాయని, వాటిని సవ్యంగా పనిచేయించడమే తమపనిగా మారిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'అమరావతిని నాశనం చేయడానికి ఆ రాజధాని.. ఈ రాజధాని అంటూ కాలక్షేపం చేశారు. కథలు చెప్పారు. దీనివల్ల రాష్ట్రానికి లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. ఈ రాష్ట్రంలో ఒక భూతం ఉందని భయపడి ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ రావడం లేదు. దానిని శాశ్వతంగా సమాధి చేస్తామని వారికి భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నాం. ముందు నమ్మకం కలిగించాలి. మళ్లీ విచారణలు, దర్యాప్తులంటే అసలు రారు. అదీ చూడాలి' అని అన్నారు. చంద్రబాబును హెచ్చరిస్తున్నానని నెల్లూరు జైలు వద్ద జగన్ చేసిన వ్యాఖ్యల ప్రస్తావన వచ్చినప్పుడు సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. 'రాజకీయ ముసుగు వేసుకుని కరడుగట్టిన నేరస్థులు రాష్ట్రాన్ని లూటీచేశారు. ఆ డబ్బుతో వ్యవస్థలను కొంటున్నారు. ఎన్ని బెదిరింపులు, హెచ్చరికలు చేసినా నేరగాళ్ల, అవినీతిపరుల ఆటలు సాగనివ్వం. రాజకీయ ముసుగులో బెదిరిస్తే ఊరుకునేదిలేదు' అని హెచ్చరించారు. గత దుష్పరిపాలన వల్ల ఎంత నష్టం జరిగిందో తెలియడానికే ఈ కసరత్తు చేపట్టామని చెప్పారు. 'తిక్కలోడు తిరణాలకు వెళ్తే ఎక్కా, దిగా సరిపోయిందని నానుడి. అదే మాదిరిగా వైసీపీ ప్రభుత్వం దిక్కుమాలిన నిర్ణయాలతో వ్యవస్థలను నాశనం చేసింది' అని ధ్వజమెత్తారు.

5 కోట్ల మందికి ఆరోగ్య బీమా

» విధివిధానాలు రూపొందించండి

» ఆరోగ్యశాఖ అధికారులకు సీఎం ఆదేశం



అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 5కోట్ల మందికి ఆరోగ్య బీమా అమలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఆరోగ్యశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం, వాటికి గత ప్రభుత్వం చేసిన ఖర్చు, ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. అలాగే ఐదు కోట్ల మంది ప్రజలకు వైద్య బీమా అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి కుటుంబానికి రూ.25లక్షల బీమా సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. దీనిని ఎలా అమలు చేయాలన్న దానిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఇతర రాష్ట్రాల్లో పథకం అమలుపై నివేదికలు తెప్పించాలని ఆదేశించారు. మెడికల్ కాలేజీలపై సీఎం కొంత అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై భారం పడేవిధంగా వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. రూ.8,500 కోట్లతో కొత్త కాలేజీల నిర్మాణం చేపట్టి, ఇప్పటి వరకూ కేవలం రూ.1,500 కోట్లు మాత్రమే గత ప్రభుత్వం బిల్లులు విడుదల చేసిందని చెప్పారు. మిగిలిన భారం మొత్తం ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. ఒక్కో కాలేజీ నిర్వహణకు ఏటా ప్రభుత్వంపై రూ.135కోట్ల వరకూ భారం పడుతుందని తెలిపారు. పైగా ఇప్పుడు కొత్తగా నిర్మించిన కాలేజీలకు ఎన్ఎంసీ అనుమతులు ఇచ్చే పరిస్థితి కూడా లేదని వివరించారు. ప్రభుత్వంపై తలకు మించిన భారం పడుతోందని, నిర్మాణ దశలో ఉన్న కాలేజీలను ఏం చేద్దామన్న దానిపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని మంత్రి సత్యకుమార్‌కు సీఎం సూచించారు. మెడికల్ కాలేజీల విషయంలో ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి నిబంధనలు అమలవుతున్నాయో వివరాలు తెప్పించాలని సూచించారు. ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఆరోగ్యశ్రీ సీఈవో లక్ష్మీషా, డీఎంఈ డాక్టర్ నరసింహం, అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో చంద్రబాబుకు మొక్కను అందజేస్తున్న ఉన్నతాధికారులు

బ్యాంకులు చేయూతనివ్వాలి

గత ప్రభుత్వ విధానాలతో వ్యవస్థలు కుదేలు

వ్యవసాయానికి ఊతమివ్వాలి.. రైతుకు ఖర్చు తగ్గించాలి

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ భేటీలో సీఎం చంద్రబాబు

5.40 లక్షల కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక విడుదల

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల అన్ని వ్యవస్థలూ కుదేలయ్యాయి. మళ్లీ వాటిని గాడిన పెట్టేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర ప్రజలు ఈ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాటిని నెరవేర్చేందుకు తీసుకుంటున్న చర్యలకు బ్యాంకులు చేయూతనివ్వాలి. డిజిటల్ చెల్లింపులను బ్యాంకులు ప్రోత్సహించాలి. దీని వల్ల అవినీతి తగ్గుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు బ్యాంకర్లు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం అమరావతి సచివాలయం మొదటి బ్లాక్‌లో 227వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. 2024-25 సంవత్సరానికి రూ.5.40లక్షల కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా బ్యాంకులు పని చేయాలన్నారు. రైతుకు సాగు ఖర్చులు తగ్గించాలని, కౌలురైతుల రుణాల విషయంలో ఆంక్షలు తొలగించి, వారు సులభంగా రుణాలు పొందే పరిస్థితి ఉండాలని సూచించారు. దీనికోసం మంత్రులు, బ్యాంకర్లు, నిపుణులతో కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా 5 అంశాల్లో ప్రణాళికలు సిద్ధం చేసి, అమలు చేసేందుకు ఈ కమిటీ పని చేస్తుందని చెప్పారు. 'డిజిటల్ లావాదేవీల్లో ఏపీ 3వ స్థానంలో ఉంది. రానున్న రోజుల్లో ఏపీని నంబర్‌వన్‌గా నిలిచే ప్రణాళికలు అమలు చేయాలి. డిజిటల్ చెల్లింపులను బ్యాంకులు కూడా ప్రోత్సహించాలి. దీని వల్ల అవినీతి తగ్గి, ఉత్పాదకత పెరుగుతుంది. పేదరిక నిర్మూలనలో ప్రభుత్వం కొత్తగా పీ4 విధానం తీసుకువస్తుంది. పేదరిక నిర్మూలనకు సబ్ కమిటీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. యువతలో నైపుణ్యం పెంపుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. సంపద సృష్టించే రంగాలతో పాటు జీఎస్‌డీపీ పెంచే రంగాలకు బ్యాంకుల ప్రోత్సాహంపైనా సబ్ కమిటీ చర్చిస్తుంది. ఈ అంశాల్లో సత్వర నిర్ణయాలు, మెరుగైన ఫలితాలు సాధించేలా మంత్రులు, బ్యాంకర్లు, నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తాం' అని చంద్రబాబు చెప్పారు. తొలుత వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. హార్టికల్చర్, ఆక్వాకల్చర్‌కు బ్యాంకులు రుణాలిచ్చి ప్రోత్సహించాలన్నారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలను తీర్చేందుకు బ్యాంకుల సహకారం అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ భాస్కరరావు, యూనియన్ బ్యాంక్ ఈడీ సంజయ్ రుద్ర, ఇతర అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ప్రాధాన్య రంగాలకు 3.75 లక్షల కోట్లు

రాష్ట్రంలో ఈ ఏడాది ప్రాధాన్య రంగాలకు 3.75లక్షల కోట్లు ఖర్చు చేయాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయించింది. ఇది గతేడాది కన్నా 16 శాతం ఎక్కువ. ఇతర రంగాలకు రూ.లక్షా65వేల కోట్లు కేటాయించారు. మొత్తం వార్షిక ప్రణాళికలో వ్యవసాయ రంగానికి రూ.2.64 లక్షల కోట్ల రుణాలివ్వాలని నిర్ణయించగా, ఇది గతేడాది కంటే 14శాతం అధికం. డెయిరీ, పౌల్ట్రీ, మత్స్య, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ మౌలిక వసతులకు రూ.32,600కోట్లు ప్రతిపాదించారు. 2023-23లో వ్యవసాయరంగ రుణ లక్ష్యంలో 90శాతమే రుణాలు మంజూరు చేసినట్లు బ్యాంకర్లు చెప్పారు. గృహ నిర్మాణాలకు రూ.11,500 కోట్లు, సాంప్రదాయేతర ఇంధన రంగానికి రూ.8వేల కోట్లు ప్రతిపాదించారు.



టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై డీజీపీకి ఫిర్యాదు అందజేస్తున్న బుద్దా వెంకన్న

వైసీపీ హయాంలో టీడీఆర్ బాండ్ల భారీ కుంభకోణం

- జగనే సూత్రధారి ఆధారాలున్నాయి.. విచారణ జరిపించండి
- డీజీపీకి బుద్దా వెంకన్న ఫిర్యాదు

విజయవాడ(వన్‌టౌన్), జూలై 9: వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీఆర్ బాండ్ల భారీ కుంభకోణం జరిగిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న ఆరోపించారు. మంగళవారం మంగళగిరిలో డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసి ఫిర్యాదు చేశారు. తగిన ఆధారాలున్నాయని, సీఐడీతో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బుద్దా వెంకన్న మాట్లాడుతూ టీడీ ఆర్ బాండ్ల పేరిట రూ.వేల కోట్లు దోచుకున్నారని, ఇందుకు మాజీ సీఎం జగన్ సూత్రధారి అన్నారు. ప్రభుత్వం భూముల ధరలు పెంచుతున్నచోట ప్రభుత్వ స్థలం గజం రూ.2 వేల ధరతో ఎకరాలకెకరాలు వైసీపీ నేతలు కొనుగోలు చేసి రూ.30 వేలకు విక్రయించారన్నారు. భూములు కొనుగోలు చేసి బాండ్లను జారీ చేశారని, సీఎం పేషీ నుంచి కలెక్టర్లపై ఒత్తిడి తెచ్చి భూముల ధరలను పెంచేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో మంత్రి నారాయణ వచ్చాక ఈ కుంభకోణం బయట పడిందన్నారు. జగన్ దోచుకున్న లక్షల కోట్లను తిరిగి ప్రభుత్వానికి కట్టించేంతవరకు తన పోరాటం ఆగదన్నారు.

సీఎం విజన్‌పై కేంద్రానికి నమ్మకం

- గత ప్రభుత్వం నిధులను దారి మళ్లించింది
- కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం టౌన్, జూలై 9 : ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌పై కేంద్ర మంత్రులకు మంచి నమ్మకం ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈ నెల 4న చంద్రబాబు ఢిల్లీకి వచ్చినప్పుడు ప్రధాని నరేంద్ర మోదీతోపాటు, కేంద్ర మంత్రులను కలిశారు. వారంతా రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రాకు ఇచ్చిన నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించి దుర్వినియోగం చేసింది. దీంతో రాష్ట్ర పరిస్థితి దారుణంగా ఉంది. స్వల్ప సమయంలోనే కొన్ని విషయాలపై అవగాహన చేసుకున్నా. కేంద్ర మంత్రులను ఇతర అధికారులను రాష్ట్ర అభివృద్ధిపై కలిసి చర్చించాం. అందరూ సహకరిస్తున్నారు. గతంలో జరిగిన తప్పిదాలను వివరించా. ఇచ్చిన నిధుల గురించి ఆరా తీసినా వివరాలు తెలియడం లేదు. కేంద్రం ఇచ్చిన నిధులకు సంబంధించి రాష్ట్రం నుంచి యుటిలిటీ సర్టిఫికెట్ ఇవ్వవలసి ఉండగా ఇంత వరకు ఇవ్వలేదు. ఐతే ప్రస్తుతం నిధుల విషయంలో ఇబ్బందులు లేకుండా మంజూరుకు చర్యలు తీసుకోవటంతోపాటు గత నిధులకు సంబంధించిన వాటిపై విచారణ చేపట్టే అవకాశం కూడా లేక పోలేదు' అని అన్నారు. అలాగే, ప్రత్యేక హోదా, పోలవరం, స్టీల్ ప్లాంట్ తదితర విషయాలపై కేంద్ర పెద్దలతో మాట్లాతామని మంత్రి చెప్పారు.

మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు జీతాలు

- ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన ఎంఎస్‌పీటీఏ నేత

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్స్ టీచర్లకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. మోడల్ స్కూల్స్‌ను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు చేపట్టింది. ఇప్పటివరకూ ప్రత్యేక గ్రాంటు కింద జీతాలు చెల్లిస్తుండగా, ఇకపై ట్రెజరీ నుంచి చెల్లించేలా చూడాలని కోరుతూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్.. ట్రెజరీ డైరెక్టర్‌కు మంగళవారం లేఖ రాశారు. దీంతో ఇకపై 2,600 మంది టీచర్లకు ట్రెజరీ నుంచి జీతాలు అందనున్నాయి. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించినందుకు ప్రభుత్వానికి మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శివశంకర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

కేంద్రానికి పంపిన ప్రతిపాదనలు నిలుపుదల చేయమని కోరండి

- జిల్లాల పునర్విభజనను పునఃసమీక్షించాలి
- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణకు కేంద్రానికి పంపిన ప్రతిపాదనలను తక్షణం నిలుపుదల చేయమని కోరాలని, సదరు ప్రతిపాదనను పునఃసమీక్ష చేయాలని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ కోరారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నాటి ప్రభుత్వ కార్యదర్శి జవహర్‌రెడ్డి నేతృత్వంలోని కమిటీ పంపిన ప్రతిపాదనలు లోపభూయిష్టంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు. అవి ఆమోదం పొందితే వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో యువతకు ఉపాధి అవకాశాల్లో తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. 1975 నాటి ఉత్తర్వుల ప్రకారం అమల్లో ఉన్న 13 జిల్లాల స్థానంలో గత ప్రభుత్వం 26 జిల్లాలుగా పునర్విభజించి మూల సూత్రమైన విద్య, ఉపాధి అవకాశాల్లో స్థానిక రిజర్వేషన్ అంశానికి భంగం కలిగించేందిగా గత ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలు ఉన్నాయని దాని వల్ల రాష్ట్రపతి ఆమోదం పొందలేదన్నారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలోని అన్ని శాఖల్లో జిల్లా స్థాయిల్లో కలెక్టర్ కార్యాలయాలతోసహా ఉద్యోగుల కేటాయింపులు జరగక, ఇష్టానుసారంగా రాజకీయ ప్రమేయంతో 'ఆర్డర్ టూ సర్వ్' పేరుతో మీద అర్థంలేని బదిలీల ప్రహసనం కొనసాగిందన్నారు. గత ప్రభుత్వం నిబంధనలు ఏవీ పరిగణలోకి తీసుకోకుండా సహేతుకంగా, శాస్త్రీయంగా లేని జిల్లాల పునర్విభజన అంశాన్ని పునః సమీక్ష చేయాలని కోరారు. అన్ని ప్రాంతాలకు సమాన అవకాశాలు ఉండేలాగా ముఖ్యంగా రాజధాని ప్రాంతాన్ని నిర్వచిస్తూ ఈ ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణకు ప్రతిపాదనలు పంపాలని సూర్యనారాయణ కోరారు.

చెప్పిన వెంటనే సర్టిఫికెట్ ఇవ్వాల్సిందే!

- సచివాలయ ఉద్యోగిపై వైసీపీ నాయకుడి దాడి

హరిపురం, జూలై 9: తాను చెప్పిన వెంటనే కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదని సచివాలయ ఉద్యోగిపై ఓ వైసీపీ నాయకుడు దాడి చేశాడు. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా మందస మండలం లోహరిబంద సచివాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సచివాలయంలో గ్రామానికి చెందిన అందాల చందు అనే వ్యక్తి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం రెండు రోజులు కిందట దరఖాస్తు చేశారు. వాటిని పరిశీలించాలని స్థానిక వైసీపీ నేత రాపాక శేషగిరి సచివాలయానికి వచ్చి డిజిటల్ అసిస్టెంట్ షేక్ బుకారిని అడిగారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం వచ్చిందని, కుల ధ్రువీకరణ పత్రం పరిశీలిస్తానని, పది నిమిషాలు కూర్చోవాలని సదరు ఉద్యోగి చెప్పారు. దీంతో వైసీపీ నాయకుడు డిజిటల్ అసిస్టెంట్‌ను నానా దుర్భాషలాడి దాడి చేశారు. బాధితుడు షేక్ బుకారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మందస ఎస్‌ఐ అనిల్ కుమార్ తెలిపారు.

మన్యం గనులపై పంజా!

(మొదటి పేజీ తరువాయి)

సాగుతుందని ఈ సమావేశంలో తేల్చిచెప్పారు. తనకు తెలియకుండా లీజులు, పర్మిట్లు ఇవ్వడానికి వీల్లేదని తెగేసి చెప్పారు. ఈ వ్యవహారమంతా ఎలాంటి వివాదాలు, విబేధాలకు తావులేకుండా సాఫీగా సాగిపోయేలా నిర్వహించే బాధ్యతను కాకినాడకే చెందిన కీలక గనుల అధికారికి అప్పగించారు. ఈ పని సజావుగా చేస్తే పదోన్నతి కల్పించి అదే ప్రాంతంలో కొనసాగిస్తామని ఆ అధికారికి హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ పరిణామాలు ఏజెన్సీలోని గనుల లీజుదారుల గుండెల్లో అలజడి రేకెత్తిస్తోంది.

జగన్ జమానాలో ఇలా...

ఉమ్మడి గోదావరి జిల్లాలు, విశాఖ, విజయనగరంలోని అటవీప్రాంతంలో అత్యంత విలువైన లాటరైట్, బాక్సైట్‌తోపాటు రోడ్‌మెటల్ వంటి ఖనిజాల లీజులున్నాయి. బాక్సైట్ తవ్వకాలు లేవుగానీ గత జగన్ ప్రభుత్వంలో లాటరైట్ పేరిట బాక్సైట్‌ను తవ్వి వ్యాపారం చేసుకున్నారు. మట్టి తవ్వకాల పేరిట అక్రమంగా లాటరైట్‌ను తవ్వి తరలించుకుపోయారు. ఇక క్రషర్ యూనిట్లకు కొదవలేదు. దేశంలో మరెక్కడా లేని యూనిట్లు అటవీప్రాంతంలో ఉన్నాయి. వీటిపై గతంలో వైసీపీకి చెందిన ఎంపీ కుమారుడు, జగన్ ప్రభుత్వంలో పనిచేసిన ఓ ముఖ్య అధికారి కుమారుడు, మేనల్లుడు,కడప జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు అక్కడ గుత్తాధిపత్యం నడిపారు. పైసా పెట్టుబడి లేకుండా అన్ని రకాల మైన్లను తమ నియంత్రణలోకి తీసుకొని దందా నడిపారు. ఎదురుతిరిగిన వారిని బెదిరించేందుకు, భయపెట్టేందుకు అనంతపురం జిల్లా రాప్తాడుకు చెందిన ప్రజాప్రతినిధిని(ప్రస్తుతం మాజీ) మన్యంకు తీసుకెళ్లారు. అక్కడ రాయలసీమ మార్క్ సెటిల్‌మెంట్లు చేశారు. జగన్ సర్కారు ఉన్నంత వరకు ఖనిజాల తవ్వకాలు, రవాణా, క్రషర్ల యూనిట్‌ల నిర్వహణ అంతా సిండికేట్‌గా మార్చారు. జగన్ ప్రభుత్వం దిగిపోగానే వారు కనుమరుగయ్యారు. ఇప్పుడు కొత్త మనుషులు తెరమీదకు వచ్చారు.

ఇప్పుడిలా...

కాకినాడకు చెందిన సతీశ్ ఇప్పుడు మన్యంలోని మైనింగ్ వ్యాపారంపై దృష్టిసారించారు. ఈయనపై సీబీఐ, ఈడీ కేసులున్నాయి. మనీలాండరింగ్ కేసులో జైలుకు కూడా వెళ్లివచ్చారు. గత ఎన్నికల సమయంలో జనసేన తరపున పోటీసేందుకు విఫల ప్రయత్నం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సతీశ్ హల్‌చల్ చేయడం మొదలుపెట్టారు. విజయవాడలోని హోటల్‌లో ఆయన నేతృత్వంలోనే సమావేశం జరిగింది. ఆయా జిల్లాల మైన్‌ల లీజుదారులు, కాంట్రాక్టర్లు, గనులశాఖలోని కీలక అధికారులను ఈ సమావేశానికి తీసుకొచ్చారు. ఇందులో కాకినాడకు చెందిన ఓ కీలక అధికారి ముఖ్యపాత్ర పోషించినట్లు తెలిసింది. లాటరైట్, బాక్సైట్, రోడ్‌మెటల్, బిల్డింగ్‌స్టోన్, మాంగనీస్ వంటి ఖనిజాల లభ్యత, వాటి విలువ గురించి ఆ అధికారి ప్రజంటేషన్ ఇచ్చినట్లు సమాచారం. సగటున రోజుకు ఆయా ఖనిజాలపై రూ.ఐదు కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని పేర్కొన్నట్లు తెలిసింది.

టన్నుకు ఎంతిస్తారు?...

గతంలో అమలు చేసిన పాలసీ తమకొద్దని, ఆయా ఖనిజాలకు సంబంధించి టన్నుకు ఎంత ఫీజు చెల్లిస్తారో చెప్పాలని సతీశ్....విజయవాడ సమావేశంలో ప్రతిపాదించినట్లు తెలిసింది. "మీ వ్యాపారం జరగాలి. మా పని సాఫీగా సాగాలి. కాబట్టి మేం ధర నిర్ణయించం. మీరే టన్నుకు ఎంత రేటు ఇస్తారో చెప్పండి. లాటరైట్‌కు ఎంత ఇస్తారు? క్వార్ట్జ్‌కు ఎంతిస్తారు? రోడ్ మెటల్‌కు ఎంతిస్తారు? క్రషర్ యూనిట్లు నెలకు ఎంత ఇస్తాయో చెప్పండి?" అన్నట్లు తెలిసింది. కాగా, ఓ లీజుదారు ఈ మీటింగ్‌పై అసంతృప్తి వ్యక్తం చేయ గా, తాను చెప్పిందే ఇక్కడ నడుస్తుందని, తనను కాద ని వ్యాపారం చేయలేరని హెచ్చరించినట్లు తెలిసింది. ఈ సమయంలో కాకినాడకు చెందిన గనుల అధికారి జోక్యం చేసుకొని తాము అన్నీ మాట్లాడతామని సర్దిచెప్పినట్లు తెలిసింది.

ఆ వ్యక్తి గుప్పిట 65వేల టన్నుల లాటరైట్...

కాకినాడకు చెందిన సతీశ్ మైనింగ్ వ్యాపారి కాదు. ఆయనో పవర్ బ్రోకర్ అని గనుల శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈయన నియంత్రణలో 65వేల టన్నుల లాటరైట్ ఉన్నట్లు తెలిసింది. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన ఓ ప్రముఖ మైనింగ్ కంపెనీది ఆ లాటరైట్. అయితే, అది అక్రమంగా తవ్వితీసింది. దాన్ని ప్రత్తిపాడులోని ఓ డంప్‌లో నిల్వచేసినట్లు గనుల శాఖ అధికారి ద్వారా సతీశ్ తెలుసుకున్నారు. ఆ వెంటనే ఆయన గనులశాఖ అధికారుల సమక్షంలో దాన్ని తన నియంత్రణలోకి తీసుకున్నట్లు తెలిసింది. తనకు తెలియకుండా ఆ లాటరైట్ తరలించడానికి వీల్లేదని ఆయన హుకుం జారీ చేశారు. తనకు తెలియకుండా లాటరైట్ తరలింపునకు పర్మిట్లు ఇవ్వొద్దని గనుల శాఖ అధికారికి ఆయన గట్టి హెచ్చరిక చేశారని తెలిసింది.

ప్రైవేటు వర్సిటీలు ఎక్కడ?

- కౌన్సెలింగ్‌లో కనిపించని వైనం
- ఉన్నాయంటున్న అధికారులు
- ఆప్షన్ల జాబితాలో లేవంటున్న విద్యార్థులు
- ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో గందరగోళం
- కొత్త ప్రైవేటు వర్సిటీలకు ఖరారుకాని ఫీజులు

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా కొందరు అధికారుల తీరు మారలేదు. ఫలితంగా ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో గందరగోళం కొనసాగుతోంది. సోమవారం అర్ధరాత్రి ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభంకాగా ఆప్షన్ల ఎంపికలో కొత్త సమస్య మొదలైంది. నిబంధనల ప్రకారం ప్రైవేటు యూనివర్సిటీలు 35శాతం కన్వీనర్ కోటా కింద ఇవ్వాలి. గత రెండేళ్లుగా ఎస్ఆర్ఎం, వీఐటీ, అపోలో లాంటి యూనివర్సిటీలు ఈ కోటా కింద సీట్లు కేటాయిస్తున్నాయి. ఆ యూనివర్సిటీల్లో సీట్లు పొందిన విద్యార్థులు ప్రభుత్వం ఖరారు చేసిన ఫీజులు చెల్లిస్తే సరిపోతుంది. ఇప్పటివరకూ ఆరు ప్రైవేటు యూనివర్సిటీలకు గతంలో ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ ఫీజులు ఖరారు చేసింది. కొత్తగా ప్రైవేటు యూనివర్సిటీలుగా మారిన మూడు కాలేజీలకు యూనివర్సిటీ స్థాయి ఫీజులు ఖరారు చేయలేదు. దీంతో కొత్త యూనివర్సిటీలు వెబ్ కౌన్సెలింగ్‌లో కనిపించడం లేదు. మరోవైపు ఇప్పటికే ఫీజులు ఖరారు చేసిన ఆరు యూనివర్సిటీలు కూడా ఆప్షన్లు పెట్టుకునే జాబితాలో లేవు. దీంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే మంగళవారం ఉదయం దానిపై ఉత్తర్వులు వచ్చాయని, వాటిని కూడా ఆప్షన్లలో పెట్టామని సాంకేతిక విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ విద్యార్థులకు మాత్రం ప్రైవేటు యూనివర్సిటీల్లో సీట్ల కోసం ఆప్షన్లు పెట్టుకునే వీల్లేకుండా పోయింది. సాధారణంగా టాప్ ర్యాంకులు, మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులు ప్రైవేటు యూనివర్సిటీలను ఎంపిక చేసుకుంటారు. మొదటి ఆప్షన్ ప్రైవేటు యూనివర్సిటీలకు ఇచ్చి, తర్వాత మిగిలిన టాప్ కాలేజీలకు పెట్టుకుంటారు. కానీ ఇప్పుడు ప్రైవేటు కాలేజీలకు తప్ప ప్రైవేటు యూనివర్సిటీలకు ఆప్షన్లు పెట్టుకునే అవకాశమే లేకుండా పోయింది.

విద్యార్థులకు సమాచారమేదీ?

ప్రైవేటు వర్సిటీలకు ఫీజులు ఖరారు చేసి కౌన్సెలింగ్‌లో వాటిని పెట్టాలని ఎస్ఎఫ్ఐ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ మంగళవారం ఉన్నత విద్య కమిషన్ సభ్య కార్యదర్శి సూర్యచంద్రారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆప్షన్ల ఎంపికలో ప్రైవేటు వర్సిటీలు కనిపించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని, పరిష్కరించాలని కోరారు. ఆవర్సిటీల్లో 35శాతం సీట్లు దక్కేలా చూడాలన్నారు.

హాస్టల్ విద్యార్థుల్ని బిడ్డల్లా చూడాలి

- మెనూ ప్రకారమే ఆహారం ఇవ్వాలి: మంత్రి సవిత

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): 'వెనుకబడిన వర్గాల పేద తల్లిదండ్రులు ప్రభుత్వంపై నమ్మకంతో వారి బిడ్డల్ని హాస్టళ్లలో వదులు తున్నారు.. ఆ పిల్లలు మనకూ బిడ్డల్లాంటి వారే. వారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది' అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారులతో వెలగపూడి సచివాలయంలో సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వ హాస్టళ్ల నిర్వహణ బాగుదంటూనే, కొన్ని చోట్ల ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందించాలని విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. హెడ్ వార్డర్ అక్కడే ఉండి పర్యవేక్షించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాల్లో డిప్యూటీ డైరెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతి నెలా సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా డిసెంబరు నుంచి హాస్టళ్లకు డైట్, కాస్మొటిక్ చార్జీలు గత ప్రభుత్వం చెల్లించలేదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వీటినంత తొందరగా ప్రభుత్వంతో మాట్లాడి విడుదల చేయిస్తానని మాటిచ్చిన మంత్రి సవిత.. జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకొంటూ సీఎస్ఆర్ నిధులతో హాస్టళ్లలో మెరుగైన కల్పించుకోవాలని సూచించారు.

ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రాపై అధ్యయనం

- జోన్ల వారీగా సీఆర్‌డీఏ కసరత్తు
- ఏజెన్సీలకు అప్పగించిన పనుల స్థితిగతుల పరిశీలన
- జరిగిన నష్టం, చేపట్టాల్సిన పనుల అంచనాలపై కసరత్తు
- మేఘా, ఎల్‌అండ్‌టీ, ఎన్‌సీసీ, బీఎస్ఆర్ఐఎల్ సంస్థల భాగస్వామ్యం
- ఆయా సంస్థలతో గత టీడీపీ ప్రభుత్వంలోనే ఒప్పందం
- అన్ని జోన్లలో అభివృద్ధి చేయాల్సిన ప్లాట్లు 67,912
- వారం పది రోజుల్లో ప్రభుత్వానికి సమగ్ర నివేదిక

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంటోంది! రాజధానిగా అమరావతి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టిన ప్రభుత్వం ఆ దిశగా ఒక్కో అడుగు ముందుకు వేస్తోంది. ఇందులో భాగంగా రాజధానిలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్‌పీఎస్) ఇన్‌ఫ్రా పనులకు సంబంధించిన అంశాలపై సీఆర్‌డీఏ అధికారులు దృష్టి సారించారు. జోన్ల వారీగా ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా తాజా పరిస్థితులపె అధ్యయనం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా పనులకు సంబంధించి చేపట్టిన పనులు, ఆ తర్వాత వాటి పురోగతి, కిందటి వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పరిస్థితి, తాజా పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా వైపు అడుగులు వేయటానికి అవసరమైన సన్నద్ధతకు సీఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రాకు ప్రయారిటీ సెక్టార్స్‌గా నిర్దేశించుకున్న మొత్తం 15 జోన్లకు సంబంధించి ఏయే ఏజెన్సీలకు పనులు అప్పగించారు? వాటి ప్రాజెక్టు వ్యయం ఎంత? ఎంతవరకు పనులు చేశారు? రోడ్ల పనులు ఎంత మేర చేశారు? వాటర్ సప్లై, వరద నీటి మళ్లింపు కాల్వలు (స్ట్రామ్ వాటర్ డ్రెయిన్స్), సీవరేజీ పనులకు సంబంధించి ఆయా జోన్ల వారీగా బ్యాలెన్స్ వర్క్స్ ఎంత మేర మిగిలి ఉంది? గతంలో చేపట్టినవి ఎంత మేర డ్యామేజీ అయ్యాయి? వాటి నష్టం ఎంత? బ్యాలెన్స్ పనుల తాజా అంచనా వ్యయం ఎంతవుతుంది? వంటి అంశాలపై సీఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారులు అధ్యయనం చేస్తున్నారు. సీఆర్‌డీఏ కమిషనర్ భాస్కర్ నేతృత్వంలో ఒక్కో ఇంజనీరింగ్ ఉన్నతాధికారి కొన్ని జోన్ల అధ్యయన బాధ్యతలు తీసుకున్నారు. ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా విషయానికి వస్తే .. అమరావతి రాజధానిలో భూ సమీకరణ కింద భూములిచ్చిన రైతులకు వారి ప్యాకేజీ కింద అప్పగించాల్సిన ప్లాట్ల లే అవుట్లను అభివృద్ధి చేయటం కోసం ప్రాధాన్యత క్రమంలో మొత్తం 15 జోన్లను నిర్దేశించారు. జోన్-1 ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా కింద నెక్కల్లు, శాఖమూరు (పార్ట్) లలో చేపట్టాల్సిన పనులను మేఘాకు, జోన్-2 ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా కింద అనంతవరం, నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరు (పార్ట్)పనులను బీఎస్ఆర్ఐఎల్ సంస్థకు జోన్-3 కింద నేలపాడు, శాఖమూరు, కొండమరాజుపాలెం, రాయపూడి (పార్ట్)లలో ఎన్‌సీసీ, జోన్-4 కింద పిచ్చుకలపాలెం (పార్ట్), తుళ్లూరు (పార్ట్), అనంతవరం (పార్ట్)లలో బీఎస్ఆర్ఐఎల్, జోన్-5ఏ, 5బీ, 5సీ, 5డీ కింద అబ్బరాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, తుళ్లూరు (పార్ట్), పిచ్చుకల పాలెం (పార్ట్), అమనంతరం (పార్ట్), రాయపూడి (పార్ట్) లను మేఘా సంస్థకు, జోన్ - 6, 7 కింద కొండమరాజు పాలెం, రాయపూడి (పార్ట్), లింగాయపాలెం (పార్ట్), ఉద్దండ్రాయునిపాలెం (పార్ట్), వెలగపూడి(పార్ట్), మందడం (పార్ట్)లను ఎల్‌అండ్‌టీ సంస్థకు, జోన్-9, 9 ఏల కింద లింగాయపాలెం (పార్ట్), మల్కాపురం (పార్ట్), మందడం (పార్ట్), శాఖమూరు (పార్ట్), ఐనవోలు (పార్ట్), నేలపాడు (పార్ట్), కొండమరాజు పాలెం (పార్ట్), వెలగపూడి (పార్ట్) పనులను మేఘాకు, జోన్ -10 కింద ఐనవోలు (పార్ట్), క్రిష్ణాయపాలెం(పార్ట్), వెంకటపాలెం (పార్ట్), మల్కాపురం (పార్ట్)లలో ఎల్‌అండ్‌టీ, జోన్-12 కింద కురగల్లు, నవులూరు, నిడమర్రులను ఎన్‌సీసీ, జోన్ - 12 ఏ కింద కురగల్లు(పార్ట్), నిడమర్రు (పార్ట్) ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా పనులను ఎల్‌అండ్‌టీ సంస్థకు అప్పగించారు. అన్ని జోన్లు కలిపితే మొత్తం 67,912 ప్లాట్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రాధాన్యత క్రమంలో నిర్దేశించుకున్న జోన్లకు మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.16,132 కోట్ల వ్యయమవుతుందని నిర్ణయించారు. ఆయా ఏజెన్సీలతో రూ.12,629 కోట్లతో చేపట్టేలా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. టెండర్ల ప్రకారం పనులు ఎంత వరకు జరిగాయి? ఇంకా ఎంత మేర జరగాల్సి ఉంది? అంచనా వ్యయం ఎంత అవుతుంది? వంటి అంశాల మీద సీఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారులు సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. వారం పది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి సీఆర్‌డీఏ కమిషనర్ ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించనున్నారు.



టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో...

హైకోర్టుకు తలశిల, అవినాశ్

- ముందస్తు బెయిల్ కోసం అభ్యర్థన.. విచారణ నేటికి వాయిదా



అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి వ్యవహారంలో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, వైసీపీ నేత దేవినేని అవినాశ్ దాఖలు చేసిన పిటిషన్లు మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చాయి. దేవినేని అవినాశ్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ స్పందిస్తూ... అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామన్నారు. దీనిపై అత్యవసరంగా విచారణ జరపాలని అభ్యర్థించారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... 'పిటిషనర్లు చెబుతున్నట్లు ఇదేమీ చిన్న వ్యవహారం కాదు. 2021లో అప్పటి అధికార పార్టీ ప్రోద్బలంతో టీడీపీ కార్యాలయంపై వందల మంది దాడి చేశారు. ఈ దాడి ఘటన మొత్తం 6 సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. మరో వ్యాజ్యం బుధవారం విచారణకు రానుంది. ప్రస్తుత వ్యాజ్యాలను కూడా ఆ పిటిషన్‌కు జత చేయాలి' అని కోరారు. సీనియర్ న్యాయవాది స్పందిస్తూ... వ్యక్తిగత కారణాల వల్ల బుధవారం తాను విచారణకు హాజరుకాలేనని, తన వాదనలు వినాలని అభ్యర్థించారు. అభ్యర్థనను పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్, అవినాశ్ వ్యాజ్యంపై మధ్యాహ్నం విచారించారు. సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్ వాదనలు వినిపించారు. 'కేసులో ఇతర నిందితుల వాంగ్మూలం ఆధారంగా పిటిషనర్‌పై కేసు నమోదు చేశారు. పిటిషనర్ ప్రోత్సాహంతోనే టీడీపీ ఆఫీసుపై దాడి జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవు. ఫిర్యాదుదారుడికి అయ్యింది సాధారణ గాయమేనని డాక్టర్లు సర్టిఫికేట్ ఇచ్చారు. ఘటన జరిగిన రెండేళ్ల తరువాత పోలీసులు హైప్రొఫైల్ కేసుగా మార్చారు. కేసులో ఇతర నిందితులకు సీఆర్పీసీ సెక్షన్41(ఏ) నోటీసులు ఇచ్చి పిటిషనర్‌కు ఇవ్వలేదు. అరెస్ట్ చేయాలనే ఉద్దేశంతోనే ఇలా వ్యవహరించారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని పిటిషనర్‌కు అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలి' అని కోరారు. పిటిషనర్ తరఫు వాదనలు ముగియడంతో పోలీసుల తరఫు వాదనలు కోసం న్యాయమూర్తి విచారణను నేటికి వాయిదా వేశారు. మరోవైపు వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌పై కేసుకి సంబంధించి వివరాలు సమర్పించాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు. విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టుకు జోగి రమేశ్

సీఎం చంద్రబాబు నివాసంపై మూకదాడి వ్యవహారంలో తాడేపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ మంత్రి జోగి రమేశ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిపిన హైకోర్టు కేసుకి సంబంధించి పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

శిరోముండనం కేసులో ట్రయల్ కోర్టు రికార్డును మా ముందు ఉంచండి

- రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం..శిక్షపై స్టే ఉత్తర్వులు పొడిగింపు

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): దళిత యువకులకు శిరోముండనం ఘటనలో వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఇతర దోషులకు సంబంధించి ట్రయల్ కోర్టు వద్ద ఉన్న రికార్డు తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. త్రిమూర్తులుతో పాటు ఎనిమిది మందికి ఏడాదిన్నర పాటు జైలు శిక్ష విధిస్తూ ట్రయల్ కోర్టు విధించిన శిక్ష అమలుపై స్టే ఇస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పొడిగించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో దోషులకు విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఏడాదిన్నరపాటు జైలుశిక్ష తోపాటు రూ.42 వేలు జరిమానా విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరో 8 మంది హైకోర్టులో అప్పీల్ వేశారు. ఈ వ్యాజ్యాలు ఇటీవల విచారణకు రాగా బాధితుల తరఫు న్యాయవాదులు అజయ్, జవ్వాజి శరత్‌చంద్ర, వై కోటేశ్వరరావు, పిచ్చుక శ్రీనివాసరావు వాదనలు వినిపిస్తూ.. ట్రయల్ కోర్టు శిక్షపై మధ్యంతర స్టేను ఎత్తి వేయాలని అనుబంధ పిటిషన్ వేశామన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టు వద్ద ఉన్న రికార్డును తమ ముందుంచేలా చూడాలని రిజిస్ట్రీని ఆదేశించారు. విచారణను 29కి వాయిదా వేశారు.

27మంది ఇంజనీర్లకు పూర్తి అదనపు బాధ్యతలు

- జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వు

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖలో 27 మంది ఇంజనీర్లకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వు జారీ చేశారు. నూజివీడు క్వాలిటీ కంట్రోల్ అండ్ క్వాలిటీ అస్యూరెన్స్ సూపరింటెండెంట్ ఎస్. పుల్లారావుకు ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీరుగానూ, విజయవాడ పీపీఎంయూ సూపరింటెండింగ్ ఇంజనీరు కె. నాగరాజుకు అనంతపురం హెచ్ఎన్ఎస్ఎస్ చీఫ్ ఇంజనీరుగానూ పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టారు. విజయవాడ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో సూపరింటెండింగ్ ఇంజనీరుగా పనిచేస్తున్న కె.రవిని ఒంగోలు ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరుగా నియమించారు. ఏలూరులో నీరు-ప్రగతి విభాగం ఎస్ఈగా పనిచేస్తున్న వైశ్రీనివాస్‌కు విజయవాడ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ సీఈగానూ, అనంతపురం సర్కిల్ డిప్యూటీ ఎస్ఈ జి. విశ్వనాథరెడ్డికి అనంతపురం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ధవళేశ్వరం క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్‌లో ఈఈగా పనిచేస్తున్న సీహెచ్ నరసింహరాజును ధవళేశ్వరం సర్కిల్ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా నియమించారు. చిత్తూరు ఇరిగేషన్ సర్కిల్ ఈఈగా పనిచేస్తున్న డి.మదన్‌గోపాల్‌కు తిరుపతి తెలుగుగంగ, జీఎన్ఎస్ఎస్ ఎస్ఈగానూ, ధవళేశ్వరం పీఐపీ యూనిట్ ఈఈ వి.రామచంద్రరావుకు ధవళేశ్వరం మెకానికల్ సర్కిల్ ఎస్ఈగానూ, ఏలూరు ఇరిగేషన్ సర్కిల్‌లో ఈఈగా పనిచేస్తున్న సీహెచ్ దేవప్రకాశ్‌కు ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగానూ, కడప ఇరిగేషన్ సర్కిల్ ఈఈ ఎన్.రవికిరణ్‌ను కడప కన్‌స్ట్రక్షన్ సర్కిల్ ఎస్ఈగానూ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే కడప ఎస్‌కేడీ జీఎన్ఎస్ఎస్ ఈఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్వీ రాజేంద్రప్రసాద్‌కు తిరుపతి క్వాలిటీ కంట్రోల్, డిజైన్స్ విభాగం ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. విజయవాడ ఇరిగేషన్ సర్కిల్‌లో ఈఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న టి. గిరిధరరావును విజయవాడ ఈఈతో పాటు అంతర్రాష్ట్ర జల వ్యవహారాల డిప్యూటీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. పులివెందుల జీకేఎల్ఐ డివిజన్ డీఈఈ సుంకర రవిచంద్రన్‌కు కడప సర్కిల్-3 జీఎన్ఎస్ఎస్ ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కడప సర్కిల్ డీఈఈగా పనిచేస్తున్న కె.ధనుంజయులుకు తిరుపతి క్వాలిటీ కంట్రోల్ ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. వీరితోపాటు మరికొందరు ఇంజనీర్లకు ఈఈలుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వు ఇచ్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 10 జూలై 2024

విన్నర్

తండ్రికి తగ్గ తనయ

వారసత్వం అంటే పెద్దల వ్యాపారాన్ని కొనసాగించడం... ఆస్తులను పంచుకోవడం మాత్రమే కాదు... వారు నిర్దేశించిన విలువలు, వ్యక్తిత్వాన్ని కూడా స్ఫూర్తిగా తీసుకోవడం. ఆ దారిలోనే అడుగులు వేస్తున్నారు రోష్నీ నాడార్ మల్హోత్రా. చైర్‌పర్సన్‌గా 'హెచ్‌సీఎల్ టెక్నాలజీస్'ను విజయపథాన నడిపిస్తున్న ఆమె... తాజాగా ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారమైన 'నైట్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ హానర్'ను అందుకున్నారు. బిజినెస్ పరంగానే కాదు... నిరాడంబరమైన జీవన శైలిలోనూ తండ్రిని అనుసరిస్తూ... నేటి తరానికి ప్రేరణగా నిలుస్తున్నారు 43 ఏళ్ల రోష్నీ.



చదువుకొనే రోజుల్లో రోష్నీ నాడార్‌కు తన కుటుంబం ఎంత సంపన్నమైనదో తెలియదు. తండ్రి శివ్‌నాడార్ నుంచి 'హెచ్‌సీఎల్ టెక్నాలజీస్' పగ్గాలు చేపట్టాకనే తమకు ఎంత సంపద ఉందో అర్థమైందని ఓ సందర్భంలో చెప్పారు రోష్నీ. ఢిల్లీలో పెరిగిన ఆమె అక్కడి 'వసంత్ వ్యాలీ స్కూల్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశారు. అమెరికాలోని 'నార్త్ వెస్ట్రన్ యూనివర్సిటీ' నుంచి రేడియో, టీవీ, ఫిలిమ్ సబ్జెక్ట్‌లుగా కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ పట్టా పొందారు. నిజానికి అప్పటికి ఆమె మనసు వ్యాపార రంగాన్ని కోరుకోలేదు. మీడియాలో రంగంలోకి వెళదామనుకున్నారు. 'అందుకు నాన్న ఏ మాత్రం అభ్యంతరం చెప్పలేదు. ఆయనే మంచి యూనివర్సిటీ చూసి పెట్టారు. డిగ్రీ తరువాత రెండేళ్లు లండన్‌లోని ఓ చానల్‌లో న్యూస్ ప్రొడ్యూసర్‌గా చేశాను. కొంతకాలం నాకు నచ్చిన రంగంలో ఉన్నాక... 'కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్'లో ఎంబీఏ చదివా. భారత్‌కు తిరిగివచ్చి మా హెచ్‌సీఎల్‌లో సాధారణ ఉద్యోగిగా చేరా' అంటున్న రోష్నీ... కంపెనీలో వివిధ హోదాల్లో పని చేశారు. అంచలంచెలుగా ఎదిగి 2020లో 'హెచ్‌సీఎల్ చైర్‌పర్సన్'గా తండ్రి నుంచి పూర్తి స్థాయి పగ్గాలు అందుకున్నారు. భారత్‌లో లిస్ట్ అయిన ఒక ఐటీ కంపెనీకి తొలి మహిళా సారథిగా చరిత్ర సృష్టించారు.

సంచలనాలకు కేరాఫ్...

చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టకముందు రోష్నీ... తమ 'శివ్ నాడార్ ఫౌండేషన్' ట్రస్టీగా ఉన్నారు. తన ఆధ్వర్యంలో ఫౌండేషన్ కింద అత్యున్నత ప్రమాణాలతో పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పారు. చెన్నైలోని 'శ్రీ శివసుబ్రహ్మణ్య నాడార్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్' వాటిల్లో ఒకటి. ఇది లాభాపేక్ష లేని విద్యా సంస్థ. ఆమె పర్యావరణ ప్రేమికురాలు కూడా. 2018లో 'ది హ్యాబిటాట్స్ ట్రస్ట్' నెలకొల్పారు. వన్యప్రాణులు, వాటి ఆవాసాలను పరిరక్షించేందుకు కృషి చేస్తున్నారు. దీని కోసం వివిధ వన్యప్రాణి సంరక్షణ సంస్థలతో కలిసి పని చేస్తున్నారు. 2019లో 'ఫోర్బ్స్ ప్రపంచ అత్యంత శక్తిమంతులైన 100 మంది మహిళలు' జాబితాలో స్థానం సంపాదించారు. 2022లో దేశంలోని అత్యంత సంపన్న మహిళగా నిలిచి మరో ఘనత సాధించారు. ఐఐఎఫ్ఎల్ వెల్త్ హురున్ విడుదల చేసిన జాబితా ప్రకారం... 2021లో ఆమె నికర సంపద 54 శాతం పెరిగి, 84,330 కోట్లకు చేరింది. కంపెనీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆమె సంచలనాలకు కేంద్ర బిందువు వయ్యారు.

నాన్న బాటలో పయనం...

రోష్నీకి భారతీయ కళలన్నా ఎంతో మక్కువ. చిన్నప్పుడు శాస్త్రీయ సంగీతాన్ని అభ్యసించారు. 2010లో శిఖర్ మల్హోత్రాను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.

'ఇద్దరికీ తెలిసిన స్నేహితుల ద్వారా ఢిల్లీలో తొలిసారి శిఖర్‌ను కలిశాను. ఎందుకు చూడగానే తనే నా ఆత్మీయ నేస్తం అనిపించింది. ఏడేళ్ల స్నేహంలో ఒకరినొకరం పూర్తిగా అర్థం చేసుకున్నాకే పెళ్లి చేసుకున్నాం. ప్రస్తుతం ఆయన మా సంస్థ వైస్‌చైర్మన్‌గా ఉన్నారు' అంటూ ఓ సందర్భంలో నాటి రోజులు గుర్తు చేసుకున్నారు రోష్నీ. వీరికి ఇద్దరు పిల్లలు.

ఎంత ఎదిగినా ఒదిగి ఉండే తత్వం ఆమెది. విందులు, వినోదాలకు దూరం. 'ధనవంతుల ఇంట పుట్టి ఒక సాధారణ అమ్మాయిలా ఎలా ఉంటావు' అని ఆమెను బంధువులు, స్నేహితులు అడుగుతుంటారు. 'నాన్న నుంచి నిరాడంబరత నేర్చుకున్నా. అందుకే నగలు, ఖరీదైన వాచీలు, దుస్తులు ధరించడం నాకు అస్సలు ఇష్టం ఉండదు. చిన్నప్పటి నుంచీ నేను ఇంతే. సాదాసీదాగా ఉంటాను. పరోపకార గుణమే గొప్ప ఆభరణమనేది నా నమ్మకం'... ఇదీ వారికి ఆమె ఇచ్చే సమాధానం. తండ్రి వ్యాపారాన్నే కాదు, ఆయన వ్యక్తిత్వాన్నీ పుణికిపుచ్చుకున్నారు రోష్నీ.

ఎంతో ప్రతిష్టాత్మకం...

ఒక ఇల్లాలిగా, తల్లిగా, ఐటీ కంపెనీ యజమానిగా... భిన్న పాత్రల్లో ఒదిగిపోయిన రోష్నీని ఎన్నో అవార్డులు వరించాయి. తాజాగా ఫ్రాన్స్ దేశ అత్యున్నత పౌర పురస్కారం అయిన 'నైట్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ హానర్'ను అందుకున్నారు. భారత్‌లోని ఫ్రాన్స్ రాయబారి నుంచి ఈ అవార్డును స్వీకరించారు. వ్యాపార, సామాజిక, పర్యావరణ పరంగా అందించిన సేవలు, ఇరు దేశాల ఆర్థిక సంబంధాలను ప్రోత్సహించేందుకు సాగించిన నిర్విరామ కృషికి గానూ ఆమెకు ఈ అవార్డును ప్రకటించారు.

'ఈ పురస్కారం దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను' అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేసిన రోష్నీ... పేరుకు తగ్గట్టుగానే ఆమె ఎక్కడుంటే అక్కడ వెలుగు రేఖలు ప్రసరిస్తున్నాయి. •

పాట కోసమే ప్రయాణం



ఆమె పాటల ప్రవాహం. పేరు వరలక్ష్మి నారాయణమ్. ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కీర్తనలు, భక్తిగీతాలు ఆలపించే గాయని. ఇందిరా గాంధీ, ఎన్టీయార్.. లాంటి ప్రముఖుల సమక్షంలో పాటలు పాడారు. ఒక్కమాటలో చెప్పాలంటే... అరవై ఏళ్లుగా అలుపెరగని స్వరం ఆమెది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని 108 గుళ్లలో భక్తిగీతాలు పాడటానికి నడుం కట్టిన వరలక్ష్మి నారాయణమ్‌ను 'నవ్య' పలకరిస్తే.. తన ప్రయాణాన్ని చెప్పుకొచ్చారిలా..

మేం ఇప్పుడు ముంబైలో ఉంటున్నాం. ఇక్కడ ప్రముఖ దేవాలయాల్లో భక్తిగీతాలు పాడుతున్నా. ముఖ్యంగా మహారాష్ట్రలోని గుళ్లలో హిందీ ఎక్కువగా అర్థం అవుతుంది కాబట్టి హిందీలోనే పాడుతున్నా. ఇక్కడి తెలుగువారిని ఓ బృందంగా చేసి.. వారికి పాటలు నేర్పించి.. కార్యక్రమాలు చేస్తున్నా. ఇలా చేయటమే నాకు పరమానందం!

పసి వయసులోనే పాటల ప్రేమలో..

మాది మంగళగిరి. మా నాన్నగారి పేరు శ్రీభాష్యం నరసింహమూర్తి. గుంటూరు- విజయవాడ మధ్యలో నంబూరు అనే ఊరి దగ్గర 'హేమలత టెక్స్‌టైల్స్'లో మా నాన్నగారు ఉద్యోగం చేసేవారు. అలా ఆ సంస్థ వార్షికోత్సవ సందర్భాన.. 'లవకుశ' చిత్రంలోని రెండు పాటల్ని పాడాను. నా తాళ జ్ఞానం చూసి సభికులు అందరూ ఆశ్చర్యపడ్డారు. ఎంతో ప్రశంసించారు. ఎందుకంటే.. అప్పుడు నా వయసు కేవలం ఐదేళ్లు. వాస్తవానికి నేనక్కడా పాటలు నేర్చుకోలేదు. గురువే లేరు. మా ఇంట్లోని 'ఆకాశవాణి.. విజయవాడ కేంద్రం' అని పలికే మా రేడియోనే నా తొలి గురువని చెప్పొచ్చు. ఎందుకో తెలీదు.. పాటంటే మహా పిచ్చి. ఒకసారి వింటూనే బాణీతో సహా నేర్చుకునేదాన్ని. పుస్తకంలో రాసుకుని మరీ పలుమార్లు సాధన చేసేదాన్ని. పాడమని నన్నడగవలెనా.., నాదీ ఆడజన్మేనా.., నీ లీల పాడెద దేవా.. లాంటి ఎంతో మంచి పాటలు పాడేదాన్ని. ప్రతి పాటల పోటీలో.. దాదాపు మొదటి బహుమతి అందుకునేదాన్ని. ఇందుకోసం తెలివిగా చాలా కష్టమైన పాటలనే ఎంచుకునేదాన్ని.

అలా రేడియోతో అనుబంధం..

అందరిలా కాకుండా.. కాస్త విభిన్నంగా ఇంటర్‌లో 'మ్యూజిక్ గ్రూప్' తీసుకున్నా. అయితే.. కమర్షియల్ సినిమా పాటల జోలికి నేనేనాడూ పోలేదు. లలిత గీతాలు, ప్రార్థనా గీతాలు, లైట్ మ్యూజిక్ పాటలు పాడేందుకు కృషి చేశా. వందల్లో బహుమతులు గెలుచుకున్నా. ఇంట్లో వారి ప్రోత్సాహంతో పాటు ప్రశంసలూ.. పాట మీద మరింత మక్కువను పెంచాయి. 1970 లో అనుకుంటా.. విజయవాడ రేడియో స్టేషన్‌కు ఆడిషన్‌కు వెళ్లా. అక్కడ నుంచి కొన్నేళ్లపాటు విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ రేడియో స్టేషన్లలో లైట్ మ్యూజిక్ పాటలతో పాటు ఈ మాసపు పాట.. పాడేదాన్ని. అప్పట్లో ఈ మాసపు పాట.. పాడటమంటేనే గొప్ప విషయం. అరుదైన అవకాశమది. మూన్నెళ్లకోసారి ఈ అవకాశం వచ్చేది. ఆ తర్వాత టేప్ రికార్డర్‌ను బాగా ఉపయోగించుకున్నా. నేను పాడిన పాటలు, మ్యూజిక్ చేసిన పాటల్ని క్యాసెట్స్‌లో రికార్డు చేశా. తిరుపతిలో.. అక్కడి వేదపాఠశాలలో గోవిందనామాలతో మొదలెట్టి తిరుప్పావై పాశురాలు పాడిన క్షణాలు గొప్పవి!

ఆయనే నా బలం..

బి.ఈడీ చేసినా.. టీచరు ఉద్యోగానికి పోలేదు. ఎందుకంటే గొంతు పోతుందని! మా మేనత్త కొడుకుతోనే పెళ్లయింది. ఆయన పేరు ఎస్.ఎ.ఐ.ఎన్. మూర్తి. కెమిస్ట్రీ లెక్చరర్‌గా ఉద్యోగం చేసేవారు మా. పెళ్లయ్యాక.. ఇంట్లో బంధువుల పిల్లలు ఉండేవారు. వారు చదువుకునేవారు. 'మనమే కాదు మన పిల్లలూ బాగుపడితేనే.. మనం బాగుపడినట్లు' అనేవారాయన. ఇకపోతే.. ఫంక్షన్లకు పాటలు పాడటానికి వెళ్లేదాన్ని. పిల్లలు పుట్టాక కూడా.. ఈ పాటలెందుకూ? అని ఏనాడూ అనలేదు. పైగా 'పాటంటే నీకు ఇష్టం. హాయిగా పాడుకో' అనేవారు. తన ఖాళీ సమయంలో నాతో పాటు వచ్చి.. కొన్ని కార్యక్రమాలకు స్వయంగా ఆయనే వ్యాఖ్యానం చేసేవారు. ఆ తర్వాత నేను ఆలపించేదాన్ని. కొన్నాళ్ల తర్వాత.. నేనే వ్యాఖ్యానం చేయటం అలవాటు చేసుకున్నా. ఒకసారి కొందరు మహిళలంతా కలసి 'ఘంటసాల జయంతి చేద్దా'మని అడిగారు. వాళ్లంతా కూనిరాగం తీసేవాళ్లే. కొన్ని రోజుల పాటు వారితో సాధన చేయించా. దాదాపు వంద మందికి పైగా వేదికను ఎక్కించి ఘంటసాల (జానపద, ప్రేమ, హుషారు, భక్తి గీతాలు) పాడించాను. ఆ రోజు.. వారి ఆనందానికి హద్దుల్లేవు. నాకు ఒక కూతురు, ఒక కొడుకు. దురదృష్టవశాత్తు చిన్న వయసులోనే బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయింది. ఆ విషాదాన్ని తట్టుకోలేకపోయా. గంటల పాటు ఏడ్చేదాన్ని. ఇలా అయితే ఇబ్బందని గ్రహించి.. మా ఆయన తోడుగా నిలిచారు. కావాలనే నిర్వాహకులతో మాట్లాడి.. పాటల కార్యక్రమాలకు నన్ను తీసుకెళ్లారు. అలా విషాదాన్ని మెల్లమెల్లగా మర్చిపోయా. ఆ సమయంలో చాలామంది బతకను అనుకున్నారు. అయితే నాకు పాటే ఊపిరి అయ్యింది.. పాటే బతుకయ్యింది.

నేనేనా అనిపిస్తుంది..

మా వారి ఉద్యోగ బదిలీ.. నా కొడుకు చదువుల నిమిత్తం కోసమై మచిలీపట్నం, విజయవాడ, తిరుపతికి మకాం మార్చాం. కొన్ని పదుల ఏళ్ల నుంచీ.. తిరుపతే మా ఇల్లుగా మారిపోయింది. ఆ రోజుల్లో.. ఆర్కెస్ట్రా తీసుకుని వెళ్లి.. తిరుపతిలోని గుళ్లన్నీ తిరిగి పాటలు పాడటం ఇబ్బందితో కూడుకున్నదే. పాటమీద గౌరవం, భక్తి కాబట్టే కష్టాన్నయినా ఇష్టంగా భరించా. వేల కిలోమీటర్లు తిరిగా. అన్నమాచార్య కీర్తనలు, వేంకటేశ్వర స్వామివారి పాటలు, మంగళ హారతులు, ప్రార్థనా గీతాలను ఎక్కువగా పాడేదాన్ని. దేశంలోని 150 పుణ్యక్షేత్రాల్లో భక్తి గీతాలు పాడే గొప్ప అవకాశం నాకే లభించింది. 35 మంది పీఠాధిపతుల సమక్షంలో ఆలపించాను. భక్తిగీతాలు పాడటానికి సింగపూర్, మస్కట్, నేపాల్, దుబాయ్ దేశాలకూ వెళ్లాను. తరిగొండ వెంగమాంబ పాటల్ని సప్తగిరి టీవీ ఛానల్‌లో తొలిసారి పాడింది నేనే. రేడియో, టీవీల్లో పదుల సంవత్సరాలనుంచీ పాడుతున్నా విసుగేరాదా? అని కొందరు అడుగుతుంటారు. 'కొన ఊపిరి వరకూ పాడుతా' అంటుంటా వారితో. అప్పట్లో సినిమా ఫంక్షన్లలో.. కార్యక్రమానికి ముందు భక్తిగీతం నేను పాడితే అదో సెంటిమెంట్‌గా భావించేవారు. ఎన్టీయార్, ఏఎన్నార్, రాజబాబు, జమున, జయప్రద, దాసరి..లాంటి వారి ముందు నా గానం ఆలపించాను. ఇందిరా గాంధీ, సంజయ్ గాంధీ.. దగ్గర నుంచి రోశయ్యగారి దగ్గర వరకూ ఎంతో మంది రాజకీయ నాయకుల కార్యక్రమాల్లో పాడాను. దాదాపు అందరూ నా గొంతును మెచ్చుకున్నవారే. అరవయ్యేళ్లు వెనక్కి తిరిగి చూస్తే నేనేనా ఈ పాటలు పాడింది అనిపిస్తుంది.

• రాళ్లపల్లి రాజావలి



అదే నా లక్ష్యం!

ప్రస్తుతం మా కొడుకుతో కలసి ముంబైలో ఉంటున్నాం. ఇక్కడ కూడా వివిధ రంగాల్లో పని చేసే మహిళలను.. ఒక్క తాటిపైకి తీసుకొచ్చి.. శిక్షణ ఇచ్చి.. తీర్చిదిద్ది.. దేవాలయాల దగ్గర భక్తి పాటలు పాడిస్తున్నా. ఇలా ఒక్క రూపాయి కూడా ఆశించకుండా ఈ పని చేయటం..నాకెంతో సంతృప్తినిస్తుంది. గుళ్ల దగ్గర భరతనాట్యం చేయాలని ఆసక్తి చూపే వారితో ప్రోగ్రామ్స్ చేయిస్తా. ఇలా మహిళల ప్రతిభను ప్రోత్సహిస్తుంటా. వేంకటేశ్వర స్వామి, రాఘవేంద్రస్వామి, షిరిడీ సాయి మీద సొంతంగా పాటలు చేశా. అన్నట్లు అరవై ఐదేళ్ల వయసులో ఇంత వేగంగా పని చేస్తున్నానంటే.. ఇప్పుడు ఆర్కెస్ట్రా సహకారం అవసరం లేదు. ఎందుకంటే.. నేను పాడే పాటలన్నింటికీ ట్రాక్ చేయించుకున్నా. ఒక్క స్మార్ట్ ఫోన్, స్పీకర్లతోనే కార్యక్రమాలను సులువుగా చేస్తున్నా. ఇకపోతే ఆంధ్రప్రదేశ్‌లో కూటమి గెలిస్తే 108 దేవాలయాల్లో పాటల కార్యక్రమాలు చేస్తానని మొక్కుకున్నా. తొలి అడుగు అన్నవరం దేవాలయం నుంచి ప్రారంభించా. ఇప్పటికే 15 దేవాలయాల్లో పాడాను. మొత్తం 108 దేవాలయాల్లో పాడాలన్నదే.. ప్రస్తుతం నా ముందున్న లక్ష్యం. ఇప్పటికైతే గొంతు బావుంది. బతికి ఉన్ననాళ్లూ పాటతోనే సావాసం చేస్తా. పాటకోసమే ప్రయాణం చేస్తా. పాటే ప్రాణం. పాటే జీవితం'.

పిల్లలూ... మీ కథ మాకు చెప్పండి!

పిల్లలకు కథలు చెప్పే తీరిక పెద్దలకు కరువైన రోజుల్లో... పిల్లలు చెప్పే కథలు ఎవరు వింటారు? వారు రాసే కథలు ఎవరు ప్రచురిస్తారు? వారిలో సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించేవారెక్కడున్నారు? తనను వెంటాడిన ఈ ప్రశ్నలకు... తనే పరిష్కారం కనుగొన్నారు 51 ఏళ్ల తన్మయి కాలేబర్. పిల్లల్లో పఠనాసక్తిని, రచనాశక్తిని పెంపొందించడానికి ఆమె తీసుకున్న చొరవ వందలాది బాల రచయితల ప్రతిభను పాఠకలోకానికి పరిచయం చేస్తోంది.



"అది 2020 లాక్‌డౌన్ సమయం. నాకు కుటుంబ సభ్యులతో మరింత ఎక్కువ కాలం గడిపే అవకాశం వచ్చింది. ముఖ్యంగా పిల్లలతో కథలు, కబుర్లు.. అప్పుడే మా మేనల్లుడు ఒక నోట్‌బుక్‌లో తను రాసిన కథను నాకు చూపించాడు. వాడు ఆ కథను చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. అది ఎక్కడైనా ప్రచురితమైతే బాగుణ్ణనిపించింది. పత్రికలు మొదలు ఆన్‌లైన్ వరకూ ఎన్నో మార్గాల్లో ప్రయత్నించాను. కానీ ఎలాంటి అవకాశం కనిపించలేదు. మా మేనల్లుడి లాంటి ఎందరో బాల రచయితలకు సరైన వేదిక లేకపోవడంతో.. వారి సృజన మరుగున పడిపోతోందని అర్థమయింది. 'ఎక్కడెక్కడో వెతికేకన్నా... అలాంటి వేదికను నేనే ఎందుకు ఏర్పాటు చేయకూడదు?' అనుకున్నాను. బాల రచయితలకే ప్రత్యేకమైన 'స్టోరీస్ బై చిల్డ్రన్'ను 2020 నవంబర్‌లో ప్రారంభించాను.

అదే వ్యాపకమైపోయింది...

నా నేపథ్యం గురించి చెప్పాలంటే... కర్ణాటకలోని బెళగావ్ నా స్వస్థలం. అందరు పిల్లల్లాగానే గడిచిన బాల్యం నాది. ఎంబీఏ పూర్తయ్యాక... బెంగళూరులో ఒక ఫైనాన్స్ సర్వీసెస్ కంపెనీలో రెండేళ్లపాటు ఉద్యోగం చేశాను. పెళ్ళయిన తరువాత... నేను, నా భర్త రాజీవ్ కలిసి ఒక స్టాక్ బ్రోకింగ్ కంపెనీనీ, ఫైనాన్స్ స్కూల్‌ను ప్రారంభించాం. కానీ కొన్నేళ్లకు వాటిని మూసెయ్యాల్సి వచ్చింది. నా భర్త ఫైనాన్స్ టీచింగ్ వైపు మళ్లారు. నేను కుటుంబ బాధ్యతలకు పరిమితమైపోయాను. 'స్టోరీస్ బై చిల్డ్రన్'ను ప్రారంభించాక అదే నాకు ప్రధానమైన వ్యాపకంగా మారిపోయింది. పిల్లల్లో పుస్తకాలు చదవడం, రచనలు చేయడం పట్ల ఆసక్తిని ప్రోత్సహించడం, ఏడు నుంచి పద్ధెనిమిదేళ్ళ మధ్య వయసు వారి రచనలను ప్రచురించడం... ఇదీ దాన్ని ప్రారంభించడం వెనుక నా ప్రధానమైన ఉద్దేశం. సోషల్ మీడియా ద్వారా దీని గురించి ప్రకటించినప్పుడు... అనూహ్యమైన స్పందన వచ్చింది. మొదటి నెలలోనే ఎందరో పిల్లలు తమ కథల్ని పంపించారు. కథల పోటీలను, 11-18 మధ్య వయసువారికి వార్షిక నవలల పోటీలను నిర్వహించడానికి ఇది స్ఫూర్తినిచ్చింది. నేను, నా మిత్రులు ఒక బృందంగా ఏర్పడ్డాం. పోటీల్లో నెగ్గిన పుస్తకాల ప్రచురణ మొదలుపెట్టాం. వీటన్నిటికోసం ఒక విధానాన్ని నిర్దేశించుకున్నాం. పిల్లలు తమ వివరాలను రిజిస్టర్ చేసుకున్న తరువాత... వారికి ప్రత్యేకంగా ఒక డ్యాష్‌బోర్డ్ కేటాయిస్తాం. వారు అందులో తమ కథలను పోస్ట్ చెయ్యడానికి, స్టేటస్ చెక్ చెయ్యడానికి, పోటీల్లో పాల్గొనడానికి ఆప్షన్స్ ఉంటాయి. అప్‌లోడ్ చేసిన కథలకు సమీక్ష ఉంటుంది. మాకు సుమారు 15 మంది రివ్యూవర్స్‌తో ఒక బోర్డ్ ఉంది. వారిలో ప్రిన్సిపాల్స్, టీచర్లు, సాహిత్యాభిమానులు, ఇంగ్లీష్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. ప్రతి కథనూ ఒక సమీక్షకుడు పరిశీలిస్తారు. కథావస్తువు, రాసిన విధానం లాంటివి విశ్లేషించడంతో పాటు... ఆ కథ ఆ బాల రచయిత సొంతమేననీ, ఎక్కడినుంచీ ఎలాంటి చౌర్యం చేయలేదనీ వివిధ మాధ్యమాల సాయంతో నిర్ధారించుకుంటారు. ఆ తరువాత... దాన్ని వీలైనన్ని తక్కువ మార్పులతో ప్రచురిస్తాం. ఎందుకంటే పిల్లల ఊహాశక్తిలోని సారాన్ని సజీవంగా ఉంచాలనేది మా కోరిక.

పిల్లల్లో పుస్తకాలు చదవడం, రచనలు చేయడం పట్ల ఆసక్తిని ప్రోత్సహించడం, ఏడు నుంచి పద్ధెనిమిదేళ్ళ మధ్య వయసు వారి రచనలను ప్రచురించడం... ఇదీ నా ప్రధానమైన ఉద్దేశం.

1,800 కథలు, 14 సంకలనాలు

50 కథలతో ప్రారంభమై... 1,800కు పైగా ఆంగ్ల కథల ప్రచురణ వరకూ మా కృషి విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా వెయ్యిమందికి పైగా విద్యార్థులు రిజిస్టర్ అయ్యారు. ప్రచురించిన సంకలనాలు పద్నాలుగు వరకూ ఉన్నాయి. క్రమం తప్పకుండా మా వెబ్‌సైట్ సందర్శించేవారు దాదాపు పదివేల మంది ఉన్నారు. ఈ ప్రయత్నానికి నా భర్త రాజీవ్ పూర్తి సహకారం అందిస్తున్నారు. ప్రారంభంలో మూడున్నర లక్షల పెట్టుబడి కూడా ఆయనే ఇచ్చారు. 2021లో... 'బ్రిటానియా మేరీ షైస్టార్టప్ కంటెస్ట్'లో పోటీ పడాల్సిందిగా ప్రోత్సహించారు. కాస్త తటపటాయించినా... అప్లై చేశాను. యాభై మంది ఫైనలిస్టులలో నిలిచాను. ఆ తరువాత... పోటీలో 'స్టోరీస్ బై చిల్డ్రన్' అయిదో స్థానం... పది లక్షల రూపాయల అవార్డ్ లభించాయి. ఇప్పుడు పాఠశాలల్లో స్టోరీ టెల్లింగ్ సెషన్స్, పోటీలకు స్పాన్సర్‌షిప్‌లు, పుస్తకాల్లో ప్రకటనలు తదితర మార్గాల్లో మాకు ఆదాయం వస్తోంది. కథలు, కథలు, కవితల ప్రచురణతో పాటు... బాల రచయితల కోసం ఒక క్లబ్ నడుపుతున్నాం. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల పిల్లలు నెలకు ఒకసారి ఆన్‌లైన్‌లో కలుసుకొని... పుస్తకాలు, సాహిత్యం గురించి చర్చిస్తారు. బాల రచయితల ఉత్సాహాన్ని చూసిన తరువాత... ప్రత్యేకంగా వారికోసమే ఒక లిటరరీ ఫెస్టివల్‌ను త్వరలో నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నాం. అంతర్జాతీయ స్థాయిలో బాల రచయితల కమ్యూనిటీ ఏర్పాటు చేయడం, బాల సాహిత్యంలో వారిని, మా సంస్థను మార్గదర్శకులుగా నిలపడం... ఇవీ మా ఆశయాలు." •

ఫ్యాషన్

ఫ్లోరల్ ఫ్రాక్స్



పువ్వులు స్త్రీత్వాన్నీ, సహజసిద్ధ సౌందర్యాన్నీ ప్రతిబింబిస్తాయి. ఆహ్లాదకరమైన అనుభూతిని కూడా అందిస్తాయి. కాబట్టే ఫ్లోరల్ ఫ్రాక్స్ నిరంతర ఆదరణ పొందుతూ ఉంటాయి. అన్ని కాలాలకూ సూటయ్యే ఫ్లోరల్ ఫ్రాక్స్ మీద ఓ లుక్కేద్దామా?

1960ల్లోనే గుచి కంపెనీ ఫ్లోరా ప్రింట్ పేరుతో సుప్రసిద్ధ ఫ్లోరల్ ప్యాటర్న్‌ను వెలుగులోకి తెచ్చింది. అప్పటి నుంచి పూల దుస్తులు సరికొత్త హంగులను అద్దుకుంటూ మహిళలను అలరించడం మొదలుపెట్టాయి. బుట్టబొమ్మల్లా బొద్దుగా కనిపించడం కోసం, నాజూకుగా మెరిసిపోవడం కోసం భిన్నమైన మెటీరియల్స్‌తో ఈ ఫ్లోరల్ ఫ్రాక్స్ తయారవుతూ ఉంటాయి. శాటిన్, ఆర్గంజా, సింథటిక్, జార్జెట్... ఇలా వెరైటీ మెటీరియల్స్‌తో తయారయ్యే వినూత్నమైన ఫ్లోర్ ఫ్రాక్స్ అన్ని రకాల వయసులవారినీ అలరిస్తూ ఉంటాయి.

అన్ని సందర్భాల్లో...

ఫ్లోరల్ ఫ్రాక్, పార్టీ వేర్‌గా పనికిరాదనుకుంటే పొరపాటు. ఈవినింగ్ గౌన్‌గా, వేడుకల్లో ధరించే పార్టీ గౌన్‌గా, కంఫర్ట్ వేర్‌గా, రెగ్యులర్ వేర్‌గా సందర్భానికి తగిన మెటీరియల్‌తో వేర్వేరు ఫ్రాక్స్ ఇప్పుడు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. కాటన్‌తో తయారయ్యే ఫ్రాక్స్‌ను రెగ్యులర్ వేర్‌గా, శాటిన్, ఆర్గంజాతో తయారయ్యే వాటిని పార్టీ వేర్‌గా, జార్జెట్, సింథటిక్ ఫ్రాక్స్‌ను ఈవినింగ్ గౌన్స్‌గా వేసుకోవచ్చు.

తళుకులీనేలా...

సెక్విన్లు, మోటిఫ్‌లు, జరీ మెరుపులు, సెమీ ప్రెషియస్ స్టోన్స్... వీటితో తీర్చిదిద్దిన ఫ్లోరల్ ఫ్రాక్స్ భారీగా కనిపిస్తాయి. వీటిని పుట్టిన రోజు వేడుకలు, రిసెప్షన్ల కోసం ఎంచుకోవచ్చు. ఫ్రిల్స్, ఫ్లోయీ డిజైన్లు నాజూకుగా ఉన్నవాళ్లకు చక్కగా సూటవుతాయి. పెద్ద పెద్ద పూలు, లతలు, ముదురు రంగులు కూడా వీళ్లకు చాలా బాగా నప్పుతాయి. కాస్త బొద్దుగా ఉన్నవాళ్లు చిన్నపాటి పూల డిజైన్లను ఎంచుకోవాలి. నడుము పైభాగంలో ఫ్లవర్స్ ఉన్నా, కింది భాగం ప్లెయిన్‌గా ఉండేలా చూసుకోవాలి.

యాక్సెసరీస్

పెన్సిల్ హీల్స్, యాంకిల్ బూట్స్ ఈ రకం ఫ్రాక్స్‌కు చక్కగా నప్పుతాయి. వెల్వెట్‌తో తయారైన బూట్లు ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి. మెడలో డైమండ్ చోకర్, చేతికి అదే రకం బ్రేస్‌లెట్, చెవులకు జూకాలు బాగుంటాయి. భారీ స్టడ్స్ కూడా సూటవుతాయి. •



రూ.4వేల కోట్ల మైనార్టీ నిధులు గోల్‌మాల్

▸ మాజీ మంత్రి అంజాద్ బాషాను అరెస్టు చేయాలి: బీజేపీ

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మైనార్టీలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న వైసీపీ అదే మైనార్టీల పొట్టకొట్టి రూ.4వేల కోట్లకు పైగా నిధులు గోల్‌మాల్ చేసిందని ఏపీ బీజేపీ విమర్శించింది. ముస్లింల నోరుకొట్టిన మాజీ మంత్రి అంజాద్ బాషాను పోలీసులు అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ డిమాండ్ చేశారు. విజయవాడలో మీడియాతో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఐదేళ్లలో 15,931 కోట్లు మన రాష్ట్రానికి ఇస్తే.. జగన్ ప్రభుత్వం 11,324 కోట్లు ఖర్చు చేసినట్లు చూపిస్తోందన్నారు. మెడికల్ క్యాంపులు పెట్టి 100కోట్లు ఖర్చు చేశారా? 400కోట్లతో ముస్లిం యువతకు స్కిల్ నైపుణ్య శిక్షణ ఇచ్చారా? ఈ లెక్కలు వింటుంటేనే ఆశ్చర్యమేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి మైనార్టీల నిధులు కాజేసిన దొంగల్ని జైలుకు పంపాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

'అన్నమయ్య' బాధ్యులపై చర్య తీసుకోవాలి

▸ బాధితుల్ని ఆదుకోవాలి: నాగోతు, వేమన

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు బాధ్యుల్ని శిక్షించి.. బాధితుల్ని ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడితో భేటీ అయిన ఇద్దరు నేతలు.. 2021 నవంబరు 19న జరిగిన ఉపద్రవం వల్ల రాజంపేట ప్రాంతంలో జరిగిన నష్టాన్ని మంత్రికి వివరించారు. వేల కోట్ల ఆస్తి నష్టం, 40మంది ప్రాణాలు కోల్పోవడం, ఇళ్లు పొలాలు కోల్పోయిన బాధితుల గోడు వినిపించారు.

విద్యుత్తు అక్రమాలపై చర్యలు చేపట్టాలి: సీపీఐ

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో విద్యుత్తు సంస్థల్లో జరిగిన అక్రమ పోస్టింగుల వ్యవహారం, అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి లేఖ రాశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ జీతాలు చెల్లించే బాధ్యతలను ఇన్వెన్షన్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించి, ఉన్నతాధికారులు భారీమొత్తంలో ప్రయోజనం పొందారన్నారు.

హోదా సాధనకు అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

కాకినాడ సిటీ, జులై 9: ప్రత్యేక హోదా సాధన కోసం అఖిలపక్షం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. కాకినాడలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో రూ.12లక్షల కోట్ల ఏపీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ఇప్పుడు ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు కూడా అప్పు చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిని అధిగమించాలంటే ప్రత్యేక హోదాతోనే సాధ్యమని చెప్పారు.

ఆప్కోస్‌లో చేర్చండి

▸ మంత్రి డోలాకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో వసతి గృహాల్లో పనిచేస్తున్న తమను ఆప్కోస్‌లో చేర్చాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామికి విన్నవించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంగళవారం అమరావతి సచివాలయంలో మంత్రి డోలా వినతులు స్వీకరించారు.

ప్రకృతి వ్యవసాయానికి పట్టం

▸ ఏపీకి గుల్బెంకియన్ ఫౌండేషన్ అవార్డు

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ(ఏపీ సీఎన్ఎఫ్) కార్యక్రమం ప్రతిష్ఠాత్మక 'గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమినిటీ' అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డు కింద పోర్చుగల్‌కు చెందిన కలుస్ట్ గుల్బెంకియన్ ఫౌండేషన్ రూ.9 కోట్ల నగదుని ప్రకటించినట్టు ఏపీ రైతు సాధికార సంస్థ మంగళవారం తెలిపింది.



డ్రగ్ విభాగంలో యాప్‌ల మాయ..!

డ్రగ్ మాఫియాకు అండగా అధికారులు.. ఇన్‌స్పెక్టర్లను కట్టడి చేసేందుకే యాప్‌లు

▸ తెలంగాణలో ఫెయిల్ అయిన యాప్ ఏపీలో అమలు

▸ కమీషన్ల కోసం డ్రగ్ విభాగంలో ఉన్నతాధికారి నిర్వాకం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో డ్రగ్ విభాగాన్ని ఉన్నతాధికారులు దారి తప్పిస్తున్నారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన మందులు అందించాల్సిన బాధ్యత డ్రగ్స్ అధికారులపై ఉంది. ఇందుకోసం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను మరింతగా ప్రోత్సహించాలి. కానీ అధికారుల నిర్ణయాలు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను కట్టడి చేసేలా ఉంటున్నాయి. ముఖ్యంగా డ్రగ్ విభాగానికి ఉపయోగం లేని యాప్‌లను తీసుకొచ్చి ఇన్‌స్పెక్టర్ల చేతులు కట్టేస్తున్నారు. చివరికి నాసికరం, అనుమతి లేని మందులు వారి పక్క నుంచి వెళ్లినా పట్టుకుని కేసులు పెట్టే అధికారం లేకుండా చేసేస్తున్నారు. అధికారులు తెచ్చే యాప్‌లతో ఏ ఉపయోగమూ లేదని క్షేత్రస్థాయి సిబ్బంది మొత్తుకుంటున్నా... ఉన్నతాధికారులు మాత్రం తమ కమీషన్ల కోసం అదే యాప్‌లను విభాగంపై రుద్దుతున్నారు. చివరికి పక్క రాష్ట్రాల్లో విఫలమైన యాప్‌లనూ రాష్ట్రంలోకి తెస్తున్నారు. ఏపీ డ్రగ్ కంట్రోల్ అధికారులు ఈ మధ్య కాలంలో ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్ యాప్‌ను తీసుకొచ్చారు. ఈ యాప్ తెలంగాణలో అట్టర్ ఫ్లాప్ అయింది. యాప్ ఎక్కడకి చెబితే అక్కడికి వెళ్లి మాత్రమే ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. పక్క షాపులో నాసిరకం డ్రగ్స్ విక్రయిస్తున్నా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. దీని వల్ల ప్రజలకు నాణ్యమైన మందులు అందుబాటులోకి రావని తెలిసి కూడా అధికారులు ఈ యాప్‌ను ఉపయోగించేలా చేస్తున్నారు. డ్రగ్ విభాగాన్ని తమ చేతిలోకి తీసుకున్న ముగ్గురు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఇలాంటి పనులకు పాల్పడుతున్నారు. ఇప్పటికే యాప్‌ల విషయంలో పదేపదే అధికారులు ఫెయిల్ అవుతున్నప్పటికీ మళ్లీ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్ యాప్‌ను ఎందుకు తెచ్చారని ఆరా తీస్తే అసలు గుట్టు బయటపడింది. ఏడేళ్లుగా డ్రగ్ విభాగంలో పెత్తనం చెలాయిస్తున్న ఒక ఉన్నతాధికారి యాప్‌ల రూపకర్తగా తెలుస్తోంది. రెండు నెలల్లో పదవీ విరమణ చేయబోతున్న అతను మరికొంత కాలం శాఖలో కొనసాగాలని భావిస్తున్నారు. ఇందుకోసం కొత్త ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీల వెంట తిరుగుతున్నారు. సదరు అధికారి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునేందుకు అవసరం లేకపోయినా తెలంగాణలో ఫెయిల్ అయిన యాప్‌ను డ్రగ్ విభాగంలోకి తీసుకువచ్చారు. ఈ యాప్‌ను డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నా ఆయన మాత్రం పట్టుబట్టి మరీ యాప్ తీసుకువచ్చారు. మెడికల్ షాపుల్లో ఎక్కడ ఏమి జరుగుతుందో ఆ ప్రాంత డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం వస్తుంది. లేదా రొటీన్ పద్ధతిలో తనిఖీ చేస్తారు. ఈ యాప్ అమల్లోకి వస్తే ఎక్కడ ఏమి జరిగినా తనిఖీలు చేసేందుకు వీల్లేదు. ఈ యాప్‌నే అనుసరిస్తే నాసిరకం డ్రగ్స్ వల్ల ఎవరైనా రోగులు మరణిస్తే అప్పుడు బాధ్యత ఎవరు తీసుకుంటారనే ప్రశ్నకు సమాధానం లేదు. ఇలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేస్తారనే ఎవ్వరికీ చెప్పకుండా ఇటీవల మంత్రితో యాప్‌ను ప్రారంభించేందుకు ప్రయత్నం చేశారు. ఆరోగ్య శాఖ మంత్రి సమయం ఇవ్వక పోవడంతో హడావుడిగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో యాప్‌ను ప్రారంభించేశారు.

'కాసీ' యాప్ కనుమరుగు..?

రెండేళ్ల క్రితం కంప్యూటర్ ఏయిడెడ్ సెలెక్షన్ ఆఫ్ ఇన్‌స్పెక్షన్(కాసీ) యాప్‌ను ఉన్నతాధికారులు అమల్లోకి తీసుకొచ్చారు. 2022లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌తో అట్టహాసంగా ప్రారంభోత్సవం చేయించారు. పదిహేను లక్షల ఖర్చుతో సర్వర్, మరింత నిధులు వెచ్చించి సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేశారు. వైసీపీ ప్రభుత్వం బడ్జెట్ ఇవ్వక పోవడంతో మెడికల్ అసోసియేషన్లు, మందుల తయారీ దారులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతో రూ.60లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆరు నెలల తర్వాత కాసీ యాప్ కనుమరుగయింది. అదే యాప్‌ను ఇప్పుడు పేరు మార్చి మరోసారి తీసుకొస్తున్నారంటూ శాఖలోని అధికారులు అసలు గుట్టు బయటపెట్టారు. దీనిపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా అధికారులు మాత్రం ఒత్తిడి చేసి అమలు చేయిస్తున్నారు. మరోవైపు మెడికల్ షాప్ ఎక్కడుందో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌కు లోకేషన్ చూపించేందుకు 'భువన డ్రగ్స్' పేరుతో ఒక యాప్‌ను ఇదే అధికారులు అమల్లోకి తెచ్చారు. కేవలం అడ్రస్ చూపించేందుకు యాప్ అవసరమా? అనే ప్రశ్న అప్పట్లో తలెత్తింది. నిర్వాహకులతో అంతర్గతంగా చేసుకున్న ఒప్పందం మేరకే డ్రగ్ ఇన్‌స్పెక్టర్లపై యాప్‌లను రుద్దుతున్నారు.



తలకోనలో అరుదైన కప్ప

తిరుపతి(మంగళం), జూలై 9: తిరుపతి జిల్లాలోని తలకోన జలపాతంలో అరుదైన గోధుమ వర్ణ చెవి పొదకప్పను జంతుశాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ కప్ప శరీరం పూర్తిగా గోధుమ వర్ణం కలిగి ఉంది. దశాబ్దాల క్రితం శ్రీలంకలో మనుగడ సాగించే స్యూడో ఫిలీటాస్ జాతికి చెందిన కప్ప ఇప్పుడు మన దేశంలోని తూర్పు కనుమల్లో కనిపించడం అంటే పూర్వం భారతదేశం, శ్రీలంక దేశాలు కలిసిఉన్నాయి అనడానికి నిదర్శనం అని జూలాజికల్ సర్వేఆఫ్ ఇండియా డైరెక్టర్ ధ్రితి బెనర్జీ అభిప్రాయపడ్డారు.

అవయవ మార్పిడి రాకెట్ గుట్టు రట్టు

▸ ఢిల్లీలో డాక్టర్ సహా ఆరుగురి అరెస్ట్

న్యూఢిల్లీ, జూలై 9: బంగ్లాదేశ్, ఢిల్లీ-ఎన్‌ఆర్‌సీ ప్రాంతంలో జరుగుతున్న అవయవ మార్పిడి రాకెట్ గుట్టు రట్టయింది. ఈ కేసులో ఢిల్లీకి చెందిన ఓ డాక్టర్ సహా ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసు అధికారులు మంగళవారం వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు ఢిల్లీ పోలీస్ క్రైం బ్రాంచ్ రెండు నెలలుగా ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసి, గత రెండు వారాల్లో ఈ అరెస్టులు చేపట్టింది. ఈ వ్యవహారంలో ఎక్కువ శాతం అవయవ దాతలు, గ్రహీతలను నకిలీ పత్రాలను ఉపయోగించి బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు తీసుకొచ్చారని అధికారులు వెల్లడించారు. 2021- 2023 మధ్య బంగ్లాదేశ్ నుంచి ఆలా వచ్చిన వారికి ఢిల్లీలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి సర్జన్‌గా పనిచేస్తున్న ఓ మహిళా డాక్టర్ శస్త్ర చికిత్సలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. కాగా, అరెస్టయిన వారిలో ముగ్గురు బంగ్లాదేశీయులు ఉన్నారు.

'నాడు-నేడు'లో 3 వేల కోట్లు మాయం!

▸ రెండో విడత పనుల్లో భారీగా గోల్‌మాల్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పేరుతో జగన్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన నాడు-నేడు పథకంలో రూ.వేల కోట్లు దారిమళ్లాయి. రెండో విడత పనుల్లో దాదాపు రూ.3వేల కోట్లు ఎటుపోయాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఓవైపు నాబార్డు, ప్రపంచ బ్యాంకు నుంచి రుణ సమీకరణ, మరోవైపు కేంద్రం నుంచి వచ్చిన నిధులను 'నాడు-నేడు'కు ఖర్చు చేయకుండా ఇతరత్రా పథకాలకు గత వైసీపీ ప్రభుత్వం మళ్లించింది. అయితే ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద ఇవ్వాల్సిన దానిలో ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. పైగా కేంద్రం ఇచ్చిన నిధులను సక్రమంగా ఖర్చు చేయకుండా ఖర్చు చేసినట్లుగా యుటిలైజేషన్ సర్టిఫికెట్లు(యూసీ)లు సమర్పించడం మరో వివాదంగా మారనుంది. నాడు-నేడు పథకం అధికారుల ఆమోదం లేకుండా నేరుగా ఆర్థిక శాఖ అధికారులే ఈ యూసీలపై సంతకాలు చేసేశారు. దీంతో ఇప్పుడు ఈ యూసీల వ్యవహారం ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఆ నిధులను ఇతరత్రా పథకాలకే మళ్లించారా లేకపోతే కాంట్రాక్టర్ల బిల్లులకు వినియోగించారా? అసలు అవి ప్రభుత్వ ఖజానాకు వెళ్లాయా? అనేది అనుమానాస్పదంగా మారింది.

నిధుల సేకరణ ఇలా...

నాడు-నేడు రెండో విడతలో భాగంగా 22,311 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.8వేల కోట్లు అవసరమని పాఠశాల విద్యాశాఖ అంచనా వేసింది. ఈ నిధులను ప్రభుత్వం వివిధ రూపాల్లో సమీకరించింది. నాబార్డు నుంచి రూ.3,025 కోట్లు రుణంగా తీసుకుంది. ఇందులో రూ.1,612 కోట్లు రాష్ట్రం తన వాటా కింద ఇవ్వాల్సి ఉండగా, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వ పథకం ఎస్‌ఎస్‌ఏసీపై కింద రూ.3,561 కోట్లు గ్రాంట్ పొందారు. ప్రపంచ బ్యాంకు నుంచి మరో రూ.425 కోట్ల రుణం తీసుకొచ్చారు. ఈ మొత్తం రూ.7,011కోట్లలో ప్రభుత్వం ఇప్పటివరకూ ఖర్చు చేసింది కేవలం రూ.4,177కోట్లు మాత్రమే. మిగిలిన రూ.2,834 కోట్లు ఎటు పోయాయో లెక్క తేలాల్సి ఉంది. ఆ నిధులుంటే రెండో విడత పనులు ఎప్పుడో పూర్తయ్యేవి. రుణాలు, గ్రాంట్లు తెచ్చుకున్నా వాటిని దారిమళ్లించి నిధులు లేవనే సాకుతో ప్రభుత్వం పనులను ఆపేసింది. చివరికి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల(ఐఎఫ్‌పీ)కు నాడు-నేడు నిధులే వినియోగించారు. దీంతో రూ.3వేల కోట్లకు పైగా దారి మళ్లినట్లు స్పష్టమవుతోంది.

ప్రారంభంలోనే ఆర్భాటం

ప్రభుత్వ పాఠశాలల ముఖచిత్రాన్ని నాడు-నేడు పథకంతో మార్చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం అప్పట్లో ఆర్భాటంగా ప్రకటించింది. మూడు దశల్లో మొత్తం 45వేల బడులు అభివృద్ధి చేస్తామని ప్రచారం చేసింది. రెండేళ్లలోనే ఈ మొత్తం పనులు పూర్తిచేయాలని లక్ష్యం నిర్దేశించుకుంది. కానీ తొలిదశ పూర్తి చేయడానికే నానాపాట్లు పడ్డారు. అవి కొనసాగుతుండగానే 2022లో రెండో దశ పనులు ప్రారంభించారు. సేకరించిన రుణాలు, గ్రాంటక్లు రాష్ట్ర ప్రభుత్వ వాటా కలిపితే సకాలంలో పథకం పూర్తయ్యేది. మధ్యలో నిధులు ఇవ్వకపోవడంతో హెచ్‌ఎంలు పనులను పక్కన పెట్టారు. పేరుకు తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పనులు చేయించాలని నిబంధనలు రూపొందించినా మొత్తం హెచ్‌ఎంలే బాధ్యత తీసుకున్నారు. కొవిడ్ సమయంలో వైసీపీ నేతలు మెటీరియల్ తీసుకెళ్లినా హెచ్‌ఎంలనే బాధ్యులను చేశారు. పలుచోట్ల ఇసుక మాయం చేశారు. ఈ నేపథ్యంలో ఇంకా పాత విధానమా లేక కాంట్రాక్టరును ఎంపిక చేసి పనులు చేయించాలా? అనే ప్రతిపాదనలను ప్రస్తుత ప్రభుత్వం పరిశీలిస్తోంది.

వెంకన్న విరాళాలకు ఇక్కట్లు!

▸ నూతన నిబంధనతో దాతలు వెనక్కి

▸ నిరీక్షణ సమయం పెరగడంపై అసంతృప్తి

తిరుమల, జూలై 9(ఆంధ్రజ్యోతి): టీటీడీలో నూతన నిబంధనలతో విరాళాలు తగ్గుతున్నాయి. ఒకప్పుడు రోజుకు రూ.3లక్షల నుంచి రూ.4లక్షల దాకా వచ్చే విరాళాలు కొత్త నిబంధనతో రూ.2లక్షలకు పడిపోయాయి. ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు దాతల నుంచి విశేషంగా విరాళాలు వస్తుంటాయి. ఇందుకోసం 2022లో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో తిరుమలలోని వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనంలో దాతల కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ రూ.50 నుంచి రూ.9,999 వరకు భక్తులు విరాళం ఇవ్వొచ్చు. భక్తులు తమ ఆధార్ కార్డును కౌంటర్‌లోని సిబ్బందికి ఇస్తే వారు భక్తుడి పేరు, ఊరు, ఎంత విరాళం ఇచ్చారనే వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేసి రసీదు ఇచ్చేవారు. అయితే ఇటీవల విరాళం తీసుకుని వివరాలు నమోదు చేసి రసీదు ఇవ్వడానికి దాదాపు 5 నుంచి 10 నిమిషాల సమయం పడుతోంది. తాజాగా ఓ పేపరు ఇచ్చి అందులో కూడా వ్యక్తిగత వివరాలు నమోదు చేయాలనే నిబంధన తీసుకువచ్చారు. దీంతో భక్తులకు నిరీక్షణ సమయం మరింత పెరిగిపోతోంది. పేరు, పుట్టిన తేదీ, ఎంత విరాళం ఇస్తున్నారు, ఆధార్ నంబరు, ఊరు, సెల్ నంబరు, ఏ రూపం లో విరాళం ఇస్తున్నారో దరఖాస్తులో రాసి కౌంటర్‌లో ఇస్తే వారు తిరిగి వివరాలను సిస్టమ్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో దాతలకు వేచి ఉండే సమయం అధికమవుతోంది. దీంతో చాలామంది ఈ ప్రక్రియ మొత్తం పూర్తిచేయలేక తిరిగి వెళ్లిపోతున్నారు.

ముగిసిన పిన్నెల్లి పోలీస్ విచారణ

నెల్లూరు(క్రైం), జూలై 9: పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలీసు కస్టడీ మంగళవారంతో ముగిసింది. సోమవారం ప్రారంభమైన పోలీసుల విచారణ మంగళవారం సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈవీఎం ధ్వంసంతో పాటు పలు కేసుల నేపథ్యంలో ఆయన్ను అరెస్టు చేసి నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. పిన్నెల్లిని విచారించాలని పోలీసులు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి అనుమతులిచ్చింది. ఈ క్రమంలో నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో సీఐ శోభన్‌బాబు ఇతర అధికారులు సోమవారం ఉదయం నుంచి మంగళవారం సాయంత్రం వరకు ఈవీఎం ధ్వంసంతోపాటు దాడులు, హత్యాయత్నాలు.. తదితర అంశాలపై పిన్నెల్లిని విచారించినట్లు సమాచారం. సీసీ కెమెరాల పర్యవేక్షణలో అధికారులు విచారించారు.

అసెంబ్లీ సెక్రటరీ జనరల్ రామాచార్యులు రాజీనామా

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): శాసనసభ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులు తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయన కాంట్రాక్ట్ పద్ధతిలో అసెంబ్లీలో నియమితులయ్యారు. పదవీ విరమణ చేసి, తిరిగి ప్రభుత్వ పదవుల్లో చేరిన వారందరూ రాజీనామా చేయాలని టీడీపీ ప్రభుత్వం గత నెలలో జారీ చేసిన ఆదేశాల మేరకు ఆయన రాజీనామా చేసినట్లు అసెంబ్లీ వర్గాలు తెలిపాయి.

నేడు విశాఖకు కేంద్ర ఉక్కు శాఖా మంత్రి

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి బుధవారం విశాఖ ఉక్కును సందర్శించనున్నారు. ఢిల్లీ నుంచి ఆయన విశాఖ విమానాశ్రయానికి సాయంత్రం చేరుకుని ఆర్‌ఐఎన్ఎల్ గెస్ట్‌హౌస్‌కు వెళ్లి రాత్రి బస చేస్తారు. గురువారం ఉదయం స్టీల్‌ప్లాంటును సందర్శించి, అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

2026కి భోగాపురం ఎయిర్‌పోర్టు

▸ 6 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు: మంత్రి రామ్మోహన్‌నాయుడు

▸ ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో కలసి విమానాశ్రయం పనుల పరిశీలన

విజయనగరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎయిర్‌పోర్టును 2026 డిసెంబరు నాటికి శత శాతం పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం విమానాశ్రయ పనులను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు లోకం నాగమాధవి, పూసపాటి అదితి గజపతిరాజు, కలెక్టరు అంబేడ్కర్‌తో కలసి పరిశీలించారు. జాతీయ రహదారితో విమానాశ్రయ అనుసంధాన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'ఉత్తరాంధ్ర అన్నివిధాలుగా అభివృద్ధి జరగాలంటే, నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలంటే.. ఈ ఎయిర్‌పోర్టు పూర్తి చేసుకోవాలి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆరు లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఈ విమానాశ్రయానికి టీడీపీ హయాంలో 2015లో అనుమతులు ఇచ్చారు. 2019 నాటికి టెండర్ ప్రక్రియ అయింది. ఎయిర్‌పోర్టు పనులు వైసీపీ ప్రభుత్వంలో పనులు నత్తనడకన సాగాయి. యావత్ ప్రపంచం భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును చూసేవిధంగా నిర్మాణాలు చేపడతాం' అని అన్నారు.



ఎయిర్‌పోర్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

11న విశాఖకు చంద్రబాబు

ఉత్తరాంధ్ర వెనుకబాటును రూపుమాపేందుకు, యువత వలసలు నివారించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్... ఇద్దరూ సంకల్పంతో ఉన్నారని మంత్రి అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఐటీ, ఇతర వాణిజ్య పరిశ్రమలు నెలకొల్పేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు ఎయిర్‌పోర్టు పనులను స్వయంగా పరిశీలించేందు కు 11న భోగాపురం వస్తారన్నారు. ఈ సందర్భంగా విశాఖ నగర అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలను సీఎం సమీక్షిస్తారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పోలవరం ఎడమ కాలవ పనుల పరిస్థితిని స్వయంగా చూసి అధికారులతో చర్చిస్తారు. అదే రోజు రాత్రి అమరావతి చేరుకుంటారు.

త్వరలో ఈ-ములాఖత్

▸ ఖైదీలకు వీడియో కాల్ సౌకర్యం

▸ వారంలో రెండుసార్లు అవకాశం.. విధివిధానాలపై కసరత్తు

రాజమహేంద్రవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈ-ప్రిజన్స్‌లో భాగంగా ఖైదీలకు తీపి కబురు చెప్పింది. వీడియో కాల్ ద్వారా మాట్లాడుకునే వెసులుబాటును ఈ-ములాఖత్ పేరుతో తీసుకొచ్చింది. దీని సహాయంతో ఇంటి నుంచే కుటుంబీకులు, ఖైదీని వీడియోలో చూస్తూ మాట్లాడుకోవచ్చు. దీనికి సంబంధించి సాఫ్ట్‌వేర్, తది తర ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. రాష్ట్రంలోని రాజమహేంద్రవరం, విశాఖ, నెల్లూరు, కడప, అనంతపురం పీఎస్‌సీ, సబ్ జైళ్లు, స్పెషల్ సబ్ జైళ్లు, జిల్లా జైళ్లు, మహిళా ప్రత్యేక జైలు... ఇలా ప్రతి జైలులోనూ ఈ-ములాఖత్ అందుబాటులోకి వచ్చింది.

ఈ-ములాఖత్ ఇలా

ఖైదీతో ములాఖత్ కోరుకునే వారు తమ మొబైల్ ఫోన్‌లో ప్లే స్టోర్ ద్వారా జిట్సీ మీట్ యాప్ (jitsi meet app)ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తర్వాత గూగుల్ క్రోం ఓపెన్ చేసి ఈ-ములాఖత్ అని టైప్ చేస్తే నేషనల్ ప్రిజన్ పోర్టల్‌కి లింక్ అవుతుంది. అక్కడ ఈ-ములాఖత్(emulakat)ని నొక్కి, ములాఖత్ కోరుకుంటున్న వారి వివరాలు, ఈ-మెయిల్ ఐడీ, ఫోన్ నంబరు తదితర వివరాలను నమోదు చేయాలి. అన్నీ సరిచూసుకొని 'సబ్‌మిట్' చేయాలి. అప్పుడు ఆ వివరాలు నేరుగా ఖైదీ శిక్ష అనుభవిస్తున్న జైలుకు వెళతాయి. వారు వివరాలను పరిశీలించి టైమ్ స్లాట్(సమయం) కేటాయించగానే ములాఖత్ దరఖాస్తు చేసిన వారి ఈ-మెయిల్, ఫోన్‌కి రూమ్ పిన్, లింక్ ఆటోమేటిక్‌గా వెళ్లిపోతాయి. ఆ లింక్ ఓపెన్ చేసి రూమ్ పిన్ నమోదు చేస్తే ఫోన్‌కి చివరిగా ఓటీపీ వస్తుంది. అది నమోదు చేసిన తర్వాత 'గో టు యాప్' అని డిస్‌ప్లే అవుతుంది. ఆ బటన్ ప్రెస్ చేయగానే జాయిన్ మీటింగ్ అనే చిహ్నం కనిపిస్తుంది. అది నొక్కగానే సదరు ఖైదీ కనబడే వెబ్‌పేజీ ఓపెన్ అవుతుంది. వీడియోకాల్ రూపంలో ములాఖత్ కావచ్చు. మరిన్ని వివరాలకు జైలు అధికారులను సంప్రదించవచ్చు.

విధివిధానాలు ఖరారు కావాలి



ఈ-ములాఖత్... ఖైదీలకు ఒక మంచి సదుపాయం. అయితే, దీనిపై ఇంకా స్పష్టమైన విధివిధానాలు ఖరారు కావాల్సి ఉంది. వారంలో ఎన్ని, ఏ విధమైన ములాఖత్‌లు అనే మార్గదర్శకాలు రావాలి. వాటి ప్రకారం మేం సదుపాయాన్ని అమలు చేస్తాం. అన్ని జైళ్లలోనూ ఈ-ములాఖత్‌కి తగిన ఏర్పాట్లు ఉన్నాయి. ఇది ఖైదీల సంబంధీకులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. సమయం, డబ్బులు ఆదా అవుతాయి. మా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. **- ఎంఆర్ రవికిరణ్, డీఐజీ, జైళ్ల శాఖ, కోస్తాంధ్ర ప్రాంతం**

తిరుమలలో ఇద్దరు దళారుల అరెస్ట్

▸ భక్తుల ఆధార్ జిరాక్స్‌లే పెట్టుబడి

▸ 36 రోజుల్లో 45 గదులు పొంది సొమ్ము చేసుకున్న వైనం

▸ ఐదుగురు దళారులపై బైండోవర్ కేసులు

తిరుమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భక్తుల ఆధార్ జిరాక్స్‌లతో గదులు పొంది వాటిని అధిక ధరలకు అంటగడుతూ సొమ్ముచేసుకుంటున్న ఇద్దరు దళారులను తిరుమల పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. తొలుత సమీప బంధువు ఆధార్‌తో గదిని పొందటం, పొందిన గది తాళాలు తీసుకుని సీఆర్వో వద్ద గదుల కోసం గంటల తరబడి వేచిఉండే భక్తుల వద్దకు వెళ్లి తమ వద్ద రెండు గదులున్నాయని, కావాలంటే ఒక గదిని తీసుకోండని నమ్మించి రూ.100 ధర కలిగిన గదిని రూ.వెయ్యికి విక్రయించడం, విక్రయించే సమయంలోనే భక్తుడి నుంచి ఆధార్ జిరాక్స్ తీసుకోవడం, తిరిగి ఆ ఆధార్ జిరాక్స్‌పై ఫొటో పెట్టి తీసిన జిరాక్స్‌లో మళ్లీ గదిని పొంది విక్రయించడం... ఈ తంతు ఇప్పటికే వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ అక్రమానికి పాల్పడిన నవకిశోర్ అనే దళారిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్న పోలీసులు గదుల దళారులపై ప్రత్యేక నిఘా ఉంచారు. మంగళవారం మరో కొత్తరకం అక్రమం వెలుగుచూసింది. భక్తుడి నుంచి తీసుకునే ఆధార్ జిరాక్స్‌పై ఫొటో బ్లర్ అయ్యేవరకు జిరాక్స్‌లు తీసి నేరుగా గది పొందుతున్న ఇద్దరు దళారులను విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. వరంగల్‌కు చెందిన వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా పోచవరానికి చెందిన నాగబ్రహ్మాచారి గడిచిన 36 రోజుల్లో 45 గదులను పొందడం గమనార్హం. తరచూ సీఆర్వోలో గదుల కోసం వస్తున్న దళారులపై టీటీడీ ఇటీవల నిఘా పెట్టింది. ఈవో శ్యామలరావు ఆదేశాల మేరకు ఫేస్ రికగ్నిజేషన్, ఫోన్ నంబర్ల ఆధారంగా తరచూ గదులు పొందుతున్న దళారుల జాబితాను తీశారు. టీటీడీ ఏవీఎస్వో పద్మనాభం, వీఐ శంకర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం ఈ జాబితాతో దళారుల వేటలో పడింది. ఈ క్రమంలోనే మంగళవారం ఇద్దరు దళారులను అరెస్ట్ చేశారు. ఈ దళారుల వెనుక ఎవరున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. అలాగే ఐదుగురు దళారులపై బైండోవర్ కేసులు కూడా నమోదు చేశామన్నారు.



పోలీసుల అదుపులో దళారులు

పలు రకాల అనుమానాలు

సాధారణంగా ఓ సామాన్యుడు సీఆర్వోలో గదిని పొందాలంటే అంత సులువు కాదు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి గదిని పొందేలోపు సీఆర్వోలోనే దేవుడు కనిపిస్తాడు!! అయితే దళారులు అంత సులువుగా ఎలా గదులు పొందుతున్నారనే అంశంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గదులు కేటాయించే కౌంటర్‌లోని సిబ్బంది, క్యూలైన్‌లోకి అనుమతించే సెక్యూరిటీ సిబ్బంది సహకారం లేకుండా అత్యంత రద్దీతో కూడిన సీఆర్వోలో ఇన్ని గదులు తీసుకోవడం సాధ్యమేనా అనే అనుమానాలు వెంటాడుతున్నాయి. మరోవైపు భక్తుల ఆధార్ నంబరు, పేరు, సెల్ నంబరు మ్యానువల్‌గా సిస్టమ్‌లో నమోదు చేస్తున్న క్రమంలో దళారులను గుర్తించడం సాధ్యం కావడం లేదని కౌంటర్‌లోని ఉద్యోగులు చెబుతున్నారు.

కేంద్రమంత్రి పెమ్మసానితో రాష్ట్రమంత్రి కొండపల్లి భేటీ

న్యూఢిల్లీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు మంత్రులు ఏపీ ప్రయోజనాలు, పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించుకున్నారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు, కేంద్రప్రభుత్వం నుంచి నిధులు సేకరించి రాష్ట్రఅభివృద్ధి కోసం పరిశ్రమలను తీసుకరావాలని సూచించినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

బీటెక్, బీఎస్సీ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో ఎంపీసీ విభాగం రైతు కోటా, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ రామచంద్రరావు తెలిపారు. ఏఎన్‌జీఆర్‌ఏయూ వెబ్‌సైట్‌లో ఈ నెల 10 నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, వాటిని పూరించి, వర్సిటీలో అందజేయాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

పాలీసెట్‌లో తుది దశ కౌన్సెలింగ్

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు తుది దశ పాలీసెట్ కౌన్సెలింగ్‌కు సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ బీనవ్య మంగళవారం నోటిఫికేషన్ జారీచేశారు. ఈ నెల 11 నుంచి 14 వరకు దరఖాస్తులు స్వీకరణ, సర్టిఫికెట్ల పరిశీలన, ఆప్షన్ల ఎంపిక నమోదు ప్రక్రియ జరుగుతుందని వివరించారు. 16న సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. 18 నుంచి 20లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

అనంత జిల్లాలో టీడీపీ నాయకుడి హత్య

రాయదుర్గంరూరల్, జూలై 9: అనంతపురం జిల్లా రాయదుర్గం మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గొల్ల ఆదెప్ప(48)ను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి దారుణంగా హత్య చేశారు. గ్రామ సమీపంలోని కర్ణాటక సరిహద్దులో మృతదేహాన్ని గుర్తించారు. ఆదెప్ప వ్యక్తిగత పనిమీద కర్ణాటకలోని నాగసముద్రం గ్రామానికి ద్విచక్రవాహనంపై సోమవారం సాయంత్రం వెళ్లారు. పని ముగించుకుని స్వగ్రామానికి రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఆయన ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఫోన్ చేశారు. స్పందన లేకపోవడంతో గాలింపు చేపట్టారు. గ్రామ సమీపంలో ఆదెప్ప మృతదేహాన్ని గుర్తించారు. అతనిపై కొందరు కత్తులతో దాడి చేసినట్టు కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఇతర ప్రాంతంలో చంపి, అక్కడ పడేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయ వివాదమే కారణమా?

మెచ్చిరి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ వివాదమే హత్యకు దారితీసిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ అర్చకులను వైసీపీ ప్రభుత్వ హయాంలో తొలగించారు. అర్చకులు కోర్టును ఆశ్రయించడంతో వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. అయినా ఆలయ ప్రవేశానికి వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. రెండ్రోజుల క్రితం ఆదెప్ప చొరవతో అధికారులు.. హైకోర్టు ఉత్తర్వులను అమలుచేస్తూ అర్చకులను ఆలయ ప్రవేశం చేయించారు. దీనిని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులే.. హత్య చేయించి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)- మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్, మొహాలీ క్యాంపస్‌లు వీటిని అందిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్‌లు పూర్తిచేసిన వారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

- దరఖాస్తు ఫీజు: రూ.2,000
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 28
- వెబ్‌సైట్: isb.edu

ఐఎస్‌బీలో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు



పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు

పీజీపీ ఇన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని ఎంబీఏ డిగ్రీకి సమానంగా పరిగణిస్తారు. ఇందులో భాగంగా ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కూడా ఉంటుంది.

అర్హత: ఏదేని డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. జీమ్యాట్/జీఆర్ఈ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్, నాయకత్వ లక్షణాలు పరిశీలించి అభ్యర్థుల షార్ట్ లిస్ట్ రూపొందిస్తారు. వీరికి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15

పీజీపీఎంఏఎక్స్: ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. దీనిని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు, బిజినెస్ ఓనర్స్‌కు ఉద్దేశించారు. ఇది ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ డిగ్రీకి సమానం. ప్రోగ్రామ్ మొత్తానికి 24 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: ఏదేని డిగ్రీ/సీఏ/ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, అనుభవం, అచీవ్‌మెంట్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

దరఖాస్తు ఫీజు: రూ.10,000

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 1

పీజీపీప్రొ: ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. ముంబై, బెంగళూరు క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఇది వీకెండ్ ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు సమానం. ఫైనాన్స్, మార్కెటింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 18

పీజీపీఎంఎఫ్ఏబీ: ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. ఇది మాడ్యులర్ ప్రోగ్రామ్. దీనిని కుటుంబ పరంగా సొంత బిజినెస్‌లు నిర్వహిస్తున్నవారికి ఉద్దేశించారు. ఇందులో బిజినెస్ ఆపరేషన్స్, మేనేజ్‌మెంట్ మెథడాలజీ, టూల్స్ అండ్ టెక్నిక్స్, లీడర్‌షిప్ టెక్నిక్స్ నేర్పిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా రెండు ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

అర్హత: ఏదేని డిగ్రీ/సీఏ ఉత్తీర్ణులై ఉండాలి. అనుభవం తప్పనిసరి కానప్పటికీ కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఎంపిక: ఫ్యామిలీ బిజినెస్‌పై అవగాహన, బిజినెస్ లీడర్‌షిప్ సామర్థ్యం, అకడమిక్ ప్రతిభ, బీఏటీ(బిజినెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్)స్కోర్, ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

బీఏటీ వివరాలు: దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో కమ్యూనికేషన్ అనాలిసిస్, క్రిటికల్ థింకింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 15 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మోడల్ పేపర్ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

దరఖాస్తు ఫీజు: రూ.15,000

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మొదటి రౌండ్‌కు నవంబరు 10; రెండో రౌండ్‌కు 2025 మార్చి 9

అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ బిజినెస్ అనలిటిక్స్(ఏఎంపీబీఏ)

ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. ఇది హైబ్రిడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్. ప్రోగ్రామ్‌లో భాగంగా డేటా మేనేజ్‌మెంట్, ప్రోగ్రామింగ్, స్టాటిస్టిక్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిజినెస్ అప్లికేషన్స్ అంశాలకు సంబంధించి థియరీ సెషన్స్, ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటాయి. ఫౌండేషనల్ ప్రాజెక్ట్‌లు, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు పూర్తిచేయాల్సి ఉంటుంది. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: ఇంజనీరింగ్, టెక్నాలజీ, స్టాటిస్టిక్స్, మేథమెటిక్స్, సైన్స్ విభాగాల్లో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్, ప్రోగ్రామింగ్ అంశాల్లో పూర్తి పరిజ్ఞానం ఉండాలి. అడ్మిషన్ నాటికి కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. జీమ్యాట్/జీఆర్ఈ/క్యాట్/ఎన్‌మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు.

'సర్దార్ పటేల్' టెక్స్‌టైల్ స్కూల్లో డిగ్రీ, ఎంబీఏ

కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, కోయంబత్తూరులో నిర్వహిస్తున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ టెక్స్‌టైల్స్ అండ్ మేనేజ్‌మెంట్(ఎస్‌వీపీఐటీఎం)- డిగ్రీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్(ఎస్‌వీపీఈటీ)/సీయూఈటీ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు ఇతర మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌లను కూడా అనుమతిస్తారు. చేనేత కార్మికుల పిల్లలకు ఎడ్యుకేషనల్ స్కాలర్‌షిప్; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ ఇస్తారు. డిగ్రీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు పూర్తిచేసిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఇంటర్న్‌షిప్స్, ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. సంస్థ షార్ట్ టర్మ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లను కూడా నిర్వహిస్తోంది.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: మూడేళ్ల వ్యవధి గల బీఎస్సీ (టెక్స్‌టైల్స్/టెక్నికల్ టెక్స్‌టైల్స్), బీబీఏ టెక్స్‌టైల్ బిజినెస్ అనలిటిక్స్; నాలుగేళ్ల వ్యవధి గల బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్)(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఇవి ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లు. బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్)(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లో మూడేళ్ల కోర్సు పూర్తిచేసిన తరవాత బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్) డిగ్రీతో ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది.

అర్హత: బీఎస్సీ ప్రోగ్రామ్‌లకు గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్ కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు; టెక్స్‌టైల్ సబ్జెక్టులతో ఒకేషనల్ స్ట్రీమ్ కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్)(ఆనర్స్/రీసెర్చ్), బీబీఏ ప్రోగ్రామ్‌లకు ఏ గ్రూప్‌తోనైనా ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు అర్హులు. ఇంటర్ స్థాయిలో జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు కనీసం 45 శాతం మార్కులు ఉండాలి.

ఎంబీఏ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మేనేజ్‌మెంట్, రిటైల్ మేనేజ్‌మెంట్, టెక్నికల్ టెక్స్‌టైల్స్ మేనేజ్‌మెంట్, టెక్స్‌టైల్ బిజినెస్ అనలిటిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: యూజీసీ/ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ వరకు జనరల్ కేటగిరీకి కనీసం ద్వితీయ శ్రేణి మార్కులు; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు కనీసం 45 శాతం మార్కులు; ఇతర రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు ఉండాలి.

ఎస్‌వీపీ ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంట.

- **డిగ్రీ ఎంట్రెన్స్ టెస్ట్ సిలబస్:** ఇంగ్లీష్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్/డేటా ఇంటర్‌ప్రిటేషన్, అనలిటికల్ స్కిల్స్, రీజనింగ్, జనరల్ ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్
- **ఎంబీఏ ఎంట్రెన్స్ టెస్ట్ సిలబస్:** ఇంగ్లీష్/వెర్బల్ ఎబిలిటీ, మేథ్స్/క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్

షార్ట్ టర్మ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు: మెడికల్ టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్, నాన్ వోవెన్ టెక్స్‌టైల్స్ మేనేజ్‌మెంట్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అప్లికేషన్స్ ఇన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మొదటి రెండు ప్రోగ్రామ్‌ల వ్యవధి 30 గంటలు. చివరి ప్రోగ్రామ్ వ్యవధి 15 గంటలు. వీటిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు.

అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. టెక్స్‌టైల్స్ సంబంధిత విభాగాల్లో అనుభవం ఉన్న స్టూడెంట్స్, ఆంత్రప్రెన్యూర్స్, ఉద్యోగులకు ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.svpitm.ac.in

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో యూజీ ప్రవేశాలు



తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌కేటీయూ- సెంట్రల్ యూనివర్సిటీ)- అండర్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నాన్ సీయూఈటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. శాస్త్రి, బీఏ ఆనర్స్, బీఎస్సీ(కంప్యూటర్స్/యోగా) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఇవి ఫుల్ టైమ్/రెగ్యులర్ ప్రోగ్రామ్‌లు. బీఏ ఆనర్స్ మినహా ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఏ ఆనర్స్ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. అభ్యర్థి వయసు 2024 ఆగస్టు 15 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ట్రెడిషనల్ సబ్జెక్టులను సంస్కృత మాధ్యమంలో, మోడరన్ సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తారు.

శాస్త్రి విభాగాలు: వేదభాష్యం, వ్యాకరణం, ఫలిత జ్యోతిషం, వాస్తు, ధర్మశాస్త్రం, న్యాయం, సంఖ్యా యోగ, మీమాంస, అద్వైత వేదాంతం, విశిష్టాద్వైత వేదాంతం, ద్వైత వేదాంతం, ఆగమం, సాహిత్యం, పురాణేతిహాసాలు

అర్హత వివరాలు: సంస్కృతం ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్ ఉత్తీర్ణులు; సంస్కృతంలో డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సులు చేసినవారు; ప్రాక్ శాస్త్రీ ప్రోగ్రామ్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. శాస్త్రీ ప్రోగ్రామ్‌నకు ఉత్తర మాధ్యమ, మాధ్యమ, ఉప సంహిత, వేద విభూషణ కోర్సుల్లో ఒకటి పూర్తిచేసినవారు; బీఎస్సీ(యోగా) ప్రోగ్రామ్‌నకు డిప్లొమా(యోగా)ఉత్తీర్ణులు కూడా అర్హులే. బీఎస్సీ కంప్యూటర్స్ ప్రోగ్రామ్‌నకు ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.


- సీయూఈటీ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ పూర్తిచేసిన తరవాత మిగిలిన సీట్లను మాత్రమే నాన్ సీయూఈటీ అభ్యర్థులకు అలాట్ చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 21
- **వెబ్‌సైట్:** www.nsktu.ac.in

SCHOLARSHIP ALERT

Aadhar Kaushal Scholarship Program for Youth with Disabilities



Description: An initiative of Aadhar Housing Finance Limited(AHFL) to ensure equal educational opportunities for all physically disabled students, irrespective of their geographical location, gender, or socio-economic condition.

Eligibility: Students with physical disabilities pursuing general or professional undergraduate courses across India. Pan-India students can apply. Students must have achieved a minimum of 60% marks in the preceding academic year. Applicants with a gross annual family income of up to INR 2.5-3 lakh are eligible to apply.

Prizes & Rewards: Scholarship between INR 10,000 - INR 50,000 *Last Date to Apply:* 23-07-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/AKSP1

IDFC FIRST Bank MBA Scholarship

Description: IDFC FIRST Bank MBA Scholarship is a need-based scholarship program run by IDFC FIRST Bank to financially support students with a family income of less than INR 6 lakh per annum. The purpose of this scholarship is to make post-graduate studies in business management accessible to meritorious students who are unable to pursue higher studies due to financial constraints.

Eligibility: Indian students enrolled in the first year of a 2-year full-time MBA program for the class of 2024 at selected educational institutions may apply for this scholarship. Applicants' gross annual family income should be less than or equal to INR 6 lakh. Applicants must have a valid mobile number linked to their Aadhaar number.

Prizes & Rewards: INR 2 lakh for 2 years of MBA studies (INR 1 lakh/year) *Last Date to Apply:* 31-07-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/IFBMS5

Muskaan Scholarship Program

Description: A CSR initiative by Valvoline Cummins to offer financial assistance and mentorship support to children of commercial drivers(LMV/HMV), mechanics and individuals from the Economically Weaker Section (EWS) category, ensuring continuity in their education.

Eligibility: Students studying in Classes 9 to 12 from the southern, eastern, and north-eastern states (Assam, Manipur, Nagaland, Mizoram, Tripura, Arunachal Pradesh, Sikkim, Odisha, Bihar, Puducherry, Chhattisgarh, Kerala, Telangana, Andhra Pradesh, Jharkhand, Karnataka, Meghalaya, Tamil Nadu, and West Bengal) are eligible to apply. The scholarship is available to children of commercial drivers (LMV/HMV), mechanics and children from the Economically Weaker Section (EWS) category. Applicants must have scored 60% or above in their previous class to be eligible. The total family income from all sources should not exceed INR 8 lakh per annum.

Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support

Last Date to Apply: 03-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/MKSP1

buddy4study.com



చిలుక దివ్యదృష్టి

అక్బర్ చక్రవర్తికి ఒక ప్రియమైన ఉంగరం ఉండేది. రోజూ రాత్రి ఆ ఉంగరాన్ని వేలి నుండి తీసి పక్కన పెట్టి ఉదయం మళ్లీ చేతికి పెట్టుకోవటం చక్రవర్తికి అలవాటు. ఒక ఉదయం అక్బర్ చక్రవర్తి నిద్ర లేచేసరికి ఎదురుగా కనిపించాల్సిన ఉంగరం మాయమైంది. తన గదిలో ఎంత వెదికినా ఉంగరం కనపడలేదు. ఎవరు తీశారో కనుక్కోవాలని వెంటనే రాజభక్తులను పిలిపించారు అక్బర్. కోపంతో.. 'ఈ తలుపులు మూసేసి.. పని



వారందరినీ లోపలే ఉండమని చెప్పండి' అని హుకుం జారీ చేశాడు రాజుగారు. ఆ వెంటనే బీర్బల్‌కు కబురు పంపారు.

బీర్బల్ వస్తూ వస్తూ ఓ చిలుకను తీసుకొచ్చారు. ఆ చిలుకను చూడగానే.. 'చిలుక జోతిష్యం చెప్పడానికి మిమ్మలను రమ్మన్నానా' అంటూ కోపంతో మాట్లాడారు అక్బర్. బీర్బల్ మెల్లగా.. 'జహాపనా.. ఈ చిలుక దివ్యదృష్టి కలది. మీ ఉంగరం ఎవరు తీశారో ఇది కనిపెట్టి గాల్లోకి లేచి దొంగ దొంగ.. అని అరుస్తుంది' అని చెప్పాడు. బీర్బల్ తన చేత్తో చిలుక తలమీద నిమిరాడు. అది రెక్కలు టపటపలాడిస్తూ దొంగ దొంగ.. అని అరిచింది గాల్లోకి వెళ్లి. ఆ అరుపులు విని అక్కడి పనివాడు ఒకడు మెల్లగా జారుకోవటానికి ప్రయత్నించాడు. 'ఇదిగో మీరు వెతుకుతున్న దొంగ' అని ఆ దొంగను అప్పగించాడు బీర్బల్. అక్బర్ ఆశ్చర్యపోయారు. 'ఈ చిలుకకు దివ్యదృష్టి ఎలా వచ్చింది' అంటూ ఆసక్తితో అడిగారు. 'మరేం లేదు మహారాజా.. ఈ చిలుకకు దొంగ.. అనే మాట మాత్రమే నేర్పించాను. నిజంగా దొంగతనం చేసినవాడు తనను చూసి అరుస్తుందేమోనని అనుకుంటాడు. భయంతో తప్పించుకోవాలని ప్రయత్నిస్తాడు. అందుకే సులువుగా పట్టుకోగలిగాం'అని జవాబు చెప్పాడు బీర్బల్. ఆ చమత్కారానికి అక్బర్ మనసారా నవ్వుకున్నారు. బీర్బల్‌కు మంచి బహుమానాలు ఇచ్చారు.

6 తేడాలు గుర్తించండి!






దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 354

7			1					2
1								
	2			3		7		6
5	3				9	6		
	6		7		1		9	
		4	2				5	8
6		5		7			3	
								4
2					4			5

సుడోకు - 353 సమాధానం

6	3	8	1	2	5	4	9	7
1	4	2	6	7	9	3	5	8
7	9	5	4	3	8	6	2	1
4	5	7	9	6	1	8	3	2
9	8	3	7	4	2	1	6	5
2	6	1	8	5	3	7	4	9
3	1	9	5	8	4	2	7	6
8	7	4	2	9	6	5	1	3
5	2	6	3	1	7	9	8	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.